తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2019 వెల రూ.5/-




రథసప్తమి (12-02-2019) పర్వదినాన
తిరుమల శ్రీవారు
'సప్తవాహనాల' పై
ఊరేగిన దృశ్యాలు
సూర్యప్రభవాహనం
కల్పవృక్షవాహనం
సర్వభూపాలవాహనం
హనుమద్వాహనం
గరుడవాహనం
చంద్రప్రభవాహనం
చిన్నశేషవాహనం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్యస్స మే ప్రియః ॥ ॥**

(శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయం- 17వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** యః=ఏ; భక్తిమాన్= భక్తుడు; న హృష్యతి= ఇష్టప్రాప్తికి సంతోషించడో; న ద్వేష్టి= అనిష్టప్రాప్తిని ద్వేషించడో; న శోచతి= ఇష్టవస్తువు నష్టమైతే శోకించడో; న కాంక్షతి= అప్రాప్తాన్ని వాంఛించడో; (మరియు) యః=ఎవడు; శుభ అశుభ పరిత్యాగీ= పుణ్యపాపాలను పరిత్యజించిన వాడో; సః=అతడు; మే=నాకు; ప్రియః=ఇష్టుడు.

**భావం:** శుభం చేకూరితే సంతోషపడడు, కీడు కల్గితే ద్వేషాన్ని పొందదు, ఇష్టమైనది పోయినా దుఃఖించడు, తనకు లేని వస్తువును కోరడు, పుణ్యపాపాలను ఇచ్చే కర్మలను ఆచరించడు – ఇటువంటి భక్తుడే నాకు ఇష్టమైనవాడు.

## రాముఁడు నరుఁడన వచ్చునా ?

సర్వరక్షకుఁడైన సర్వేశుఁడే కాక
ఉర్వీమీఁదనందరిలో నొక్కఁడా రాముఁడు

కొండ పాడవులైన ఘోరవానరబలము
గుండుగా వారిధి దండ గూడ బెట్టి
నిండుజటనిధిగట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁడన వచ్చునా ?

అన్నిటా దేవతలకు నసాధ్యమైన రావణు
నెన్నికగాఁ బుత్ర మిత్ర హితుల తోడ
పన్ను కొన్ని శస్త్రాస్త్ర పంక్తులనె ఖండించె
సన్నుతినిట్టే రాముని జనుఁడన వచ్చునా?

చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి
బలువుగ సీతఁ గూడి పట్టమేలి
ఇలలో శ్రీవేంకటాద్రి నిరవై లోకము గాచీ
నలువంక రాముఁడు నరుఁడన వచ్చునా?

(సంపుటం-11, సంకీర్తన-208)



అందరినీ రక్షించేవాడు, అందరికీ ప్రభువైన శ్రీరాముడు భూమి పైనున్న మానవులలో ఒకడా ? అని ప్రశ్నిస్తూ కాదని మిగిలిన మూడు చరణాలలో సమాధానాలనిస్తున్నాడు.

అరణ్యంలో, కొండలలో చాలా వరకు వ్యాపించిన ఘోరమైన వానర బలసాయంతో గుండుగా నిండు సముద్రంపై వంతెన అనే దండను ఏర్పాటుచేసి లంకానగరాన్ని సంపాదించినవాడు. ఇంత గొప్ప కార్యాన్ని సాధించిన రాముడు మానవుడా ! కాదని భావం.

అన్ని విధాల దేవతలతో కూడా ఎదిరించడానికి సాధ్యం కాదని రావణుని ఎన్నుకుని కొడుకులతో స్నేహితులతో మేలుచేసే వారితో కూడిన ఆ రావణుణ్ణి.. శస్త్రాస్త్రాలతో పూనుకుని ఖండించిన.... రాముడు, సామాన్యమానవుడా? కాదని భావం!



ప్రతిజ్ఞ చేసి విభీషణునికి లంకారాజ్యాన్ని ఇప్పించి, లెక్కలేని బలంతో కలిసి సీతతో కలిసి అయోధ్యకు వెళ్లి పట్టాభిషేకం చేసుకొని శ్రీవేంకటాద్రిని చేరుకుని నాలుగు దిక్కులతో కూడిన లోకాన్ని పాలించే శ్రీవేంకటేశ్వరుని రూపంలో నున్న శ్రీరాముడు నరుడా! కానేకాదని అన్నమయ్య సిద్ధాంతం.

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒక రోజు విరాళ పథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవాడికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుచానూరులలో నిత్యం అన్నప్రసాద వితరణ చేస్తోంది. దీనికి ఎంతో మంది దాతలు విరివిగా విరాళాలు ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒకరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చును కూడా భక్తుల నుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులు స్పందించండి! తోటివారి ఆకలి తీర్చండి!! మాధవుని అనుగ్రహాన్ని పొందండి!!!

**రోజువారి ఖర్చు..**

| | | |
|---|---|---|
| 1) అల్పాహారం (టిఫిన్) | - | 06 లక్షలు |
| 2) మధ్యాహ్న భోజనం | - | 10 లక్షలు |
| 3) రాత్రి భోజనం | - | 10 లక్షలు |
| మొత్తం | - | 26 లక్షలు |

ఈ మొత్తాన్ని దాతలు
తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు
అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానే కాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులు సంయుక్తంగా విరాళాలు అందజేయవచ్చు.

దాతలు రోజు వారి మొత్తం(రూ.26 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.6 లక్షలు) గానీ, మధ్యాహ్న భోజనం (రూ.10 లక్షలు) గానీ, రాత్రి భోజనం - (రూ.10 లక్షలు) గాని ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. దాతలకు తి.తి. దేవస్థానములు కల్పించే సౌకర్యాలు ఒకే మాదిరిగా ఉంటాయి.

మరిన్ని వివరాలకు - స్పెషల్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు, తి.తి.దే.పరిపాలనా భవనము, కె.టి. రోడ్డు, తిరుపతి. www.tirumala.org వెబ్‌సైట్‌లో కూడా వివరాలు చూడవచ్చు. ఫోన్ - 0877 - 2264258, 2264375, 2264237.



పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

**శ్రీ వికారి నామ సంవత్సర**

**ఉగాది శుభాకాంక్షలు!**

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు
అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ
స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 49 ఏప్రిల్, 2019 సంచిక : 11



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥

**గౌరవ సంపాదకుడు**
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకుడు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకుడు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకుడు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

శ్రీ పి.శివప్రసాద్, తి.తి.దే., తిరుపతి
విశ్రాంత చిత్రకారుడు

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| కాలం అనుకూలించాలని.... | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| అదిగో... భద్రాద్రి! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 09 |
| సందేహాలు - సమాధానాలు | బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి | 12 |
| మత్స్యావతార గోవిందా! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 13 |
| తిరుమల శ్రీవారి సన్నిధిలో... | శ్రీమతి పి.విజయలక్ష్మి | 16 |
| ఆరు అవరోధాలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 20 |
| రామాయణం- ఆధునిక జీవనం | డా॥ గరికిపాటి నరసింహారావు | 21 |
| సర్వవేదసారం! | డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 24 |
| నవచైతన్య మాసం.. చైత్రం | డా॥ కప్పగంతు రామకృష్ణ | 31 |
| కృతయుగం నుంచి.. ఒంటిమిట్టలో.. కోదండరాముడు! | శ్రీ కట్టా నరసింహులు | 34 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 38 |
| కైవల్యానికి దారి! | డా॥ వి.కృష్ణవేణి | 39 |
| సీతాకల్యాణవైభోగమే! | డా॥ వి.పళని | 41 |
| మమ్ము గడియించుకున్నట్టి శ్రీవేంకటేశుడా! | డా॥ కలువగుంట రామమూర్తి | 45 |
| ఈ ఒక్క పత్రిక చాలు! | గురుసహస్రావధాని డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ | 46 |
| శృంగార నీరాజనాలు | శ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్య | 48 |
| రామాయణ కల్పవృక్షం - 'వాలి' వ్యక్తిత్వం | డా॥ పి.సి. వేంకటేశ్వర్లు | 49 |
| చేదూ మంచిదే! | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 51 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీసీతాసమేత కల్యాణరామయ్య, ఒంటిమిట్ట
వెనుక చిత్రం : శ్రీసీతారామలక్ష్మణమూర్తులు, తిరుమల ఆలయం

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు, రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

## సంపాదకీయం

# ధర్మవసంత ఉగాది...

ప్రాచీనకాలం నుండి సనాతనధర్మాచరణానికి ఆయువుపట్టులు దేవాలయాలు. దేవాలయం కేంద్రంగా ధార్మిక, భక్తి, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక, సంగీతాది కార్యక్రమాలను, ఎన్నో లలితకళలను అభివృద్ధి చేయడం సులభం. అందరినీ కలుపుకుని ఆ గ్రామాన్ని సన్మార్గంలో నడపడంలో, ప్రజలలో భక్తిచైతన్యాన్ని చేకూర్చడంలో ఆలయాలు ఎనలేని సేవ చేశాయి, చేస్తున్నాయి. ఆలయాలు వైద్యాలయాలుగా, న్యాయస్థానాలుగా, ధర్మాధర్మ వివేచనాస్థానాలుగా సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి ఆలయాన్ని మించిన శక్తివంతమైనసాధనం లేదు.

ప్రస్తుత కాలపరిస్థితుల్లో మన సనాతనధర్మం, హైందవసంప్రదాయాలు, విలువలు కొడిగట్టినదీపాలవలే మినుక్కుమినుక్కుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో, ఇప్పటికే తి.తి.దే. వారు అనేక దశాబ్దాలుగా ధర్మచైతన్యస్ఫూర్తిని, సత్సంప్రదాయాలను ప్రచారం చేయడంలో తమవంతు కృషి బహుముఖాలుగా చేస్తున్నారు. దీనికి తోడు మన సమాజంలో అట్టడుగువర్గాలు, అణగారినజీవితాలతో కాలం గడుపుతుండగా వారికి సమాజంలో సముచితస్థానాన్ని కల్పించడంతో పాటు వారిలో ధార్మికచైతన్యాన్ని కలుగజేసి, ఆత్మన్యూనతాభావాన్ని తొలగించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కంకణం కట్టుకుని ముందుకు సాగుతోంది.

ఈ మహత్తర ఆశయంలో సింహభాగంగా ఎస్.సి, ఎస్.టి., బి.సీ. సామాజికవర్గ గ్రామాలలో, వారు కోరుకున్న దేవుని కనుగుణంగా ఆలయాలు నిర్మించి, వారినే అక్కడ అర్చకులుగా ఎంపిక చేసి వారికి సంప్రదాయబద్ధమైన, అర్చనవిధానాన్ని, ఆలయవిజ్ఞానాన్ని, హైందవసంస్కృతిని ముప్పేటలుగా నేర్పేందుకు 2017, మే నెల నుండి తి.తి.దే. యాజమాన్యం అర్చకశిక్షణకార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటివరకు సుమారు ఆరువందల మంది శిక్షణ పొందారు. అందుకు తగ్గ పాఠ్య ప్రణాళిక, ఆలయవిజ్ఞాన గ్రంథాలు సరళవ్యావహారికంలో ముద్రించి, ఇందుకు శిక్షణ పొందిన అధ్యాపకుల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం వారి సనాతన హిందూధర్మప్రచారపరిషత్తు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తోంది.

పదకవితాపితామహుడైన అన్నమయ్య 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అంటూ మానవులలో హెచ్చుతగ్గులు లేవని, భగవంతుని దృష్టిలో అందరూ సమానులేనని బోధించిన బోధ – ఈ సమాజంలో స్థిరంగా నాటుకునేటట్టుగా ఈ నూతన వసంత 'వికారి' ఉగాది విశేషంగా ధర్మకార్యాలు చేయిస్తూ సనాతన ధర్మప్రచారం విస్తృతంగా జరిగేటట్టుగా శ్రీవారికృపతో ముందుకు నడిపిస్తుందని ఆశిద్దాం.

'ఉగాది' శుభసందర్భంగా సమాజం పురోగమిస్తుందని అన్నమయ్య ఆశయాన్ని ఇతోధికంగా సఫలం చేస్తుందని, శ్రీవేంకటేశ్వరుడు అందరినీ చల్లగా చూడాలని, సమాజం సుఖశాంతులతో ఉండాలని కోరుకుందాం!

# కాలం అనుకూలించాలని...

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

కాలగణనంలో ఒక శాస్త్రీయపద్ధతిని ఏర్పరచుకున్న మన సంస్కృతి ప్రకారం నూతనసంవత్సరం ప్రారంభమయ్యింది.

**'ఉగం' అనే మాట 'జంట'ను సూచిస్తుంది. 'సంవత్సరం' అని ఈ పదానికి అర్థం. ఒక సంవత్సరంలో ఉండే ఉత్తరాయణ, దక్షిణాయనాలను ఇది తెలియజేస్తుంది.**

**ఒక దినంలో పగలు, రాత్రి ఉన్నట్లే ఒక ఏడాదిలో ఉత్తరాయణ దక్షిణాయనాలున్నాయి. ఈ 'ఉగానికి తొలిదినం ఉగాది. అసలు-యుగానికి కూడా ఇదే తొలి రోజు అని మన శాస్త్రాలు చెబుతున్నాయి.** ఎక్కువగా మన తెలుగువారితో పాటు ఇతరులు, చాంద్రమానం ప్రకారం జరుపుకునే సంవత్సరాది చైత్రశుద్ధ పాడ్యమి.

కాలంలో 'సంవత్సరం' ప్రధానం. ఒక ఋతు చక్రమే సంవత్సరం. దీని ఆకృతులే తరువాత వచ్చేవి. కనుక సంవత్సరాన్ని ప్రధానంగా గణించారు. కాలంలో జరిగే మార్పులు, వాటికనుగుణంగా ప్రకృతిలో సంభవించే గమనాలు... ఈ విభిన్నతలన్నీ దేనిలో సమగ్రంగా నివసిస్తాయో దానిని 'సంవత్సరం' అని నిర్వచించారు.

ఘటన, అనుభవం... ఇవన్నీ కాలాన్ని ఆధారం చేసుకుని నడుస్తాయి. అందుకే కాలాన్ని దైవశక్తిగా ఉపాసించడం మన సంప్రదాయం. కాలం అనుకూలించాలని అనుకోనివాడు ఉండడు కదా! అలా అనుకూలించేలా కాలంలోని అంతర్లీనదైవశక్తిని అనుసంధానించుకోవడమే ఈ ఉగాదుల వేడుకలు. సంవత్సరం తిరిగే మలుపులో కాలపురుషుని సంవత్సరావతారాన్ని స్మరించుకుంటాము. ఈ ప్రారంభ దినాన తిథి, వార, నక్షత్రదేవతల్ని, సంవత్సరంలో సంభవించే ప్రధాన ఖగోళ పరిణామాలనీ స్మరించుకుని ఆరాధిస్తాం.

శుచియైన శరీరంతో, శుభ్రమైన గృహంలో, మంగళకర వాతావరణంలో- ఈ కాలం అందరికీ అనుకూలించాలని- పంచాంగ శ్రవణాదులను ఆచరించడం ఎంతో చక్కని పద్ధతి. ఈ మంగళకర విధానంలో జరుపుకొనే వేడుక మన పర్వదినాలకు మాత్రమే ఉన్న ప్రత్యేకత.

శుచిస్వరూపులైన... దేవతా శక్తులు స్పందించాలంటే శుచి కలిగిన వాతావరణంలో, శుభస్వభావంతో చేసే భావనలే.. శుభాకాంక్షలై....

**ఈ భావన వల్లనే ఈ వత్సరాది ప్రాతర్వేళ శుచిగా, శుభంగా భగవదారాధన చేసి... వ్యక్తికీ, సమాజానికీ కాలస్వరూపుడైన దేవాదిదేవుని అనుగ్రహం లభించాలని ఆశిస్తూ... అర్చనలు చేస్తాం.**

**తిథి, హోర, నక్షత్ర, వార.... మొదలైనవన్నీ దేవతా స్వరూపాలుగా సంభావించి నిత్యం సంకల్పంలో వాటిని తలంచుకొనడం కాల దేవతాశక్తిని ఆరాధించడమే.**



**ఒక మహాగ్నిలో.. ప్రతికణం... కూడా పూర్ణ అగ్నిశక్తిని దాచుకుని ఉంటుంది. అలాగే అనంతకాలంలో ప్రతి క్షణం లోనూ... కాలశక్తి నిక్షిప్తమై ఉంటుంది.**

నిశ్చింతగా సత్ఫలాలనిస్తాయి. మన శుభాకాంక్షలకు ఏర్ప రచిన పవిత్ర నేపథ్యమిది. ఖగోళంలోని గ్రహాదుల ప్రస రణల ప్రభావం పృథివిపై ఉన్నా, ప్రధాన ప్రాణశక్తి మాత్రం సూర్యుని నుంచి పొందుతున్నాం. అందుకే ఈ అరవై సంవత్సరాల పేర్లన్నీ సూర్యశక్తి విశేషాలే.

ఈ ఉగాది ప్రారంభవేళ కాలంలో ఉన్న విభిన్నతల సమన్వయం కలి లక్షణం. ఏ యుగంలో ఈ లక్షణం విస్తారంగా ఉంటుందో అదే కలియుగం. ఈ స్వభావం మిగిలిన యుగాల్లో అల్పపరిమాణంలో ఉంటుంది. అక్కడక్కడా అప్పుడప్పుడూ తల ఎత్తుతుంటుంది. దానివల్ల పెద్ద ప్రమాదం లేదు.

కానీ, అది నిరంతరం విస్తృతంగా వ్యాపించినప్పుడే మహాప్రమాదం. **'కల్యంతే కలహం కుర్వంత్యస్మిన్- కలిః'** కలహమే కలి. దరిద్రానికి ఆధారం కలహం. ప్రాచీన యుగంలో అనాచారాన్ని అవకాశంగా చేసుకుని నల చక్రవర్తిలో ప్రవేశించాడు కలి. ఎవరు చెప్పినా వినకుండా నలుడు జూదంలో అన్నీ ఓడిపోయాడు. చివరకు తోడుగా వచ్చిన భార్యను కూడా విడిచిపెట్టాలనే బుద్ధిపుట్టింది కలి

**వైకుంఠపాళి**

**:: 40 - సమాధానాలు ::**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 వి | 2 శ్వా | మి | 3 త్ర | మ | 4 హ | ర్షి | |
| 5 శ | | నం | | యో | | ర్షం | | 6 కూ |
| 7 ప | న్ను | | 8 చె | ద | లు | | 9 చే | ప |
| థం | | 10 వ | | శి | | 11 అ | | ము |
| | 12 వా | ల్మీ | కి | | 13 సా | వి | త్రి | |
| 14 బా | | కం | | 15 వై | | సె | | 16 ఇ |
| 17 లా | వు | | 18 సా | జ | ము | | 19 అ | ష్ట |
| జి | | 20 చీ | | యం | | 21 రా | | ము |
| | 22 ప్రా | చీ | న | తి | ల | క | ము | |

ప్రభావం వల్లనే. విడిపోవడాలు, విడదీయడాలు... ఇవే కలి లక్షణాలు.

**జగతిలో కలిసి ఉండటానికి హేతువులుంటాయి. విడిపోవడానికి కారణాలుంటాయి. ఈ విభజన కారణాలనే పెద్దవి చేస్తే కలియుగం.**

భారతకాలంలో కలి స్వభావం దుర్యోధన రూపంలో ప్రత్యక్షమైంది. అటుతరువాత ఏకంగా కలిపురుషుడి కాలమే మొదలయ్యింది. అనాచారం, దురాచారం కలిపురుషుడికి ఆహ్వానం పలుకుతాయి. కలహించుకోవడం, వేరుపడడం ఫలితాలుగా మిగులుతాయి. దాంతో ఆసురీ లక్షణాలు పెచ్చు పెరుగుతాయి. మనం ప్రస్తుతకాలంలో ప్రపంచమంతటా చూస్తున్న వైనాలివే. కులాలు, మతాలు, వర్గాలు పేరున విడిపోవడాలు. ఒకవేళ ఎవరో కలుసుకున్నా క్షుద్ర, స్వార్థాల కోసం జరిగే అతుకులే తప్ప, సరియైన సమైక్యతలు కావు. పాలకులనుకునేవారిలోనే ఈ విడి, విడదీసే లక్షణాలు పేరుకుని- వైషమ్యాలు లేకుండా బతికే విభిన్నప్రజల్లో జాతి, కుల, మత, ప్రాంతీయ భావాలను రగిల్చి కలహాలను సృష్టించి కల్లోలాల అశాంతికి కారణాలవుతున్నాయి. కలి పురుషుడు పాలించడమంటే ఇదే. పరస్పరాధిక్యాల కోసం పాట్లుపడుతూ సృష్టిలో వైషమ్యాన్ని పెంచడమే కలిపాలన.


"అంతా కలియుగమే. మరి ఏం చేస్తాం?" అని దిగులు పడనవసరం లేదు.

అంతా వర్షకాలమే అయినా- మనం గొడుగు వేసుకునో, రెయిన్ కోట్ ధరించో, ఇంట్లో కూర్చునో వర్షం బారినుంచి తప్పించుకుంటాం. అలాగే **స్నేహస్వభావంతో, భగవత్ ధ్యానంతో- ఎవరి మానాన వారిని బతకనిస్తూ బతికే ప్రయత్నం చేస్తే కొంతమేరకైనా బాగుపడతాం. తమదే గొప్ప సిద్ధాంతమని రాద్ధాంతాలను పెంచడాలు, ఆక్రమణ స్వభావం, విచ్ఛిన్నవైఖరి... ఇవన్నీ కలిదోషాలు.**

ఇవి మనసులో లేకుండా ముందు జాగ్రత్త పడితే, అటుపై మనుగడను కూడా సరిదిద్దుకోగలం!



శాంతం లేని తపస్సు వృథా!




తెలుగువారికి ఇటు ఏడుకొండల వెంకన్న ఏడుగడ;
అటు భద్రాచలరామన్న కాపుదల.

తిరుమలప్పనికి తాళ్లపాక అన్నమయ్య ఎంతో,
భద్రాద్రి రాములవారికి కంచర్ల గోపన్న అంత.

రామదాసుడైన కంచర్ల గోపన్న
తెలుగువారి భజన పద్ధతికి,
భజనకూటాలకి ఆద్యుడని పెద్దలు అంటారు.

'శాస్త్రకట్టు' సంగీతధోరణిలో కాకుండా...
సామాన్యులు భక్తితోను,
ఆర్తితోను పాడుకోవటానికి,
పరమపురుషుణ్ణి ఏకాంతంగానైనా,
మందితోనైనా భజన చేసుకోవటానికి ఇప్పటికీ...
మెరుగు మాయని ముత్యాలు రామదాసు కీర్తనలు....

రామదాసు అంటే భద్రాచలం;
భద్రాచలం అంటే రామదాసు!

శ్రీరామదాసు సమర్థతను గుర్తించిన తానీషా ప్రభువు అతణ్ణి భద్రాచలానికి తాసిల్దారుగా నియమించాడు. ఉద్యోగరీత్యా భద్రాచలం వెళుతూ ఆ భద్రగిరిని వర్ణించిన మనోహర కీర్తన వివరణ 'శ్రీరామనవమి' పర్వ దిన శుభసందర్భంగా మీకోసం...

కీర్తన : వరాళి - ఆది

ప : అదిగో భద్రాద్రి గౌతమి ఇదిగో చూడండి ॥ అదిగో ॥

చ : ముదముతో సీత ముదిత లక్ష్మణుడు
కదిసి కొలువగా కల డదె రఘుపతి ॥ అదిగో ॥

2 చారు స్వర్ణ ప్రాకార గోపుర
ద్వారములతో సుందరమై యుండెడి ॥ అదిగో ॥

3 అనుపమానమై అతిసుందరమై
తనరు చక్ర మది ధగ ధగ మెరిసెడి ॥ అదిగో ॥

4 కలియుగమందున నిల వైకుంఠము
నలరుచు నున్నది నయముగ మ్రొక్కుడి ॥ అదిగో ॥

5 పొన్నల పొగడల పూపొద రిండ్లతో
చెన్ను మీరగను చెలగుచు నున్నది ॥ అదిగో ॥

6 శ్రీకరముగ శ్రీరామదాసుని
ప్రాకటముగ బ్రోచే ప్రభువాసము ॥ అదిగో ॥

ఈ కీర్తనలో భద్రాచలాన్నీ, ఆక్షేత్రవైభవాన్నీ, అక్కడి ప్రకృతిసౌందర్యాన్నీ, స్వర్ణప్రాకారగోపురాదుల్తో శోభిల్లే ఆలయాన్నీ, అందులో సీతాలక్ష్మణ సమేతులై కొలువున్న శ్రీరాముణ్ణీ, అందువల్ల భూలోక వైకుంఠంగా భద్రగిరి విరాజిల్లడాన్నీ దర్శించీ, భావించి, గౌతమీ నదిలో స్నానం చేసి, పవిత్రులై భద్రాద్రిరాముణ్ణి సేవించి, తరించండనీ రామదాసు సూచిస్తున్నాడు.

## మరింత విపులంగా ఈ కీర్తన భావం -

భక్తులారా! అదిగో భద్రాచలం. ఇదిగో గోదావరి నది. రండి చూడండి. సీతాలక్ష్మణులు సంతోషంతో సేవి

స్తుండగా శ్రీరఘురాముడు అక్కడ కొలువై ఉన్నాడు. బంగారు ప్రాకారాలతో, గోపురాలతో, ద్వారాలతో సుందరమైన కోదండరామాలయం అదిగో దర్శించండి. సాటిలేనిదీ, అతిసుందరమైనదీ సార్థకనామ మైనదీ అయిన సుదర్శన చక్రం అదిగో ధగధగ మెరుస్తూంది. చూచి, ధన్యులుకండి! భద్రాచలం కలియుగ వైకుంఠం! అక్కడికి చేరి శ్రీరామునికి మ్రొక్కండి. ఈ క్షేత్రం పొన్నలూ, పొగడలూ, మొదలైన పూపొదలతో రమణీయంగా ఉంది. సకలశుభాలతో రామదాసుణ్ణి రక్షించే ప్రభువు- శ్రీరాముడు నివసించే భద్రాచలం అదిగో! అల్లదే! దర్శించండి.

**విశేషం :** రామదాసు భద్రాచలక్షేత్రాన్ని సమీపించినపుడు కల్గిన భక్త్యావేశంతో ఈ కీర్తన వెలువడింది. అన్నమయ్య "అదివో, అల్లదివో హరివాసము" అంటూ కీర్తించారు. ఏ భక్తుడైనా తన ఆరాధ్యదైవ ముండే దివ్యప్రదేశాన్ని సమీపించేటప్పుడు భక్తి తన్మయత్వంలో అందర్నీకూడా రాండి, స్వామిని దర్శించి, సేవించండి. స్వామి కృపకు పాత్రులు కండి" అంటూ తనఅనుభూతిని పదిమందితో కలిసి పంచుకొని, ఆనందించాలని భావించడం సహజం! భక్తి అంతశ్చైతన్యాన్ని ఇలా ఆవిష్కృతం చేస్తుంది.

ఈ కీర్తన విన్నా, చదివినా భక్తుల మనస్సుల్ని భద్రాచలంవైపు ఆకర్షిస్తుంది. దృష్టి పడినచోట మనస్సూ, మనస్సు లగ్నమైన చోట భావమూ, భావ ముండే చోట రసమూ (ఆనందం) ఉంటాయి.

భద్రాద్రి- క్షేత్రం, గౌతమీనది- తీర్థం, దైవం- శ్రీరామచంద్రమూర్తి ఇలా క్షేత్రమూ, తీర్థమూ, దైవమూ ఒక్కచోట ఉంటే, 'మాహాత్మ్యం' అనే పేరు వస్తుంది. భద్రాచలం మాహాత్మ్యం కల్గిన దివ్యప్రదేశం. ఇతరత్ర గోచరించని ఒక దివ్యమూర్తిత్వం ఇక్కడుంది. ఇక్కడ సీతారాములు కూర్చొని ఉండటం, శ్రీరామునికి నాల్గుచేతులుండటం, ఒక కుడిచేతిలో శంఖం. మరొక కుడిచేతిలో బాణం, ఒక ఎడమచేతిలో చక్రం, మరొక ఎడమచేతిలో కోదండం, వామాంకంపై సీతాదేవి ఉంటుంది. ఎడమవైపున రెండు చేతులు మాత్రమే కల్గిన లక్ష్మణస్వామి బాణం, ధనుస్సు ధరించి ఉన్నాడు. ఇలాంటి వైకుంఠరాముని అర్చామూర్తి ఏ రామాలయంలోనూ, ఎక్కడా లేదు. భద్రాచలరాముడు మర్యాదాపురుషోత్తముడైన చక్రవర్తి రాముడు కాదు. సాక్షాత్తు వైకుంఠధాముడైన రాముడు. కనుకనే శంఖచక్రాలున్నాయి. బాణకోదండాలున్నాయి. ప్రక్కన సీతాలక్ష్మణులున్నారు.

సీతారాములు ఎక్కడుంటే అదే అయోధ్య, అదే వైకుంఠమని భావించి, వాళ్లనే లక్ష్మీనారాయణులుగా దర్శించి, సేవలు చేస్తుండ మని తల్లి సుమిత్ర లక్ష్మణునికి సూచన లిచ్చిన దివ్యప్రబోధసన్నివేశం శ్రీమద్రామాయణంలో ఉంది.

**రామం దశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజామ్ ।**
**అయోధ్యా మటవీం విద్ధి, గచ్ఛ తాత యథా సుఖమ్**
**(అయోధ్యా. 40-11)**

ఈ సుమిత్రాసందేశంలో అంతరార్థంగా రాముడు విష్ణువనీ, సీత లక్ష్మి అని, అడవియే వైకుంఠమనీ దివ్య ప్రబోధం ఉంది. ఆనాటి సుమిత్రా సందేశం సార్థకంగా, తనను సేవించడానికై లక్ష్మణుణ్ణి పరమసంతోషంగా పంపిన పినతల్లి ఆశయాన్ని సఫలం చేస్తూ ఆ శ్రీరామనారాయణుడు భద్రాచలంలో శంఖచక్రధారియై, ధనుర్బాణధారియై వైకుంఠ రాముడుగా అర్చనలు అందుకొంటున్నాడు. ఈ విషయాన్ని గుర్తించే రామదాసు-



**శ్రీరమ సీతగాగ, నిజసేవకబృందము వీరవైష్ణవా**
**చారజనంబు గాగ, విరజానది గౌతమిగా, వికుంఠము**
**న్నారయ భద్రశైల శిఖరాగ్రము గాగ వసించు చేతనో**
**ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ! కరుణా పయోనిధీ!**

అని కీర్తించాడు. చెంతనున్న లక్ష్మణుడు ఆది శేషుడు. ఇంతటి విశిష్ట చరిత్ర ఉన్నందుననే దీన్ని కలియుగ వైకుంఠమని భేరీవాయించి ప్రకటించాడు– రామదాసు.

గోదావరికి గౌతమి అని పేరు. గౌతమమునిపై ఈర్ష్య చెందిన కొందరు ఋషులు మాయాగోవును సృష్టించి, గౌతమమునిపంటపొలంలో వదలి, ఆవు పంట మేస్తూందని గౌతమమునికి చెప్పారు. గౌతముడు చూచి, దాన్ని కొట్టక, చేతనున్న నీళ్లు చల్లి, పొమ్మని అదిలించాడు. ఆ నీటి బిందువులు పడగానే ఆ మాయాగోవు మరణించింది. గోహత్యాపాతకి ఇంట భుజింపరాదని మునులు వెళ్లి పోతుంటే వాళ్లని ప్రార్థించి, ఏం చేస్తే ఈ పాతకం పోతుందో సెలవియ్యండన్నాడు. వాళ్లు గంగాజలాన్ని ఈ గోవుపై ప్రవ హింపజేస్తే పాపం తొలగుతుందన్నారు. గంగను తేవడానికై గౌతముడు చాలా కాలం తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై తనజడ నొకదాన్ని తీసియిచ్చి, దీన్ని ఆ గోవుపై పిండండ న్నాడు. దాన్ని తెచ్చి గౌతముడు ఆ గోవుపై పిండాడు. వెంటనే గోవు లేచి, స్త్రీ రూపంతో వెళ్లిపోయింది. అక్కడ పడిన నీళ్లు నదియై ప్రవహించాయి. గౌతముడు తెచ్చినం దున ఆ నది **'గౌతమి'** అనీ, గోవును బ్రతికించి నందున **'గోదావరి'** అనీ ప్రసిద్ధి కెక్కింది. కనుక గోదావరి సాక్షాత్తు గంగయే! గంగ విష్ణుపాదోద్భవ కనుక భద్రాచలంలో వైకుంఠరామునిపాదపీఠం దగ్గర ప్రవహిస్తూంది.

ఇంతటి మహత్త్వం ఉన్నందుకే **"అదిగో భద్రాద్రి! గౌతమి ఇదిగో చూడండి!! ముదముతో సీత, ముదిత లక్ష్మణుడు కదిసి కొలువగా కల డదె రఘుపతి"** అని చక్కని దృశ్యాన్ని కీర్తించాడు. ఇందులో క్రమదర్శనం ఉంది. దూరం నుంచీ చూడగానే కన్పించేది భద్రగిరి. కాస్త సమీ పించాక కన్పించేది గోదావరి (గౌతమి). తర్వాత కన్పించేది ఆలయం. లోపలికి వెళ్లాక సీతారామలక్ష్మణుల దివ్యమూర్తి త్రయ దర్శనం.

కుడిచేతిలో కదా చక్రం ఉండాలి! మరి భద్రాద్రి స్వామికి కుడిచేతిలో శంఖం, ఎడమచేతిలో చక్రం ఉంది. విష్ణుదేవునిదివ్యాయుధాలు చేతుల్లో మార్చే విధానాన్ని బట్టి 24 మూర్తులు ఏర్పడతాయి. అవే కేశవాది చతుర్వింశతి (24) రూపాలు. అందులో మొదటిది కేశవరూపం. క+ఈశ+వ= కేశవ కాగా త్రిమూర్త్యాత్మస్వరూపంకేశవ మూర్తి. కేశవమూర్తికి ఎడమచేతిలో చక్రం, కుడిచేతిలో శంఖం ఉంటుంది. చెన్నకేశవస్వామి ఆలయాల్లో ఉన్న శ్రీవారిమూర్తి ఇలాగే ఉంటుంది. కనుక భద్రాద్రిలో వెలసిన వైకుంఠరాముడు కేశవమూర్తి అయిన అర్చారూపం! చతు ర్వింశతిరూపాల్లో ఇదే మొదటిరూపం. ఇది ఆదికేశవ మూర్తి. ఇదొక మహత్తర దివ్యప్రభావసంపన్న అర్చామూర్తి. ఈ మూర్తిని పూజిస్తే, త్రిమూర్తుల్ని పూజించినఫలం సిద్ధి స్తుంది. **"కశ్చ ఈశశ్చ కేశౌ తా వస్మిన్ స్త ఇతి"** బ్రహ్మ రుద్రులు ఈయనయందు ఉండటంవల్ల కేశవుడు. హరి వంశంలో –

**'క' ఇతి బ్రహ్మణో నామ ఈశో-'హం' సర్వదేహినాం।**
**ఆవాం తవాంగ సంభూతౌ తస్మాత్ కేశవనామవాన్ ॥**

అని ఉంది. ఇంతటివిశిష్టత ఉండబట్టే "రామ మూర్తికి రెండవసాటి దైవ మిక లే దంటూ, ఏనుగునెక్కి భేరీవాయిస్తూ ఎల్గెత్తి చాటుతా"నన్నాడు– రామదాసు. ఈ కీర్తనలో త్రవ్వేకొద్దీ అనేక గంభీరార్థ రత్నాలు వారివారి భావనాశక్తికొద్దీ లభిస్తుంటాయి.

మనకర్తవ్యం రామదాసు సూచించినప్రకారం భద్రాద్రినీ, గౌతమీనదినీ, భద్రాద్రిరామచంద్రుణ్ణీ, సీతా లక్ష్మణస్వాముల్నీ దర్శించి, స్నానం చేసి, సేవించి కృతా ర్థులమై, జన్మరాహిత్యాన్ని పొందడమే! ఈ కీర్తన 'వరాళి' రాగంలో ఉంది. కనుక ఇక్కడి మూర్తిత్రయం భక్తు లకు అనేకవరాలు అనుగ్రహిస్తారని రాగం ద్వారా కూడా సందేశం!!



# సందేహాలు - సమాధానాలు

- బ్రహ్మశ్రీ మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి

**1) పితృవాక్యపాలన పరమధర్మం అవుతుందా?**

- కె.చంద్రకళ, అనంతపురం.

మానవునికి ధర్మపథములలోకెల్ల ఉత్తమమైంది మాతా-పితృ-గురుసేవలు అని అంటారు. శరీరాన్ని ఇచ్చినటువంటి తల్లిదండ్రులను దేవతాస్వరూపంగా భావించడమే మానవునికి పరమధర్మం. "మాతృదేవోభవ, పితృదేవోభవ" అని శ్రుతులు స్పష్టంగా చెబుతున్నాయి. ఎవ్వరివల్ల ఈ శరీరం వచ్చిందో అట్టివారిని సేవించడం కంటే ధర్మం మరొకటి ఏం ఉంటుంది? తన సుఖాన్ని వదిలి శిశువు కోసం తల్లి సర్వత్యాగం చేస్తుంది. ఈ ఋణం ఎవ్వరూ ఎప్పుడూ తీర్చుకోగలిగిందికాదు. జీవితాంతం సేవించ తగిన దేవతాస్వరూపమే మాతృస్వరూపం. గురువులలోకి పరమ గురువే తండ్రి. అయితే తల్లి గౌరవం గొప్పదా లేక తండ్రి గౌరవం గొప్పదా అని విచారణచేశాడు వాల్మీకిమహర్షి శ్రీమద్రామాయణంలో.

తండ్రి వాక్యంతో అరణ్యానికి బయలుదేరిన శ్రీరామచంద్రమూర్తికి తల్లి కౌసల్యాదేవి "నీకు తండ్రి ఎంత గౌరవనీయుడో, నేనూ అంతే గౌరవనీయురాలను. నేను వద్దంటున్నాను, ఇక్కడ ఉండి నా సేవ చేయ"మన్నది. దానికి శ్రీరాముడు సున్నితంగా ధర్మసూక్ష్మవివరణ చేస్తాడు. తండ్రిమాటను కాదనే శక్తి నాకు లేదన్నాడు. నిన్ను, నన్ను శాసించగలిగిన వాడు తండ్రి. అట్టి తండ్రిమాటను అతిక్రమించే శక్తి నాకు లేదు. **"నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ"**- అంటే తండ్రి ఆజ్ఞ చాలా ఉన్నతమైనదన్నమాట. అందుకే ప్రధానమైన గురువు తండ్రి అంటారు. తండ్రి కోరిక తీర్చడానికై మహాభారతంలో శంతను కుమారుడైన దేవవ్రతుడు వివాహమే మాని భీషణప్రతిజ్ఞ చేసి భీష్ముడైనాడు. దీనిని బట్టి తండ్రి హక్కు ఎంత బలమైందో మనకు అర్థమౌతున్నది.

పితృవాక్య పరిపాలనమే పరమధర్మమని రామాయణంలో రామచంద్రుడు స్పష్టంగా నిరూపించాడు. అంత మాత్రంచేత తల్లి గౌరవం తక్కువది అని కాదు. కొన్ని విషయాల్లో తల్లి గౌరవం చాలా పెద్దదని మనకు స్పష్టంగా కనపడుతుంది. తల్లిదండ్రులలో ఎవరు ముఖ్యమైన గౌరవం కలవారు అని విచారణే అక్కరలేదు. ఒకవేళ విచారిస్తే **"పితుశ్శత గుణం మాతా"** అని అన్నారు. తండ్రికంటే నూరు రెట్లు తల్లి గౌరవం కలిగి ఉన్నదన్నారు. కుమారుడికి ఉపనయనం అయినప్పుడు మొదటివందనం తల్లికే చెయ్యాలి, మొదట ఆమెనే భిక్ష అడిగి తీసుకోవాలి. మాతృభిక్షతోటే ఉపనయన వటువు భిక్ష ప్రారంభమౌతుంది. కుమారుడు సన్యసించవలసి వస్తే మాతృ ఆజ్ఞ లేనిదే సన్యసించడానికి వీలులేదు. కుమారుడు సన్యసించిన తరువాత కూడా తల్లి కనపడితే కుమారుడే నమస్కరించాలి. కనుక ఈ విషయంలో తల్లి గౌరవం చాలా పెద్దది. శరీరమిచ్చి పోషించి తన సుఖాన్ని త్యాగం చేసిన తల్లి సేవ మానవునికి ఎప్పుడూ వదలతగింది కాదు. విద్యాబుద్ధులిచ్చి తన శ్రేయస్సును సర్వదా విచారించి సన్మార్గంలో నిలుపగలిగిన శక్తి తండ్రిది. కనుక తండ్రి ఆజ్ఞ ఎప్పుడూ పరిపాలించతగింది.

తల్లిదండ్రుల పూజ చాలా గొప్పది. ఇలా పూజించిన నరుడు ఉత్తమలోకాలను, యశస్సును పొందగలడు. దైవస్వరూపులైన తల్లిదండ్రుల ఆజ్ఞ ధర్మవిరుద్ధమైనా పాటించాలి అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. ఈ కాలంలో చాలామంది ఈవిషయమే మరచిపోయి తమ శరీర సౌఖ్యాలే చూసుకుంటూ వృద్ధులైన తల్లిదండ్రులను అనాదరించడం చూస్తున్నాం. ఇది చాలా ధర్మద్రోహం. ఈ సూక్ష్మాన్ని గుర్తించి ధర్మాన్ని రక్షించాలి!



ధైర్యసాహసాలే విజయపరంపర

# మత్స్యావతార గోవిందా!

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ



శ్రీమహావిష్ణువు తీసుకున్న దశావతారాలలో మొదటి అవతారంగా మత్స్యావతారం కీర్తింపబడింది అని శుక్రాచార్యులవారు అంటూ, ఒక మాట చెప్పారు. వినడానికి మత్స్యమూర్తి కథ చిన్నదిగా అనిపించినా, ఇందులో ఉన్న తాత్పర్యం ఏమిటి? ఎందుకు అటువంటి రూపం తీసుకుంటాడు? దానికి ఎప్పుడెప్పుడు అవతారం తీసుకుంటాడు? ఆ అవతారప్రయోజనమేమిటి? ఇన్ని విషయాలను విన్నా, చదివినా, తెలుసుకున్నా, తెలుసుకోక పోయినా అన్నీ వింటే ఏ భక్తి కలుగుతుందో అటువంటి భక్తి కలగాలి అనుకుంటే–

“రోజూ కూడా ఒక్కసారి మత్స్యమూర్తి కథని ఎవరు చదువుకుంటారో వాళ్లకి పరమభక్తి ఏర్పడి, ఆ భక్తి చేత ఏదో ఒకనాడు శ్రీమహావిష్ణువు వారిని అనుగ్రహించి పరమపదాన్ని పొందే అదృష్టాన్ని కలిగిస్తాడు. మత్స్యావతార ఘట్టం చదువగా చదువగా కొన్నివిషయాలు అర్థం అవడం మొదలవుతుంది.

ఏమిటి ఆ అర్థం అవడం అంటే– **ఈ సృష్టిలో ఆయన ప్రవేశించనిది శివం కాదు. ఆయనతో కలసి లేక పోతే అది శవం. ప్రకృతిలోకి వెళ్లిపోతుంది. ఆయన ఆవహించి ఉంటే మంగళప్రదం అవుతుంది.** ఆయన లేనిది ఉండదు. అన్నిటి యందూ ఉంటాడు.

**అంతర్ బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః–** అదే చేపగా రావడానికి కారణం. ఏ రూపాన్ని పొందితే భక్తుడికి ఉపకారం చెయ్యడం సాధ్యమౌతుందో ఆ రూపాన్ని పొందుతాడు. సత్యవ్రతుడు విష్ణుదర్శనాన్ని అడిగాడు. ప్రళయాన్ని ఆపి తాను దర్శనం ఇవ్వవచ్చు కానీ, ప్రళయ కాలంలో ఆయన కూడా వెళ్లిపోతాడు. భవిష్యత్తులో మనువు కాడు. వివస్వంతునికి కొడుకు కాలేడు.

ప్రళయకాలంలో ఎవరూ వినడానికి యోగ్యత లేకుండా శరీరం విడిచిపెడితే, సప్తఋషులతో కలసి శ్రీమహావిష్ణువు వద్ద బ్రహ్మజ్ఞానాన్ని పొందలేదు. ఆ కాలంలో పుట్టిన హయగ్రీవుడు అనే రాక్షసుడి చేత తస్కరింపబడిన వేదాలని తిరిగి పైకితేవడానికి నీటియందు ప్రవేశించే అనువైన రూపం ఉన్న మత్స్యమూర్తి ఉంటే తప్ప పునఃసృష్టి ప్రారంభం కాదు. ఇన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఏకకాలంలో సాధించ

గలగాలి. అవతారంలో సర్వజ్ఞత్వం ఉంటుంది. భూత, భవిష్య, వర్తమానకాలాలు అన్నీ తెలిసి ఉంటాయి.

**అవతారం వచ్చింది అంటే భక్తుడు కోరుకున్నది తృణమైతే పరమేశ్వరుడు ఇచ్చేది మేరుపర్వతం.** ఇందులో ఒక విషయాన్ని గమనించాలి, సత్యవ్రతుడు నాకు ఇది కావాలని ఏమైనా శ్రీమహావిష్ణువుని అడిగాడా? ఏమీ అడగలేదు. ఆయనే చేపగా కనపడి, రక్షించవలసినవాడు రక్షించమని అడిగాడు. దిక్కుమాలిన చేప పిల్ల. దీనిని నేను రక్షించడమేమిటి అని పారవేస్తే సత్త్వగుణమే లేదు. సత్త్వ గుణంలేని వాడికి తపస్సు ఏమిటి? ఆ తపస్సుకి తాను ఎలా అనుగ్రహిస్తాడు? సత్త్వగుణభరితుడైనాడు అనడానికి

## 2019, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 07 | అక్షయ తృతీయ, శ్రీపరశురామ జయంతి |
| 09 | శ్రీశంకర జయంతి, శ్రీరామానుజ జయంతి |
| 11-19 | తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం |
| 12-14 | తిరుమల శ్రీపద్మావతి శ్రీనివాస పరిణయ మహోత్సవం |
| 14 | తిరుపతి గంగజాతర |
| 16-24 | హృషీకేశ్ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం |
| 16-24 | నారాయణవనం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం |
| 17 | శ్రీనృసింహజయంతి, శ్రీతరిగొండ వేంగమాంబజయంతి |
| 18 | శ్రీకూర్మ జయంతి, శ్రీఅన్నమాచార్య జయంతి |
| 17-19 | తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి వసంతోత్సవం |
| 29 | హనుమ జయంతి |
| మే 26 నుండి జూన్ 03 | కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం |

అర్థం– నన్ను రక్షించు అంటే తీసుకుని వెళ్లి ఒక తొట్టిలో పడవెయ్యవచ్చు. తొట్టిమీద ఏ పిల్లో ఎక్కి, చేపపిల్ల తిరుగుతున్నప్పుడు పట్టుకుంటే, అందుకని తనను ఆశ్రయించి వచ్చిన చేపపిల్లను రక్షించడానికి చేపపిల్ల ఏమిటి అని ఆలోచించక, నిరంతరం తాను చూసుకునే కమండలంలో వేశాడు. ఒక చేప పిల్లను రక్షించడానికి ఎంత ఆర్తి, ప్రేమ, తాపత్రయం ఉన్నాయో! ప్రతిప్రాణిలో విష్ణువును ఎంత చూశాడు అనడానికి సత్యవ్రతుని హృదయం తార్కాణం. కమండలంలో పెట్టాడు. నాకు చాలడంలేదు అని అడిగితే మార్చాడు. చాలదు అన్నప్పుడల్లా మారుస్తూ వెళ్లాడు. ఇలా ఒక చేప అంటుందా అని ఆలోచించలేదు. తాను చెయ్యాల్సిన కర్తవ్యం తాను ఆలోచించాడు. సముద్రమే పట్టనప్పుడు తాను మార్చలేను అని తెలుసుకుని, తాను మార్చి రక్షించ వలసినవాడు కాదు. **లోకాలను రక్షించేవాడు నటన చేస్తున్నాడు అని తెలుసుకున్నాడు. విష్ణువుగా రమ్మని అంటే చేపగా వచ్చావని అడగలేదు. చేపనే చూసి కీర్తించాడు. అంతటా విష్ణుదర్శనం అవడం ప్రారంభమై అంతటా వ్యాపకత్వం ఉన్న విష్ణువునే చూశాడు.**

**విశ్వమ్, విష్ణుః– విష్ణుసహస్రంలో ఆ రెండే నామాలు. మిగిలిన 998 ఈ రెండు నామాలకు వ్యాఖ్యానం.** అంతటా విష్ణువే. ప్రళయం వచ్చేస్తున్నది. బ్రహ్మజ్ఞానాన్ని బోధచెయ్యాలి. ప్రళయమంటే తెలిసిఉన్నవాడు ఎవరూ లేరు. ప్రళయం వరకే తెలుసు సమస్తజీవులకు. ప్రళయమంటే ఏమిటో తెలియడానికి నువ్వే కారణం కావాలి. లోకం ఎందుకు ప్రళయజలధిలో మునిగిపోతుందో, ఆ తరవాత కూడా వెళ్లిపోయిన జీవులందరి పునరుత్పత్తి, ఎవరెవరు ఏ కర్మలు చేశారో, తెలుసుకోగలిగిన దక్షత ఉన్నవాడుగా బ్రహ్మగారు ఎలాఉంటారో, ఆ బ్రహ్మ గారికి కూడా సృష్టికి వేదమే ఎందుకు ప్రమాణం అవుతుందో, వేదప్రామాణ్యం గొప్పదనం చూపించాలి. వేదాలను తేవడానికి తాను మత్స్యమూర్తిగా వెళ్లాలి. పరమేశ్వరదర్శనమైతే మోక్షాన్ని ఇయ్యమని గానీ, ప్రళయంలో కూడా బతికి ఉండాలని గానీ, సత్యవ్రతుడు నోరుతెరచి ఏమీ అడగలేదు. ఏడు రాత్రుల తరవాత ఎనిమిదోరోజున ప్రళయం వస్తున్నదని ఆయనే ఓషధులని సిద్ధం చేసుకుని సప్తఋషులు వస్తారు, నావను ఎక్కమని అన్నాడు.

పరమభక్తితో మన కార్యం, కర్తవ్యం చేసుకుంటూ వెళుతూ, మనం భగవంతుని కోరిక కోరకుండా ఉండాలి. ప్రళయంలో మూడులోకాలు మునిగిపోయాయి అంటారు. అలా మునిగిపోయినా సప్తఋషులు కాకుండా మిగిలినవాడు సత్యవ్రతుడు ఒక్కడే. బతికించడమే కాదు, వినడానికి ఎవరూ లేనప్పుడు విష్ణువు గురువై, బ్రహ్మజ్ఞానం చెప్పింది ఒక్క సత్యవ్రతునికే. సూర్యభగవానుడికి కొడుకుని చేసి ఆ సూర్యుని గురువుని చేసి జ్ఞానబోధ చేయించి మొదటి మనువుని చేశాడు. తరవాతి కాలంలో మోక్షాన్నిచ్చాడు. భక్తిలో భగవంతుణ్ణి అడగడం మనకు చేతకాదు. శంకరభగవత్పాదులు తీర్మానం చేశారు. **ఈశ్వరుడు మనకు సముద్రం ఇవ్వగలడు. మనం నీటిబొట్టు అడుగుతాం. అందుకని అడగవద్దు అన్నారు. మనం భక్తితో నిలబడితే ఏమి ఇవ్వాలో ఈశ్వరుడికి తెలుసు. ఆయన ఇవ్వదలచుకున్నది ఇచ్చినప్పుడు చిరస్థాయిని పొందుతాం.** అడగకుండా భక్తితో ఉండటం నేర్చుకుంటే సత్యవ్రతుడు ఏ స్థాయిని పొందాడో ఆ స్థాయిని పొందుతాం. ఇన్ని రహస్యాలను ఉటంకించింది కనక, ఈ మత్స్యావతారఘట్టాన్ని ప్రతిరోజూ చదువుకున్నవారికి, సత్యవ్రతుని తలచుకుంటున్నారో వాళ్ళందరికీ, పరమపదాన్ని ఇస్తాడని అన్నారు.

ఏడురోజులలో ప్రళయం వస్తుంది అనగా ఆ జలాలలో తీసుకుని వెళ్ళి బ్రహ్మజ్ఞాన మివ్వగలిగిన పరాత్పరుడు మిగిలిన జీవితంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ఇచ్చి ఆఖరి ఊపిరిలో అయినా బ్రహ్మజ్ఞానమిచ్చి, మళ్లీ పుట్టాల్సిన అవసరం లేని స్థితికి ఎత్తగలడు. అటువంటి శక్తి ఉన్న పరమేశ్వరుని స్థితిని ఆవిష్కరించినగాథ కనుక మొట్టమొదటి అవతారమైన మత్స్యావతారానికి అంతటి ప్రశస్తి కలిగింది. కోరుకున్న ధార్మికమైనకోరికలు కొన్ని, పైకి కోరికగా వ్యక్తం కాకపోవచ్చు. వంశం తంతువుగా కొనసాగాలి అన్న కోరికతో పెళ్లి చేసుకుంటే అది ధర్మం. కొడుకు పుట్టాలని కోరుకున్నా అది కోరిక కింద తీసుకోరు. దాన్ని ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు. లోకంలో ప్రతివాళ్లూ మత్స్యావతార ఘట్టాన్ని పారాయణ చెయ్యాల్సిందే. అది అలవాటైతే వారి ధార్మికమైన కోరికలు విష్ణుభగవానుడు తీరుస్తాడు. అలవాటు అయితే చదవడానికి ఎనిమిది లేక తొమ్మిది నిమిషాలు పడుతుంది. ధరణీశ్వర సిద్ధిపొందు తథ్యము సుమ్మీ!"– అలా



రోజూ చదివినవారు సిద్ధి పొంది తీరుతారు. **కోట్లజన్మలు కిందకి వెళ్లిపోకుండా ధర్మంలో ప్రవర్తించి, భగవద్భక్తి అలవడి భగవంతుని అనుగ్రహాన్ని పొందడానికి యోగ్యమైన పాత్రతను పొందుతారు. మనుష్యుడైన వాడు తెలుసుకోవాల్సిన ఇన్ని విషయాలు చెప్పింది కాబట్టి, అన్ని అనుగ్రహాలను వర్షించగలిగింది కావున ప్రథమావతారంగా మత్స్యావతారం కీర్తించబడింది.**

దశావతారాల్లో కొన్నింటిని జంతురూపంలో పొందాడు. కొన్నిటిని నర, జంతురూపాలలో పొందాడు. కొన్ని బ్రాహ్మణకుటుంబాలలో, కొన్ని క్షత్రియ కుటుంబాలలో పొందాడు. అవసరమైతే ఏ కుటుంబంలో పుడితే అవతారప్రయోజనం నెరవేరుతుందో అక్కడకు వెళ్లాడు. ఏ ఉపాధిలోకి వెడితే నెరవేరుతుందో ఆ ఉపాధిలోకి వెళ్లాడు. ఇన్ని చమత్కారాలు చేశాడు. ఇన్ని విషయాలు చెప్పగలిగిన దానిలో మొదటివిషయం భగవత్‌తత్త్వాన్ని ఆవిష్కరించింది కాబట్టి, మత్స్యావతారఘట్టం అని ప్రథమావతారంగా శాస్త్రాలు కీర్తించాయి.



# తిరుమల శ్రీవారి సన్నిధిలో...

– శ్రీమతి పి. విజయలక్ష్మి

శ్రీవైకుంఠాన్ని వదలి, భక్తరక్షణకోసం భూలోకానికి వచ్చి, తిరుమల క్షేత్రంలో పుష్కరిణీతీరంలో వెలసిన శ్రీహరి – తెలుగు వారి ఇలవేల్పేగాక, విశ్వానికే తొలివేల్పుగా సేవలందుకొంటున్నాడు– శ్రీవేంకటేశ్వరమూర్తిగా, శ్రీవేంకటేశ్వరస్వామి తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన తెలుగుఉగాదిని (సంవత్సరాది) మహావైభవంగా– **"ఉగాది ఆస్థానం"** అనే పేరుతో చేసుకొని, తాను ఆనందిస్తూ, లోకాన్ని ఆనందమయం చేస్తున్నాడు. **ఇదంతా నిజానికి భక్తులకొరకే! కాలమే తానైనవాడు స్వామి. తన ఆజ్ఞతో కాలాన్ని నడిపిస్తున్నాడు – మహావిష్ణువు.**

అట్టి విశ్వేశ్వరుడూ విశ్వమయుడూ అయిన శ్రీవారు 'ఉగాది ఆస్థానం' జరుపుకొనుట – భక్తుల ఆనందాన్ని చూచి, తాను ఆనందించుటగాక – స్వామికి మరో కోరిక ఏముంది?

**తెలుగు ఉగాది పండుగనుండే తిరుమలేశుని ఆలయ కార్యక్రమాలూ, ఉత్సవాలూ ప్రారంభమవుతాయి.** అంటే శ్రీవారి సుప్రభాతసేవతో 'ఉగాది' మొదలవుతుంది. ఉగాదినాడు సుప్రభాతం కాగానే, తోమాలసేవ జరుగుతుంది. (పిదప ప్రతిరోజూ మామూలుగా కొలువుశ్రీనివాసమూర్తికి జరిగే కొలువు జరుగదు) తోమాలసేవానంతరం శ్రీభూదేవీసమేత శ్రీమలయప్ప స్వామివారికీ (శ్రీవారిఉత్సవమూర్తులు), సేనాధిపతి విష్వక్సేనుల వారికీ ఏకాంతంగా తిరుమంజనం జరుగుతుంది.

> **తెలుగు ఉగాది పండుగ నుండే తిరుమలేశుని ఆలయ కార్యక్రమాలూ, ఉత్సవాలూ ప్రారంభమవుతాయి.**

తర్వాత బంగారువాకిలికి ముందున్న తిరుమహామణి మండపం (ఘంటామండపం)లో, బంగారువాకిలికి ఎదురుగా ఉన్న గరుడాళ్వారుకు అభిముఖంగా (ఎదురుగా) బంగారు సర్వభూపాలవాహనంలో దేవేరులతో కూడా శ్రీమలయప్పస్వామి వారిని వేంచేపు చేస్తారు.

పట్టువస్త్రాలతో, వజ్రమాణిక్యాది సువర్ణాభరణాలతో, కిరీటాలతో, సుగంధసుపుష్ప మాలికలతో ఉత్సవమూర్తుల్ని విశేషంగా అలంకరిస్తారు.

శ్రీమలయప్పస్వామివారిఎడమప్రక్కన మరొకపీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీవారిసేనాపతి విష్వక్సేనులవారినీ అలంకరించి, శిరస్త్రాణాన్నీ, ఖడ్గాన్నీ ధరించి, మిక్కిలిభయభక్తులతో శ్రీవారిఆజ్ఞల్ని అమలుపరచడానికి సిద్ధంగా ఉన్నట్లుగా, వేంచేపు చేస్తారు. పిదప ఆనందనిలయంలోని మూలవిరాణ్మూర్తికీ, విశేషమైనపడి ప్రసాదాలు, అన్నప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీవారిఅర్చకులూ, పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యంగార్లు, ఏకాంగులూ, ఆచార్యపురుషులూ, వేదపండితులూ, దేవస్థానం కార్యనిర్వాహకులూ, ఇతరఅధి కారులూ, పేష్కార్లూ, పారుపత్యదారులూ–ఛత్రచామరాలతో, మంగళవాయిద్యాలతో–వేదపఠనం జరుగుతుండగా – శ్రీవారివంటవాళ్ళు విశేషవంటకాలను నివేదనకు ఊరేగింపుగా తెస్తారు. ఈ వంటకాలతో విమాన ప్రదక్షిణంలో బంగారు బావిప్రక్కన ఉన్న వంటశాలనుండి ఉత్సవంగా బయలుదేరి, విమానప్రదక్షిణం చేసి, వెండివాకిలి ఎదురుగానున్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వెళ్ళి, లోపలికి వచ్చి, ఆలయప్రవేశం చేస్తారు. మంగళవాద్యాలు బంగారు వాకిలివద్ద ఆగిపోగా, మిగిలినవారు సన్నిధిలో కొన్ని ప్రసాదాలనూ, బంగారువాకిలివద్ద కొలువులో కొన్ని ప్రసాదాలనూ సమర్పి స్తారు. వెంటనే రెండుచోట్లా ఘంటానాదంతో విశేషనివేదన జరుగుతుంది.

పిదప శ్రీయోగనరసింహస్వామి ఆలయం ప్రక్కనున్న **'పరిమళపుఅర'** దగ్గర నుండి పెద్దజియ్యంగారు పెద్దవెండి తట్టలో మడతపెట్టి, చుట్టగా చుట్టబడిన ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని, మంగళవాద్యాలతో, వేదపారాయణలతో, దివిటీలదివ్యకాంతుల్లో దేవస్థానం అధికారులైన కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, ఇతర అధికారులూ వెంటరాగా ధ్వజస్తంభానికి ప్రదక్షి ణంగా వచ్చి, ఆనందనిలయవిమానానికి ప్రదక్షిణంచేస్తూ – బంగారువాకిలి వద్దకు చేరుతారు. వాకిలిలోపల **'సన్నిధిగొల్ల'** దివిటీతో – వీరందర్నీ సన్నిధివరకూ పిల్చుక పోతాడు. శ్రీవారిసన్నిధిలో జియ్యంగార్లు తాము తెచ్చినపట్టువస్త్రాలను అర్చకస్వాము లకు అందిస్తారు. జియ్యంగార్లూ, ఏకాంగులూమాత్రమే ఆనందనిలయంలో (గర్భగుడిలో) ప్రవేశిస్తారు. వెంటనే తెరవేస్తారు.

లోపల అర్చకస్వాములు జియ్యంగారు సమర్పించిన ఆరుపట్టువస్త్రాల్లో నాల్గిం టిని శ్రీవారిమూర్తికి అలంకరిస్తారు. ఒక వస్త్రాన్ని కిరీటానికీ, రెండవది నందకఖడ్గా నికీ, మూడవదాన్ని ఆది తోమాలగానూ, నాల్గవదాన్ని ఉత్తరీయంగానూ అలం కరిస్తారు. తెరతొలగినతర్వాత అర్చకస్వామి బంగారుపళ్ళెంతో పచ్చకర్పూరహారతి ఇస్తారు. ఆ హారతిని ఏకాంగి అందరికీ చూపగా, అక్కడివారందరూ కళ్ళకద్దు కొంటారు. సంప్రదాయానుగుణంగా తీర్థం, శఠారి, చందనం, తాంబూలా(మడుపు) లను అర్చకులు ఇస్తారు. తర్వాత కార్యనిర్వహణాధికారిగారికీ, ఇతర అధికారులకూ తీర్థం, శఠారి మున్నగునవి ఇస్తారు.

పిదప మిగిలిన రెండుపట్టువస్త్రాలున్న వెండితట్టను పెద్దజియ్యంగారు తలపై నిడు కొని తెచ్చి, బంగారువాకిలి వద్దనున్న ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చక స్వాములు ఒక వస్త్రాన్ని శ్రీమలయప్ప స్వామికీ, మరొకదాన్ని విష్వక్సేనులవారికి అలంకరిస్తారు.

ప్రధానార్చకులు తలకు శ్రీవారిపాద వస్త్రంతో పరివట్టం (తలకు చుట్టూ కట్టే చిన్నపట్టుగుడ్డ) కట్టుకొని, శ్రీస్వామివారిపై, విష్వక్సేనులవారిపై అక్షతారోపణం చేస్తారు. పిదప విష్వక్సేనులవారికి పరివట్టంకట్టి, శ్రీస్వామివారికి వేసిన అక్షతలను గైకొని, విష్వక్సేనులవారిపై చల్లి, శఠారిమర్యాదలు జరుపుతారు. పిదప ప్రధానార్చకులు శ్రీస్వామివారి ద్వారా తండులదానం (బియ్యం), దక్షిణతాంబూలాలు స్వీకరించి, **"నిత్యైశ్వర్యో భవ"** (నిత్యమైన ఐశ్వర్య వంతుడవు కమ్ము) అని, స్వామివారిని ఆశీ ర్వదిస్తారు. అక్కడనున్న మరొక అర్చకులు ప్రధానార్చకులకు పరివట్టంకట్టి శఠారి మర్యాదలు చేస్తారు.

ఇలా ఆస్థానపూర్వరంగం జరిగాక శ్రీవారికి ఆస్థానం జరుగుతుంది.



## ఉగాదిఆస్థానం

శ్రీస్వామివారిపాదపద్మాలమీదనున్న పంచాంగాన్ని భక్తితో స్వీకరించి, ఆస్థానసిద్ధాంతి శ్రీస్వామివారికి నూతన పంచాంగ విశేషాలు వినిపిస్తారు. ప్రత్యేకంగా శ్రీవారిజన్మ నక్షత్రమైన 'శ్రవణం' ఫలితాలు వివరిస్తూ "ఓ స్వామీ! మీరు ఈ లోకంలో అవతరించింది– శ్రవణనక్షత్రంనాడు. ఈ సంవత్సరంలో మీరు విశేషదయాంతరంగులై భక్తుల పాపాలను పోగొట్టి 'వేంకట'నామాన్ని సార్థకం చేసుకొంటారు. భక్తులకు సకల సంపదలూ అనుగ్రహిస్తారు. కనుకనే భక్తకోటి ఈ సంవత్సరంలో మీదర్శనానికై అఱ్ఱులుచాస్తూ, తిరుమలయాత్ర చేస్తారు. మీ దయకై, ఆనందానికై ఎన్నోఉత్సవాలు ఎంతో వైభవంగా భక్తితో నిర్వహిస్తారు. మీకు విశేషంగా ధనవస్తు రూపంలో కానుకలు సమర్పిస్తారు. మీ ఆజ్ఞావర్తులైన నవగ్రహాలూ మీ భక్తుల్ని రక్షిస్తూంటారు. దేశం సస్యశ్యామలమై వర్ధిల్లుతుంది. మీదయవల్ల అతివృష్టి, అనావృష్టి, ఆధివ్యాధులూ లేక విశ్వం హాయిగా ఉంటుంది"– అని విన్నవిస్తారు–సిద్ధాంతి గారు. ఆ సమయంలో శ్రీస్వామివారు అరమోడ్పు కన్నులతో, మందహాసంతో, సంతోషంతో వింటూ అందర్నీ దీవిస్తున్నట్లుగా దివ్యకాంతులతో సాక్షాత్కరిస్తారు.

శ్రీదేవిభూదేవులకుకూడా నక్షత్రఫలాలు చెప్పిన తర్వాత అక్కడనున్న పెద్దలెవరైనా తమ నక్షత్రఫలితాలు తెల్పండని అర్థిస్తే– సిద్ధాంతిగారు వారినక్షత్రఫలితాలూ వినిపిస్తారు. పిదప అర్చక స్వాములు సిద్ధాంతిగారికి శఠారిని అనుగ్రహిస్తారు.

**పిదప జియ్యంగార్లగుమాస్తా వచ్చి–ముందు రోజు వచ్చినహుండీరాబడినీ, ఆదాయ వ్యయాలనూ, ఉత్సవవిశేషాలనూ స్వామివారికి వినిపిస్తారు.** వెంటనే అర్చకస్వాములు శ్రీమలయప్పస్వామివారలకు **"కొలువు పళ్లెం"** అనబడే బంగారుతట్టలో నవనీతహారతిని జరిపి, కార్యనిర్వహణాధికారిగారికి నవనీతం (వెన్న) తాంబూలం ఇస్తారు. పిదప సర్కారుహారతులు కార్యనిర్వహణాధికారిమొదలు పారుపత్యదారు వరకూ ఒక్కొక్కరికి ఒక్కొక్కహారతి క్రమంగా నిర్వహిస్తారు.

**శ్రీస్వామివారి పాదపద్మాల మీద ఉన్న పంచాంగాన్ని భక్తితో స్వీకరించి, ఆస్థానసిద్ధాంతి శ్రీస్వామివారికి నూతన పంచాంగ విశేషాలు వినిపిస్తారు. ప్రత్యేకంగా శ్రీవారిజన్మ నక్షత్రమైన 'శ్రవణం' ఫలితాలు విన్నవిస్తారు. శ్రీదేవిభూదేవులకు కూడా నక్షత్రఫలాలు విన్నవిస్తారు.**

**చివరగా... భక్తులందరి తరఫున ఒక్కొక్క రూపాయివంతున సేకరించి, "రూపాయహారతి" ఇస్తారు. పళ్ళెంలో వచ్చిన రూపాయల్ని కార్యనిర్వహణాధికారి ఖజానాకు జమచేస్తారు.**

**ఉగాది రోజు సాయంకాలం తిరుమల నాల్గుమాడవీథుల్లో శ్రీభూదేవీ సమేతంగా శ్రీమలయప్పస్వామివారు ఉత్సవంగా వచ్చి, భక్తులకు నూతనసంవత్సర శుభాశీస్సులతోపాటు, దివ్యమంగళదర్శనం కూడా అనుగ్రహిస్తారు.**

తరువాత మైసూరువారి, తాళ్ళపాకవారి, తరిగొండ వారిహారతులూ జరుగుతాయి. చివరగా భక్తులందరి తరఫున ఒక్కొక్క రూపాయివంతున సేకరించి, **"రూపాయహారతి"** ఇస్తారు. పళ్ళెంలో వచ్చిన రూపాయల్ని కార్యనిర్వహణాధికారి ఖజానాకు జమచేస్తారు.

చివరగా జియ్యంగారికీ, పిదప దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికీ పరివట్టంకట్టి, శఠారిని అనుగ్రహిస్తారు. పిదప ప్రసాదవినియోగం జరుగుతుంది. చందనతాంబూలాలూ, అక్షతలూ కూడా ప్రసాదంతోపాటు ఇస్తారు. ఇలా **'ఉగాదిఆస్థానం'** పూర్తి అయ్యాక, భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఉగాదిరోజు కల్యాణోత్సవం మున్నగు ఆర్జితోత్సవసేవలు ఏవీ ఉండవు.


సాయంకాలం తిరుమల నాల్గుమాడవీథుల్లో శ్రీభూదేవీ సమేతంగా శ్రీమలయప్పస్వామివారు ఉత్సవంగా వచ్చి, భక్తులకు నూతనసంవత్సర శుభాశీస్సులతోపాటు, దివ్యమంగళదర్శనం కూడా అనుగ్రహిస్తారు.

ఉగాదినాడు సాయంకాలం ప్రారంభమైన ఈ ఉత్సవం 40 రోజులు విధిగా జరుగుతుంది. దీన్ని **"నిత్యోత్సవం"** అంటారు. వైశాఖశుద్ధదశమి వరకూ ఈ ఉత్సవం ఆగమసంప్రదాయబద్ధంగా నిర్వహింపబడుతుంది.

## ఉగాది ఆస్థానం - ఆధ్యాత్మికానందస్థానం

శ్రీనివాసుడు ఉత్తమమైన వైకుంఠాన్ని వదలి, వేంకటాచలంపై పుష్కరిణీతీరంలో స్థిరనివాసి కావడం భక్తజనోద్ధరణ కొరకే అనుట మనభావన.

భూ, భూమి–శబ్దాలకు 'నీళ్ళనుండి పుట్టింది' అని వ్యుత్పత్తి. శ్రీమన్నారాయణుడు 'నీటిని నివాసంగా గలవాడు'. కనుక భూమి(భూలోకం) స్వామి నుండి ఏర్పడిందే! పంచభూతాలు, మనస్సూ, బుద్ధీ, అహంకారమూ ఈ ఎనిమిదీ స్వామివారి అష్టమూర్తులు. విశ్వమే విష్ణువూ, విష్ణువే విశ్వమూ కనుక – స్వామి భూలోకానికి రావడం తన 'భూమూర్తిని' చూచి ఆనందించడానికే! "సర్వం వాసుదేవమయం" కనుక ఇందున్న చరాచరాత్మక ప్రకృతి అంతా తనమూర్తులే! **"నర్తకునిభంగి**



**పెక్కగు మూర్తుల నెవ్వడాడు?"**నని భాగవతం శ్రీవారిబహురూపవైశిష్ట్యాన్ని కీర్తించింది.

**"కాలః కలయతా మహమ్"**–అని గీత! కాలం అన్నింటికంటే గొప్పదై, విశ్వంలోని అన్నింటినీ అణిచివేస్తుంది. గణించేదీ, ప్రేరేపించేదీ కాలం. **"కదలదు నీదు సంకల్పము లేనిదే గడ్డిపోచయును"** కనుక విశ్వానికి ప్రేరణం, కారణం విష్ణువే! రూపంలేని అనంతకాలాన్ని భగవంతుణ్ణిగా భావించి, సంవత్సరాత్మకరూపంతో ఆరాధించడం– ఉగాదిఆస్థాన విశేషం. సర్వాలంకారభూషితుడై స్వామి కార్యకారణశక్తులైన దేవేర్లతో ఆస్థానం చేయడం–తనసర్వాంతర్యామిత్వాన్నీ, సర్వశక్తినీ, భక్త రక్షణ తత్పరతనూ నిరూపించడానికే! సేనాపతి విష్వక్సేనుల వారూ – దక్షిణాభిముఖులై ఉండటం మరోవిశేషం! సర్వత్ర వ్యాపించిన సేనగలవాడు–విష్వక్సేనుడు. ఇతడు సేనాపతి. శ్రీస్వామివారికిని **'విష్వక్సేను'**డని పేరుంది. శ్రీహరి సైన్యానికి అధిపతి శ్రీహరియే గాక మరొక్కరుందురా? కనుకనే ఇరువురూ ఒకరే! తానే సైన్యమూ, సైన్యాధిపతియునై ఉంటాడు – స్వామి. దక్షిణాభిముఖుడై విష్వక్సేను డుండటం యమకింకరుల్ని పారద్రోలి, శ్రీవారిభక్తలకు మృత్యుభయం లేకుండా చేయడానికే!

అర్చకుడు సాక్షాత్తూ హరియే కనుక – భూలోకంలో శ్రవణనక్షత్రంలో అవతరించిన శ్రీవారికి పంచాంగాన్ని శ్రవణం చేయించడం, కాలస్వరూపాన్నీ, కాలప్రభావాన్నీ, కాలఫలాల్నీ వివరించడమే! శ్రీవారిని **"నిత్యైశ్వర్యో భవ"** అని ఆశీర్వదించుట, నిజానికి స్వామిని దీవించడం కాదు. ఇది శుభవాక్కు! స్వామి నిత్యైశ్వర్యవంతుడై ఉంటేనే, భక్తులనూ నిత్యైశ్వర్యవంతుల్ని చేస్తాడు. ఇది **'విజయతాం'** అనేమాటవంటిది.

పంచభూత, పంచప్రాణ, పంచేంద్రియాదిపంచతత్త్వాలకు సంకేతం పంచాంగం. ఇట్టి పంచాంగవిశేషాలుస్వామికి విన్పించడంద్వారా మనలోని పంచతత్త్వాలను జాగృతంచేసి, చైతన్యపరచి మనల్ని కర్మధర్మోన్ముఖుల్నిజేయడమే అవుతుంది. కాలస్వరూపుడైనస్వామి సన్నిధిలో కాలగణనాన్ని పేర్కొనడం, సంవత్సరఫలితాలు వివరించడం– స్వామివారి తత్త్వాన్ని కీర్తించడమే!

**కాలమూ, విష్ణువూ వ్యాపించే గుణంకలవారే! సర్వమూ కాలాధీనమే! ఆ కాలం విష్ణుదేవునిఆజ్ఞతో ప్రవర్తిస్తుంది కనుక సంవత్సరాదినాడు స్వామిని కాలస్వరూపుణ్ణిగా భావించి పూజించడంతో– స్వామికృపవల్ల కాలం మనల్ని కనికరిస్తుంది.** మన బుద్ధిని సత్కార్యాచరణకు ప్రేరేపిస్తుంది. ధీశక్తిని పెంచుతుంది. భగవద్భావన లేకుండా పంచాంగశ్రవణం చేసినందువల్ల తీపు లేని పాయసంవలె వృథా అవుతుంది. పంచాంగానికి అధిష్ఠాన దేవత శ్రీమన్నారాయణుడే!

శ్రీవారు వేంచేపుచేసేస్థలాన్నీ, కార్యక్రమాన్నీ ఆస్థాన మని పేర్కొంటారు. ఉగాదినాడు స్వామివారు వేంచేపుచేస్తారు కనుక ఆ కార్యక్రమాన్ని **'ఉగాది ఆస్థానం'** అన్నారు. **సంవత్సరమంతా సంతోషంగా ఉండటానికి, ఆది=మొదలైనరోజు కనుక సంవత్సరాది 'ఉగాది' అయింది.**

### భగవద్గీత-యువత

# ఆరు అవరోధాలు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాసు

మానవునికి లక్ష్యసాధన చేయడంలో ఆరు రకాల అవరోధాలు ఉంటాయి. అవే 1)అత్యాహారం, 2)అనవసర ప్రయాస, 3)వ్యర్థసంభాషణ చేయడం, 4)నియమాలను మొక్కుబడిగా పాటించడం, 5)దుష్ట జనసాంగత్యం, 6) అత్యాశ. ఈ ఆరు అంశాలు లక్ష్యసాధనలో పెద్ద అవరోధాలు.

ఈ అవరోధాలను అతిసులభంగా దాటాలంటే శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పిన **"పరం దృష్ట్వా నివర్తతే"** (అ.2, శ్లో.59) అనే మాటను ఎప్పటికీ గుర్తు చేసుకోవాలి. అదే ఎప్పుడైతే మనిషి ఉన్నత విషయాల అనుభూతిని పొందుతాడో అప్పుడు అల్పవిషయాల నుండి బయట పడతాడు. అందుకే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసికొని దానిలో కొద్దికొద్దిగా విజయాలను సాధించడం మొదలుపెడితే అతిసులభంగా ఆరు అవరోధాల నుండి బయటపడతారు. కత్తితో ఆడుకుంటున్న పిల్లవాడి చేతినుండి దాన్ని తీసేయాలంటే వాడి చేతికి వేరే ఏదో వస్తువును ఇవ్వాలి. అది ఆ పిల్లవాడికి కత్తి కంటే ఎక్కువగా నచ్చినదై ఉండాలి. ఇదే **"పరం దృష్ట్వా నివర్తతే".**

అందుకే ఈ మాటను విద్యార్థినీవిద్యార్థులు పదేపదే ఉచ్చరిస్తూ ఉండాలి. అలాగే ఒక కాగితం మీద దాన్ని రాసుకుని తాము చదువుకునే ప్రదేశంలో గోడ మీద అతికించుకోవాలి. ఎవరెస్టు పర్వతాన్ని మొట్టమొదటిసారిగా ఎక్కిన ఎడ్మండ్ హిల్లరీ తన ఇంట్లోని ప్రతీగదిలో ఎవరెస్టు చిత్రాన్నే పెట్టుకుని, దానినే చూస్తూ ఉండేవాడని చెబుతారు. ప్రతి విద్యార్థి చిన్నచిన్న కోరికల మీదకు మళ్లకుండ తన లక్ష్యం మీదే ప్రాణాలుంచితే నిశ్చయంగా విజయాలు సాధిస్తాడు, అతడు **'పరం దృష్ట్వా నివర్తతే'** అన్న మాటను తు.చ. తప్పకుండ పాటించడమే అతని విజయాలకు ముఖ్య కారణం.

## నిర్వికారి ఉగాది

సీ॥ కాలమొక నది, 'ఉగాదులు' తీర్థఘ
ట్టములు, సకలజీవ సముదయంబు
మునిగి తేలుచు జన్మమున మృత్యువును దాటి
కలిసివిడివడి విఘ్నముల కోర్చి
కట్టకడపట నీవెట్టులానతిఁ జేయు
దటుల సంసారాననటనజేసి
పాద్యజలకణశోభనరూపు గనొ, లతాం
తముగనొ నీ పాదధరణి చెంత

నూడిగము గోరుజీవుల కుడుగరటుల
నిర్వికారమహాస్థితిని దయచేసి
ప్రోచు నీ సృష్టి కల్పనా పూజయందు
కాంతి రేఖయుగాది 'వికారి'స్వామి!

ఉ. ఎక్కడనుండి కాల ముదయించును? దీని ప్రయాణదూరమున్
లెక్కలు గట్టుటెట్లు? సఫలీకృతు లెవ్వరు, దీనిమాయలో
చిక్కియు బిక్కరించు జనజీవనశైలి వికార భావముల్
స్రుక్కెడి దారియెద్ది? మధుసూదన! నీపదపీఠ మొక్కటే!!

తే.గీ. స్వప్నమున నిన్ను గాంచు విపన్ను డొకడు
నవవసంతము తన జీవనముగ నెంచు
నీవు లేని యవస్థలు లేవు, నీవు
తప్పకొన్న నవస్థలు తప్పవు గద!

ఆ.వె. వచ్చునది వికారి, తెచ్చువార్తలు వికా -
రములుగాక యున్న బ్రతుకులెల్ల
శాంతి నొందు కాలశాసక! నీవింక
అభయ మిచ్చి ప్రోవు మయ్య స్వామి!

- శ్రీఆముదాల మురళి



దయను పోలిన ధర్మం ఈ లోకంలో లేదు!

యువవాణి

# రామాయణం- ఆధునిక జీవనం

- డా॥ గరికిపాటి నరసింహారావు

భారతీయసంస్కృతికి మూలస్తంభాలవంటి గ్రంథాలు మూడున్నాయి. అవే రామాయణ, భారత, భాగవతాలు. వీటిలో భారతం మన నిజ జీవితం. రామాయణం ఆదర్శజీవితం. భాగవతం దివ్యజీవితం. మనం నిజ జీవితంలో ఎన్నిరకాల రాగద్వేషాలతో కొట్టుకుపోతున్నామో భారతం చెబుతుంది. మనం ఎంత ఆదర్శప్రాయమైన జీవితం గడపవచ్చో రామాయణం తెలియజేస్తుంది. ఏరకంగా భావిస్తే మనం దివ్యజీవితం గడపగలుగుతామో భాగవతం బోధిస్తుంది. ఆయాగ్రంథాలలో పాత్రలు, ప్రవృత్తులు, కథలు, సందర్భాలు అన్నీ ఈ ఆశయాలకు అనుగుణంగానే ఉంటాయి. ఎందుకంటే వీటిని రచించిన వ్యాస, వాల్మీకులు కారణజన్ములు. మనం వట్టి రణజన్ములం. అదీ తేడా!

కారణజన్ముడైన మహాకవి వాల్మీకి రామాయణాన్ని ఆద్యంతం రమణీయంగానే కాదు, మనందరికీ అనుసరణీయంగాకూడా రచించాడు. 'రామ+అయనం' అంటే 'రాముని మార్గం' అని అర్థం. అంటే జీవితంలో తనకు ఎటువంటి సమస్యలు వస్తే రాముడు ఏ మార్గంలో నడిచాడో తెలుసుకుని అనుసరించగలిగితే చరిత్రలో మిగులుతాం. లేకపోతే కాలగర్భంలో కలిసిపోతాం. అలా జీవితాంతం ధర్మమార్గం విడిచిపెట్టలేదు కాబట్టే, రాముడు శ్రీరాముడు అయ్యాడు.

రాముణ్ణి ఇంత గొప్పవాణ్ణి చేసింది ఆయన గురువులు వశిష్ఠ, విశ్వామిత్రులే. వశిష్ఠుడు చిన్నవయస్సులోనే రామునికి యోగవాసిష్ఠం బోధించి మనోనిగ్రహం కలిగేలా చేశాడు. విశ్వామిత్రుడు దుర్గమమైన అరణ్యమార్గంలో నడిపించి జీవితం అంటే ఏమిటో, దాన్ని స్థైర్యంతో ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో నేర్పాడు. **ఒక రకంగా చూస్తే వశిష్ఠుడు బోధించింది సిద్ధాంతం (థియరి). విశ్వామిత్రుడు చేయించింది ప్రయోగం (ప్రాక్టికల్).**

విశ్వామిత్రునితో యజ్ఞసంరక్షణ కోసం బయలుదేరిన రామలక్ష్మణులు ఒకరోజు రాత్రి అడవిలోనే పచ్చగడ్డే పరుపుగా పడుకొని ఉంటారు. ఆ దృశ్యాన్ని మహర్షి వాల్మీకి **'పుష్పితాగ్రం'** అనే ఛందస్సులో వర్ణించాడు.

కావ్యమంతా ఇంచుమించుగా అనుష్టుప్పు ఛందస్సులోనే రచిస్తూ అధ్యాయం ముగిసినప్పుడు ప్రత్యేకమైన ఛందస్సు వాడటం వాల్మీకి రచనలో వైచిత్రి. అదీగాక 'పుష్పిత+అగ్రం' అంటే 'అగ్రభాగం వికసించింది' అని ఇక ముందు వికసించబోతోందని ధ్వని వస్తుంది. ఆ అధ్యాయం తరువాత నుంచే రాముని పరాక్రమం వ్యక్తమయింది. రాముడంటే ఏమిటో లోకానికి మొదటిసారి తెలిసింది. విశ్వామిత్రుడు కథలు చెప్పి ఆ వెన్నెలరాత్రులను పరిమళభరితాలుగా చేసి సుఖంగా నిద్రపట్టేలా చేశాడట. ఎంత అందమైన, ఆహ్లాదకరమైన భావుకత!



కఠినమైన అరణ్యమార్గంలో నడుస్తున్నా కథలు, కమ్మని ఉపదేశాలు ఆ దారిలో పూవులు పరిచాయి. అందుకే **'అలక లల్లలాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో'** అని త్యాగరాజస్వామి అన్నట్లుగా రాముడు వేగంగా నడుస్తూ గురూపదేశ సారాన్ని కూడా అంత వేగంగా అర్థం చేసుకుని ఆచరించాడు.

విశ్వామిత్రునితో చేసిన యాత్రలో రాముడు ముగ్గురుస్త్రీలను కలుసుకున్నాడు. వారే తాటక, అహల్య, సీత. ఈ ముగ్గురిపట్ల రాముడు మూడువిధాలుగా ప్రవర్తించాడు. **తాటకను సంహరించాడు. అహల్యను సంస్కరించాడు. సీతను స్వీకరించాడు. ఎందుకు ఈ విధంగా భిన్నంగా ప్రవర్తించాల్సి వచ్చిందంటే... ఆ ముగ్గురి విషయంలో అలాగే ప్రవర్తించమని గురూపదేశం. ఆ ఉపదేశం ఆయనకే కాదు మనకీను.** అది అడవుల్లో తిరగడం కోసం చేసింది కాదు. జీవితమంతా పాటించవలసిన మహోపదేశం. తాటక తమోగుణానికి సంకేతం. తమోగుణాన్ని సంహరించాలి. అందుకే సంహరించాడు. అహల్య రజోగుణానికి సంకేతం. ఆమెలోని చురుకుదనం, క్రియాశీలత తప్పుదారి పట్టాయి. అటువంటివాళ్ళను సహనంతో సంస్కరించాలి. అందుకే రాతిని నాతిగా మార్చి ఆమెను సంస్కరించాడు. ఆమెకు రాముడంతటివాడు పాదాభివందనం చేయడం గమనార్హం. ఇక సీత సత్త్వగుణానికి సంకేతం. వెదకి చూచినా లోపం దొరకదు. అందుకే ఆమెను పందెంలో గెలిచి మరీ స్వీకరించాడు. **ఏ వ్యక్తి అయినా తమోగుణాన్ని సంహరించాలి. రజోగుణాన్ని సంస్కరించుకుని మంచి పనుల కోసం వినియోగించాలి. సత్త్వగుణాన్ని వృద్ధిచేసుకుని క్రమంగా గుణాతీత స్థితికి చేరుకుని మోక్షం పొందాలి. ఇదీ రాముని మార్గం. అదే రామాయణం. ఆధునిక సమాజానికి ఆనాటి రాముడు చెప్పి, చేసి చూపించింది ఇదే.**

మూడుగుణాలకు ప్రతీకలుగా ముగ్గురూ స్త్రీలనే చూపించే ఈ ఘట్టం ద్వారా మరో విశేషం గ్రహించవచ్చు. **'స్త్రీ' అనే పదాన్ని గమనిస్తే సకారం సత్వ గుణం, త కారం తమోగుణం, రకారం రజోగుణం అని తెలుస్తుంది. పైన ఈకారం అమ్మవారి బీజాక్షరం. త్రిగుణాత్మక ప్రకృతికి ప్రతీకే స్త్రీ. అదీ మన భాష గొప్పదనం.**

* * * * *

ప్రేమ, ప్రేమ అంటూ కొట్టుకుపోయే మన యువతీయువకులకి శ్రీరాముడు ప్రేమంటే ఏమిటో, ఎవరిని ప్రేమించాలో తెలియజేశాడు. సీతను పెండ్లాడాక ఆమెను ప్రాణాధికంగా ప్రేమించాడట.

ఇది పెద్దలు కుదిర్చిన పెండ్లికదా అని రాముడు సీతను ప్రత్యేకించి ఇష్టపడ్డాడట. తాను ధనుర్భంగం అనే పందెంలో గెలిచి చేసుకున్నదే అయినా ఆ ప్రయత్నం విశ్వామిత్రుని ఆదేశంతోనే గదా చేసింది! అనంతరం దశరథాదు లందరూ అంగీకరించిందే గదా ఆ పెండ్లి! అందుకోసం రాముడు ఆమె అంటే ఇష్టం కావాలనే పెంచుకున్నాడు. సీత కూడా తన గుణగణాలతోను, లక్ష్మీకళతో విలసిల్లే రూపంతోనూ రామునికి తనపై ప్రేమ పెరిగేలా చేసుకుంది. **ఇదీ సంసారం నిలబెట్టుకొనే లక్షణం. ప్రేమించి పెళ్లి చేసుకోవాలా, పెళ్లిచేసుకొని ప్రేమించాలా అని పెద్ద పెద్ద చర్చలు జరుపుతున్న ఈ కాలం యువతరానికి రాముడు**



**ఆచరించి చూపిన మార్గం ఇది.** యువతీయువకులు తమ సహచరుణ్ణి ఎన్నుకోవాలనుకుంటే అందానికి కొందరు, ఐశ్వర్యానికి కొందరు, ఆర్భాటాలకు కొందరు, అర్థంకాని, అర్థంలేని విషయాలకు కొందరు ప్రాధాన్యం ఇచ్చి పెళ్ళి చేసేసుకుని ఆ తరువాత ఒకటి ఉంటే ఒకటి లేదని బాధపడుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు అలా ఉండవు.

అమ్మాయి వరుడి అందం చూస్తే, అత్తగారు (అమ్మాయి తల్లి) ఆస్తిపాస్తులు చూస్తుందట. మామగారు అల్లుడి చదువు, ఉద్యోగం, హోదా అన్నీ చూస్తాడు. బంధువులు వంశం, సంప్రదాయం చూస్తారు. ఇతరులు పదిమందినీ పిలిచి మంచిభోజనం పెట్టగలడా అని ఆలోచిస్తారట. ఇంతమంది ఇన్నీ చూస్తే ఆ బంధం ప్రబంధంలా కలకాలం ఉంటుంది. లేకపోతే దుర్గంధమై తాను కుళ్లిపోయి చుట్టూ వాతావరణం కూడా కుళ్లబెడుతుంది. అందుకే **రాముడు పెద్దలు కుదిర్చిన పెళ్లిచేసుకుని యువకులకీ, అలా చేసుకొన్న భర్తను రూపంతోను, గుణాలతోను ఆకర్షించి సంసారం నిలబెట్టుకోమని యువతులకీ సందేశం ఇస్తున్నాడు.**

* * * * *

మరో ముఖ్య సంఘటన. చివరిదైనా కాని చిన్నది కాని విషయం. రామరావణయుద్ధం ముగిసింది. వానరులంతా అలసిపోయి ఉన్నారు. ఆ సమయంలో విభీషణుడు పదిరోజుల పాటు లంకలో ఉండి విశ్రాంతి తీసుకుని వెళ్లమని కోరాడు. లక్ష్మణ, సుగ్రీవులతో సహా అందరూ సై అంటే సై అని తయారయ్యారు. కాని అలా లంకలో మకాం పెడితే వానరుల బుద్ధులు ఎలా మారతాయో రామునికి బాగా తెలుసు. క్రమంగా పదిరోజులు- పదిమాసాలు అవుతాయి. అసలీ రాజ్యం విభీషణునికి ఎందుకివ్వాలి అనే చర్చ వస్తుంది. విజయమదాలసులైన వానరులు లక్ష్మణునితో సహా లోభగ్రస్తులై దానం ఇచ్చిన రాజ్యాన్ని తిరిగి తీసేసుకుందామనే దురాలోచన చేసే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రమాదానికి ఇప్పటి పదిరోజుల విశ్రాంతి ఒక అవకాశం. ఇది గ్రహించిన రాముడు మొత్తం స్వార్థప్రవాహానికి అడ్డు కట్టవేసే ఉద్దేశ్యంతో ఇలా అంటాడు.

**"ఓ లక్ష్మణా! లంక ఎంత సువర్ణమయమైనా, సుఖ భోగాలమయమైనా ప్రస్తుతం నా దృష్టి దాని మీద లేదు. కన్నతల్లి కన్నా, ఉన్న ఊరుకన్నా ఏదీ అందంగా ఉండదు. స్వర్గమైనా, ఈ రెండింటికన్నా తక్కువే.** అందువల్ల పధ్నాలుగేళ్లుగా నీ కోసం, నా కోసం చూస్తున్న జనని కోసం, జన్మభూమి కోసం వెంటనే బయలుదేరుదాం పదండి" అని ఉపదేశంరూపంలో ఆదేశించాడు.



మనకు నచ్చనివిషయాన్ని కూడా సలహా ఇచ్చిన వాళ్ల మనస్సు గాయ పడకుండా ఎంత సున్నితంగా చెప్పవచ్చో నిరూపించాడు. ఇదీ సంభాషణా నైపుణ్యం అంటే.

ఇటువంటివి ఎన్నో అంశాలు రామాయణం నుండి మన యువతరానికి నేర్పవచ్చు. రామాయణం ఆ కాలానికి మాత్రమే సంబంధించింది కాదు. అది సార్వకాలిక సత్యం. అటువంటి గ్రంథాలు నదులు, కొండలు, అరణ్యాలు ఉన్నంతవరకు ఉంటాయి. ఎందుకంటే వాటిని రచించిన వారు కేవలం కవులు కాదు. ఋషులు. ముందు తపించి తరువాత రచించారు.

# సర్వవేదసారం!

– 'సారస్వత కళానిధి'
డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి

జనులలో అంతర్లీనంగా దాగి ఉన్న భక్తిభావాలకు ఊపిరిపోసి ఆధ్యాత్మికచైతన్యం కలిగించిన వైతాళికుడు అన్నమయ్య. భక్తి సాహిత్యం సమాజంలోని అన్నివర్గాల వారిని ఆకర్షించటమే కాక వారికి అనుభూతినందిస్తుంది. సమాజంలోని అసమానతలను తొలగించి సమదృష్టిని నేర్పుతుంది. లౌకిక సమాజవ్యవస్థలో వర్గాలు, వర్ణాలు, వృత్తులు, మతాలు, శాఖలు, ప్రవృత్తులు మొదలైన వాటివల్ల మనిషికీ మనిషికీ నడుమ అడ్డుగోడలు అధికమై సమాజంలో సామరస్యం నశించినప్పుడు, వీటన్నిటిలో ఏకసూత్రంగా, అన్వయసూక్తంగా ఉపకరించేది భక్తి కవిత్వమే.

కనుక, సమాజాభ్యుదయానికి, భక్తికవిత్వానికి అవినాభావసంబంధం ఏర్పడింది. మహత్తరమైన తీరులో అన్నమయ్య తన సంకీర్తనల్లో సమాజ శ్రేయస్సును నిక్షిప్తం చేశాడు. ఏ కులమైనా, ఏ మతమైనా భగవత్సంకల్పం చేతనే ప్రవర్తిల్లుతున్నదనే సత్యాన్ని మానవుల లౌకికానుభవాలతో పోల్చి నిరూపించాడు.

**తందనాన ఆహి - తందనాన పురే**
**తందనాన భళా - తందనాన**
**బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే-పరబ్రహ్మమొక్కటే**
**కందువగు హీనాధికము లిందు లేవు- అందరికీ శ్రీహరే అంతరాత్మ**
**ఇందులో జంతుకులమింతా ఒక్కటే - అందరికీ శ్రీహరే అంతరాత్మ.**

ఏప్రిల్, 01 న
**అన్నమయ్య వర్ధంతి**
సందర్భంగా...

భిన్నభిన్న స్వరూపస్వభావాలతో, సదా పరిణామం చెందుతున్న ఈ విశ్వంలో ఎటువంటి మార్పులేక శాశ్వతమైంది బ్రహ్మమొక్కటే. ఈ సృష్టిలో తెగలుతెగలుగా విడదీసి చూపటానికి హెచ్చుతగ్గులు ఏవీలేవు. సకల జంతుజాలానికి శ్రీహరిఒక్కడే అంతరాత్మ.

**నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే**
**అండనే బంటునిద్ర అదియు నొకటే**
**మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే**
**చండాలు డుంటేటి సరిభూమి యొకటే**

ఒక చక్రవర్తి హంసతూలికాతల్పంపై నిద్రించవచ్చు. ఆ చెంతనే ఆతడి భటుడు కటికనేలపై నిద్రించవచ్చు. శయ్యలలో భేదం ఉన్నప్పటికీ వారిరువురి నిద్రఒక్కటే.

**కొరలిశిష్టాన్నములు గొను నాకలొకటే**
**తిఱుగు దుష్టాన్నములు తినునాక లొకటే**
**పరగు దుర్గంధములపై వాయువొకటే**
**వరుస పరిమళముపై వాయువొకటే**

**కడిగి యేనుగుమీద గాయు యెండొకటే**
**పుడమిశునకముమీద బొలయు నెండొకటే**
**కడుపుణ్యులను పాపకర్ములను సరిగావ**
**జడియు శ్రీవేంకటేశ్వరునామ మొకటే**

ఆహారం ఏద్దైనా ఆకలితీరటమే ప్రయోజనం. పంచభూతాలు, దివారాత్రాలు సమస్తమానవాళికి ఒకేరీతిలో శ్రేయస్సును కలిగిస్తాయి. అటు పుణ్యాత్ములను, ఇటు పాపకర్ములను సమానంగా రక్షించేది శ్రీవేంకటేశ్వరుని నామం ఒక్కటే అని అన్నమయ్య ఈ సంకీర్తనలో చాటి చెప్పాడు.


సర్వత్ర వ్యాపించి ఉన్న ఆ దేవదేవునితత్త్వాన్ని జ్ఞాన సంపన్నులు, భక్తిభరితులు మాత్రమే దర్శింపగలరు. వారే పండితులు. బ్రాహ్మణుడు, గోవు, గజం, శునకం మొదలైన ప్రాణులందు పండితులు సమదర్శనులై ఉంటారని కృష్ణపరమాత్మ భగవద్గీత(5-18)లో పేర్కొన్నాడు.

నిద్ర, నేల, సౌఖ్యం, ఆకలి ఇవి జీవకోటికి నిత్యానుభవంలో ఉంటాయి. అందరికీ ఒకేవిధమైన అనుభూతిని

కలిగిస్తాయి. **ఒకే విధమైన వాత్సల్యామృతాన్ని భగవంతుడు జీవులపై వర్షిస్తాడు. కనుక కుల, మత, వర్గ విచక్షణ వీడి, విషమదృష్టిని విడిచి సమదృష్టిని అలవరచుకోవాలని ఈ సంకీర్తన బోధిస్తుంది.**

* * * * *

సృష్టిలో పిపీలికం మొదలు మహాత్ముని వరకు గల జంతురాసులకు జననమరణాలు ఒకే తీరుగా సాగుతున్నాయి. జీవులు వారి వారి కర్మల ననుసరించి అనేక జన్మలు ధరిస్తున్నారు. అన్ని ప్రాణులలో పరమాత్మ అంతరాత్మగా నిలిచి ఉన్నాడు. కనుక సమబుద్ధిని వహించటమే కర్తవ్యం. వేదసారం ఇదే. ఈ భావాన్ని వెల్లడిస్తూ అన్నమయ్య.



**సమబుద్ధే ఇందరికి - సర్వవేదసారము**
**సముడిం దరికి హరిసాధనమోయయ్యా**

అన్నాడు. ఏ జాతిలో జన్మించినా జీవి సాధించిన ఘనత ప్రధానమని మరొక సంకీర్తనలో అన్నమయ్య గానం చేశాడు.

**తలమేల కులమేల తపమే కారణము**
......................................
**కాకము వల్ల బుట్టదా ఘనమైన యశ్వత్థము**
**దాకొని గుల్లలో పుట్టదా ముత్తెము**
......................................
**చిడిపిరాళ్ల బుట్టవా చెలువైన వజ్రములు**
**పుడమి నీగల వల్ల పుట్టదా తేనె**
**వెదగు బిల్లిమేనను వెల్లదాయనా జవ్వాది**
**వుడివోని పుణ్యు లెందునుదయించిరేమి?**
......................................
**కొంకక శ్రీవేంకటేశు గొలిచిన దాసులు**
**సంకె లేని జ్ఞానులెందు జనియించిరేమి?**

అత్యంత అల్పమైన వస్తువు నుండి సైతం మహత్తరమైన, కాంతిమంతమైన వస్తువులు ఉద్భవిస్తాయి. లోకంలో అపారమైన గౌరవాదులను అందుకుంటాయి. ఈ తాత్త్విక సత్యనిరూపణ కోసం అన్నమయ్య వజ్రపు పుట్టుక, పుట్ట తేనె మొదలైన లౌకిక ఉపమానాలను స్వీకరించాడు. భగవద్భక్తి జ్ఞానకారణం కానీ, జన్మించినవంశం కారణం కాదని నిరూపించాడు. **'భక్తిఃజ్ఞానాయ కల్పతే'** కదా.

ఈ విధంగా **ఒక వంక ఆధ్యాత్మిక దృష్టి, మరొక వంక సామాజికదృష్టి, వేరొకవంక వ్యక్తిత్వ వికాస సూత్రాలు నిండిన సమస్తవిజ్ఞానభాండాగారంగా అన్నమాచార్యుల సంకీర్తనాసాహిత్యం తెలుగు భాష ఖ్యాతిని ఇనుమడింపచేసింది.**

వచ్చే నెల నుండి...

# శ్రీకృష్ణభగవద్విజయం

నలుగురు ప్రతినాయకులను వధించి శ్రీకృష్ణపరమాత్ముడు శిష్టరక్షణ చేసిన కథ!

హంసడింభకులు అనే సాల్వరాజకుమారుల కథ!

ఉన్నతసాహితీవేత్తలకు తప్ప సామాన్యులకు తెలియని కథ!

చక్కటి కథావిధానంతో, రసోల్లాసంగా సాగిన కథ!

భాషా సౌందర్యం, శబ్దార్థచమత్కారాలు ఒకదానికొకటి పోటీ పడిన కథ!


దృశ్యకావ్యలక్షణాలు పుష్కలంగా ఉన్న కథ!

పాంచజన్యధరుని లీలావిలాసాలు, చమత్కార మార్గాలు ఆస్వాదించడానికి **'సప్తగిరి' మాసపత్రిక** తన ప్రియపాఠకులకు **ధారావాహిక**గా అందిస్తున్న మహత్తర పౌరాణిక గాథ!

తెలుగు సాహిత్యంలో రెండు డాక్టరేట్లు సాధించి, పాతికేళ్లకు పైబడి విశేషరచనానుభవం కలిగిన... **డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు** కలం నుండి వెలువడిన రచన ఇది.

పాఠకలోకానికి తమ రచనలో ఒక మనోహర చలనచిత్రాన్ని మనోనయనాలముందు, నిలిపే శైలి...... **డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు** గారిది.

వైశాఖమాసం నుండీ ప్రతినెలా చదవండి!








తిరుమల తిరుపతి దేవస్థానములు

నాగులాపురం
శ్రీ వేదవల్లీసమేత
శ్రీ వేదనారాయణస్వామివారి
బ్రహ్మోత్సవం

18-04-2019 నుండి
27-04-2019 వరకు



తిరుమల తిరుపతి దేవస్థానములు

## తిరుపతి శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

02-04-2019 నుండి 11-04-2019 వరకు

**02-04-2019**
మంగళవారం
పగలు: ---------
రాత్రి: సేనాపతి ఉత్సవం,
అంకురార్పణం

**03-04-2019**
బుధవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**04-04-2019**
గురువారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**05-04-2019**
శుక్రవారం
పగలు: సింహవాహనం
రాత్రి:
ముత్యపుపందిరివాహనం

**06-04-2019**
శనివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**07-04-2019 ఆదివారం**
పగలు:
పల్లకీలోమోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**08-04-2019**
సోమవారం
పగలు: హనుమద్వాహనం
సాయంత్రం: వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**09-04-2019**
మంగళవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**10-04-2019**
బుధవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**11-04-2019**
గురువారం
పగలు: పల్లకీ ఉత్సవం,చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



తిరుమల తిరుపతి దేవస్థానములు

## వాయల్పాడు(వాల్మీకిపురం)
## శ్రీ పట్టాభిరామస్వామివారి
## బ్రహ్మోత్సవం

10-04-2019 నుండి
19-04-2019 వరకు

**10-04-2019**
బుధవారం
పగలు: --------
రాత్రి: సేనాపతి ఉత్సవం
అంకురార్పణం

**12-04-2019**
శుక్రవారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**14-04-2019**
ఆదివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**16-04-2019**
మంగళవారం
పగలు: హనుమద్వాహనం
సాయంత్రం: వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**18-04-2019**
గురువారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం



**11-04-2019**
గురువారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: -------

**13-04-2019**
శనివారం
పగలు: సింహవాహనం
రాత్రి:
ముత్యపుపందిరివాహనం

**15-04-2019**
సోమవారం
పగలు:
పల్లకిలోమోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**17-04-2019**
బుధవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**19-04-2019**
శుక్రవారం
పగలు: పల్లకీ ఉత్సవం,చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



తిరుమల తిరుపతి దేవస్థానములు

## ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

12-04-2019 నుండి 21-04-2019 వరకు

**12-04-2019**
శుక్రవారం
పగలు: న్యాసాభిషేకం
రాత్రి: అంకురార్పణం

**13-04-2019**
శనివారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: శేషవాహనం

**14-04-2019**
ఆదివారం
పగలు: వేణుగానాలంకారం
రాత్రి: హంసవాహనం

**15-04-2019**
సోమవారం
పగలు: వటపత్రశాయి అలంకారం
రాత్రి: సింహవాహనం

**16-04-2019**
మంగళవారం
పగలు: నవనీత కృష్ణాలంకారం
రాత్రి: హనుమత్సేవ

**17-04-2019**
బుధవారం
పగలు:
మోహినీ సేవ
రాత్రి: గరుడ సేవ

**18-04-2019**
గురువారం
పగలు: శివధనుర్భాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు, కళ్యాణోత్సవం,
గజవాహనం

**19-04-2019**
శుక్రవారం
పగలు: రథోత్సవం
రాత్రి: ------

**20-04-2019**
శనివారం
పగలు: కాళీయమర్దనాలంకారం
రాత్రి: అశ్వవాహనం

**21-04-2019**
ఆదివారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం




తిరుమలగిరులలో తి.తి.దే. వారిచే 19-02-2019 న నిర్వహించబడిన కుమారధారతీర్థముక్కోటి దృశ్యాలు




తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తలమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం

శ్రీ వేనాటి రామచంద్రారెడ్డి గారు (21-02-2019)    శ్రీ ఎస్.ప్రసాద్ బాబు గారు (22-02-2019)



తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిగా
పనిచేసి బదిలీ అయిన శ్రీ పోలభాస్కర్, ఐ.ఏ.ఎస్., గారికి
వీడ్కోలు సభ



తి.తి.దే. నూతన సంయుక్త కార్యనిర్వహణాధికారి(తిరుపతి) గా
10-02-2019 న పదవీబాధ్యతలు స్వీకరించిన
శ్రీ పి. లక్ష్మీకాంతం, ఐ.ఏ.ఎస్., గారు

# నవచైతన్యమాసం... చైత్రం

- డా॥ కప్పగంతు రామకృష్ణ

పచ్చతోరణం

**వసంతకాలంలో ప్రకృతి అంతా పచ్చదనంతో నిండి ఉంటుంది. మల్లెల సుగంధం..... ప్రతి మనసునీ మత్తెక్కిస్తుంది. కోకిల పాటలు అలౌకిక ఆనందాన్నిస్తాయి. వసంతకాలంలో పుష్పాల్లో...... మధువు (తేనె) ఎక్కువగా ఉంటుంది. అందుకే దీన్ని 'మధుమాసం' అంటారు. కాళిదాసు రచించిన ఋతుసంహార కావ్యంలో మధుమాస శోభ అనంతంగా కనిపిస్తుంది. వసంత మాసానికి 'సురభి' అనే పేరు కూడా ఉందని అమరకోశం చెబుతోంది. సురభి అంటే కోర్కెలు తీర్చేది అని అర్థం. అంటే వసంతమాసం కోరిన కోర్కెలు తీరుస్తుందని భావం. 'ఋతూనాం ముఖో వసంత:' అని తైత్తిరీయ బ్రాహ్మణంలో ఉంది. అంటే ఋతువులన్నింటిలో వసంత ఋతువుదే అగ్రస్థానం అని అర్థం. ఇలా మానవ జీవనగమనంలో 'వసంతం' ఒక అంతర్భాగంగా నిలిచిపోతుంది.**



చైత్రమాసం అనగానే అందరికీ గుర్తుకు వచ్చే పర్వదినం ఉగాది. కొత్త సంవత్సరం ప్రారంభానికి ఉగాది సంకేతం. ఉగాది అనే పేరు ఎలా వచ్చింది? ఇందుకు ప్రమాణాలు ఏమిటి? సౌర, చాంద్రమానాల భేదాలేమిటి? అనే చర్చను పక్కన పెడితే, ఉగాది రోజున తప్పనిసరిగా చేయవలసిన కృత్యాలను కొన్నింటిని శాస్త్రం నిర్దేశించింది. అవేమిటంటే..

### 1) ప్రతిగృహ ధ్వజారోహణం

అంటే ప్రతి ఇంటిలో భగవద్ధ్వజాన్ని (జెండా) ఎగురవేయాలి. ధ్వజం సార్వభౌమత్వానికి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విజయానికి చిహ్నం. ధ్వజం సాహస కార్యాలకు స్ఫూర్తినిస్తుంది. ముక్కు మూసుకుని తపస్సు చేయడమే కాదు.. అవసరమైతే వీరఖడ్గాన్ని ధరించాల్సిన అవసరాన్ని ధ్వజం సదా మనకు గుర్తు చేస్తుంది. కొత్త సంవత్సరంలో మరిన్ని విజయశిఖరాలను అధిరోహించాల్సిన లక్ష్యాన్ని ధ్వజం నిర్దేశిస్తుంది. ప్రతి భారతీయుడి గుండెలో ఎగురుతున్న తరతరాల సాంస్కృతిక, ఆధ్యాత్మిక సమున్నతికి ధ్వజంచిహ్నంగా నిలుస్తుంది. కాబట్టి, ఉగాదిరోజున ప్రతిఇంట్లో తప్పనిసరిగా భగవద్ధ్వజాన్ని ఎగురవేయాలి.

### 2) తైలాభ్యంజనం

ఆపాద మస్తకం నువ్వులనూనె రాసుకుని, కుంకుడు రసంతో ఉగాది రోజున అభ్యంజనం (తలంటుస్నానం) చేయాలి. నూనె, కుంకుడు కాయల్లోని ఔషధ గుణాన్ని మనిషికి చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. అభ్యంజనం శరీరానికి ఆవహించి ఉండే జడత్వాన్ని దూరం చేసి, శరీరంతో

పాటు మనసునూ చైతన్యవంతం చేస్తుంది. ఇలా చైతన్యవంతమైన మనస్సు ధర్మకార్యాల మీద మాత్రమే లగ్నమవుతుంది. ఎప్పుడైతే మనిషి సదా ధర్మకార్యాలు చేస్తుంటాడో అతడికి భగవంతుని కటాక్షం వెంటనే కలుగుతుంది. అంతిమంగా కైవల్యానికి మనిషి చేరువ అవుతాడు. కాబట్టి, నూనె 'జిడ్డు'గా భావించకుండా ఉగాది రోజున ప్రతి ఒక్కరూ తైలాభ్యంజనం చేయాలి.

### 3) ఛత్రచామర స్వీకారం

అంటే కొత్త గొడుగు, విసనకర్రలను కొనుగోలు చేయడం. వసంతం తర్వాత వచ్చే ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మన పూర్వీకులు ఈ ఆచారాన్ని నిర్దేశించారు. భౌతిక ఆరోగ్య సంరక్షణ కూడా మన ప్రాచీన కాలవిభజనలో అంత ర్లీనంగా సాగుతుంది. ఈ క్రమంలో ప్రకృతిలో సహజంగా లభించే తాటి, మేదరలతో తయారు చేసిన గొడుగు, విసనకర్ర లను ఉగాది రోజున ప్రతి మనిషీ స్వీకరించాలి.

### 4) దమనేన బ్రహ్మపూజ

అంటే పరిమళ భరిత పత్ర, పుష్పాలతో దేవతలను పూజించడం. చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి పూర్ణిమ వరకు గల 15 రోజుల్లో 15 మంది దేవతలను పూజించాలి. తిథుల ప్రకారం వరసగా పాడ్యమి బ్రహ్మ ; విదియ-ఉమాదేవి, శివుడు, అగ్ని; తదియ-గౌరీశంకరులు, చవితి-గణేశుడు, పంచమి-నాగదేవత, షష్ఠి- కుమారస్వామి, సప్తమి-సూర్యుడు, అష్టమి-మాతృదేవతలు, నవమి-దుర్గాదేవి, దశమి-ధర్మరాజు, ఏకాదశి-మునులు, ద్వాదశి-మహావిష్ణువు, త్రయోదశి-మన్మథుడు, చతుర్దశి-శివుడు, పూర్ణిమ-ఇంద్ర దేవతలను పూజించాలి.

### 5) మహాశాంతి పూజలు

రాబోయే రోజుల్లో కలిగే విఘ్నాలు నివారించాలని కోరుతూ ఉగాది రోజున గణపతిని ప్రతి ఒక్కరూ అర్చించాలి. దీంతో పాటు గ్రహసంబంధమైన దోషాలు తొలగాలని కోరుతూ నవగ్రహాలను కూడా పూజించాలి. మనోనిశ్చలత, కార్యసాధన పట్ల దీక్ష ఈ పూజల్లోని అంతరార్థంగా ఉంటాయి. సాధారణ రోజుల్లో ఈ పూజలు చేయడం వర్తమానంలో అలవాటుగా ఉంది. అయితే శాస్త్రనియమాల ప్రకారం ఉగాది రోజున ఈ మహా శాంతి పూజలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిర్వహించాలి.



## ఉగాది - ఆచార సంప్రదాయాలు

**శుభనిరీక్షణకు ఉగాది సంకేతంగా నిలుస్తుంది. తెలుగువారికి ఉగాది కొత్త సంవత్సరం మొదటిరోజు మాత్రమే కాదు. ప్రకృతి మొదలు ప్రజానీకం వరకూ అన్నిటా నూతనత్వమే కనిపిస్తుంది. కొత్త పంట చేతికి వస్తుంది. చెట్లు చిగురిస్తాయి. పక్షులు రాగాలు తీస్తాయి. గ్రహగమనాలు కొత్తదోవకు మరలుతాయి. ఈ రకంగా ఎన్నో వైవిధ్యాలను తనలో నింపుకున్న ఉగాది పండుగ జరుపుకోవడంలోను ఎన్నో వైవిధ్యాలు మనకు కనిపిస్తాయి. ప్రాంత, ఆచారభేదాలను అనుసరించి ఒక్కోచోట ఒక్కోరకంగా ఉగాది జరుపుకుంటారు.**

### 6) పంచాంగ పూజ, శ్రవణం

తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే ఐదు అంగాలతో కూడినదే పంచాంగం. శాస్త్రవిధానాల ప్రకారం ఉగాది రోజున బంధుమిత్రులతో కలసి ఉదయం దేవతాపూజ, పంచాంగపూజ చేసి, పిండి వంటలు ఆరగించాలి. సాయంత్రం దేవాలయానికి వెళ్ళి, ధర్మనిరతులైన పండితులు చెబుతుండగా పంచాంగ శ్రవణం చేయాలి.

ఉగాది రోజున పంచాంగ శ్రవణంచేస్తే చెడు కలలు రావు. శత్రునాశనం జరుగుతుంది. గోదానం చేసిన ఫలితం కలుగుతుంది. ఆయుష్షువృద్ధి అవుతుంది.



నాలుకను నిగ్రహించుకున్నవారు ప్రశాంతంగా ఉంటారు

**ఆభేదాలేమిటంటే...**

1) పాడ్యమి రోజు నుంచి రామాయణ పారాయణ ప్రారంభం చేసి, నవమికి పూర్తి చేసి సీతారాముల కల్యాణం నిర్వ హిస్తారు.

2) రైతులు నాగలిపూజ చేసి... వారి.... పొలాల్లో తూర్పుపడమరలుగా ఐదు (లేదా) తొమ్మిది చాళ్ళు దున్నుతారు.

3) వైష్ణవమతానుయాయులు ఎద్దులను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు.

4) శైవులు వీటికి తోడు ఎద్దులను విబూది, పూలతో అలంకరిస్తారు.

5) దక్షిణదేశంలో.. ఈ రోజున.... గ్రామ దేవతలకు, క్షుద్రదేవతలకు జంతుబలి ఇవ్వరు. కేవలం కొబ్బరికాయలు నివేదన చేస్తారు.

6) ఆడపడుచులను, ముత్తయిదువులను పూజించి, నూతనవస్త్రాలు, పసుపు కుంకుమలు అందిస్తారు.

సకలకార్యాలు సిద్ధిస్తాయి. అంతేకాదు, సంపదలు కోరేవారు 'తిథి' పట్ల, దీర్ఘాయుష్షు కోరేవారు 'వారం' పట్ల, పాపవిముక్తి కోరేవారు 'నక్షత్రం' పట్ల, ఆరోగ్యం కోరేవారు 'యోగం' పట్ల, కార్యజయం కోరుకునే వారు 'కరణం' పట్ల జాగరూకత వహించాలని శాస్త్రం చెబు తోంది.

### 7) నింబకుసుమ భక్షణం

నింబకుసుమం అంటే వేప పువ్వు. ఉగాది రోజున చిన్నాపెద్దా అందరూ ఇష్టంగా తినే ఉగాది పచ్చడి ఇదే. ఉగాది రోజున వేకువ జామునే లేచి, కాలకృత్యాల అనంతరం అభ్యంజనం ఆచరించి, దైవపూజ చేసి, శుచిగా నియమాల ప్రకారం చేసిన ఉగాది పచ్చడిని దేవునికి నివేదించి, ఆ తర్వాత కుటుంబ సభ్యులందరూ వేప పూత పచ్చడి ఆరగించాలి.

### 8) ప్రపాదాన ప్రారంభం

అంటే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం. ఉగాది ప్రకృతి మార్పునకు సంకేతం. రాబోయే గ్రీష్మ తాపాన్ని తట్టుకునేందుకు, దప్పిక తీర్చుకునేందుకు ముందుగానే ప్రజలను అప్రమత్తులను చేయడం ఈ ఆచారం వెనుక దాగిఉన్న ఉద్దేశం. దీనివల్ల ప్రజల్లో 'భూతదయ' వృద్ధి అవుతుంది.

'మానవసేవే మాధవసేవ' అనే నానుడిని ఈ ఆచారం ద్వారా మన పెద్దలు ఆచరణలోకి తీసుకువచ్చారు.

### 9) రాజ, మిత్ర సందర్శనం

ఉగాది రోజున స్నేహితులను, పెద్దలను కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు విచారించుకోవాలి. శుభాకాంక్షలు తెలుపుకోవాలి.

దీనివల్ల మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగాలు శాశ్వతంగా నిలుస్తాయి. రక్తసంబంధాలు మృగ్యం కాకుండా ఈ ఆచారం కాపాడుతుంది.

### 10) వాసంత నవరాత్ర కలశపూజ

ఉగాది నుంచి తొమ్మిదిరోజుల కాలాన్ని వసంత నవ రాత్రులు అంటారు. ఈ రోజుల్లో భగవంతుడిని ఆరాధించే విధి, నియమాలను శాస్త్రం సవివరంగా చెప్పింది. దీనిప్రకారం ఉగాది రోజున దేవతా మందిరంలో కలశాన్ని ఉంచి, పూజించాలి. ఇంటి ఆచారాలు, గురూపదేశాల ప్రకారం ఇతర అర్చనాది కైంకర్యాలు నిర్వహించాలి. దేవీభాగవతం, ధర్మసింధువు తదితర గ్రంథాల్లో వసంత నవరాత్రుల వర్ణన, ప్రాశస్త్యం విస్తారంగా వర్ణితమై ఉంది. భగవత్తత్త్వానికి 'పర', 'అపర' అనే రెండు ప్రకృతులు ఉంటాయి.

ఒకటి చేతనం కాగా మరొకటి అచేతనం. బాహ్యంగా కనిపించే పంచభూతాలు, అహంకారం, బుద్ధి, వ్యక్తం అనే ఎనిమిదికి (అపరా ప్రకృతి) పరా ప్రకృతి కలిపితే మొత్తం తొమ్మిది అవుతాయి. ఈ తొమ్మిది ప్రకృతులకు సంకేతంగా జరుపుకునేవే 'వసంత నవరాత్రులు'. ఇది ఆధ్యాత్మిక రహస్యం.

# కృతయుగం నుంచి... ఒంటిమిట్టలో... కోదండరాముడు!

- శ్రీ కట్టా నరసింహులు

ఒంటిమిట్టగుడిలో సీతాలక్ష్మణసమేతుడై శ్రీకోదండ రామస్వామి కొలువుతీరడానికి కృతయుగంలోనే బీజం పడింది. హిమాలయాలలో ఉంటున్న జాంబవంతుడు తపస్సు చేసుకోవడానికి తానున్న హిమాలయాలు వదలి దక్షిణదేశానికి వచ్చాడు. అక్కడ ఒక చిన్న తిప్ప, అక్కడ ఎలుగుబంట్లు సంచరిస్తూ ఉన్నాయి. చుట్టూ మారేడు వనం వ్యాపించి ఉంది. ఈ ప్రాంతం జాంబవంతునికి నచ్చింది. ఆ తిప్ప మీద కుటీరం ఏర్పాటు చేసుకున్నాడు. సమీపంలో పాలకొండ నుంచి నిరంతరాయంగా నీరు ప్రవహిస్తూ ఉంది. జాంబవంతునికి ఇంకేం కావాలి. తన జాతి వారైన ఎలుగు బంట్లు ఆయనకు సహకరించారు. వంద సంవత్సరాలు ఉత్తర దిక్కుగా కూర్చొని తపస్సు ఆయన చేశాడు. ఈ తపస్సుకు ఆయన ఎన్నుకున్నది 'రామ తారక మంత్రం' ఆ మంత్రం ద్వారా శ్రీరాముని దివ్యసాక్షాత్కారం. రామ తారక మంత్రం అంటే శ్రీరామచంద్రునికి సంబంధించింది కదా! అప్పటి కింకా త్రేతాయుగం రాలేదు కదా! అంటారేమో. ఇప్పటికి 27 మహాయుగాలు గడచిపోయాయి. 28వ మహాయుగం నడుస్తూ ఉంది. ప్రతి మహాయుగం లోను నాలుగుయుగాలు ఉంటాయి. అంటే ఇప్పటికే 27 త్రేతాయుగాలు గడచి పోయాయి. ఆ ప్రకారం 27గురు శ్రీరామచంద్రులు భూమి మీదకు దిగి వచ్చి ఉంటారు. ఆ శ్రీరామచంద్రులు వేరువేరుకాదు. అందరూ ఒక్కరే. శ్రీమహావిష్ణువు అవతారాలే! కాబట్టి రామతారకమంత్రం గురించిన ఆలోచన ఇక ఉండదు. జాంబవంతుడు రామతారక మంత్రాన్ని జపించి శ్రీరామచంద్రుని సాక్షాత్కారం పొందాడు. జాంబవంతుడు తపస్సు చేస్తున్న తిప్పకు ఎదురుగా ఉన్న మిట్ట పై నుంచి రామచంద్రుడు దర్శనం ఇచ్చి జాంబవంతుని ఆశీర్వదించాడు. నీవు చిరంజీవిగా ఉంటావని వరం ఇచ్చాడు. శ్రీరామ చంద్రుడు దర్శనమిచ్చిన చోట మిట్టమీద వెలసిందే నేటి కలియుగ రెండవ వైకుంఠం. ఒంటిమిట్టలోని శ్రీకోదండరామ స్వామి ఆలయానికి కృతయుగంలోనే కాదు త్రేతాయుగం లోను ప్రాతిపదిక ఏర్పడింది.

అయోధ్యానగరంలో శ్రీరామచంద్రుడు పట్టాభిషేకం చేసుకోబోతున్నాడు. కైకమ్మ అడ్డుపడింది. ప్రజలకు పిడుగు వంటి వార్త అందింది. శ్రీరామచంద్రుడు సీతమ్మతోను లక్ష్మణుని తోను 14 ఏండ్లు అరణ్యవాసం వెళుతున్నాడు. వారు నారచీరలు ధరించారు. శ్రీరామచంద్రుడు తన వెంట కోదండం ఉంచుకున్నాడు. లక్ష్మణుడు విల్లంబులు ధరించాడు.



పదునాలుగేండ్ల అరణ్యవాసంలో శ్రీరామ చంద్రుడు కొంతకాలం జాంబవంతునికి దర్శన మిచ్చిన మిట్టమీద నివసించాడు. ఈ ప్రాంతంలో మునులు తపస్సు చేసుకుంటూ ఉండేవారు. శ్రీరాముడు ఉన్న ప్రాంతానికి పడమటగా మృకండుమహాముని ఆశ్రమం ఉండేది. ఇప్పటికీ ఆ ఆశ్రమాన్ని చూడవచ్చు. మునుల తపస్సుకు రాక్షసులు విఘ్నాలు కలిగించేవారు. అలాంటి దుష్టలను సంహరించడం కోసం శ్రీరామ చంద్రుడు ఈ వనవాసానికి వచ్చాడు.

ఒక వేసవి కాలం నేల మీద చినుకు రాలలేదు. పశువులు పక్షులు దప్పికతో అలమటించిపోతున్నాయి. సీతమ్మ గమనించింది. స్వామీ! ఇక్కడ జీవజంతువులు దప్పిక ఎలా తీర్చుకుంటాయి అన్నది. స్వామి వెంటనే కోదండం ఎక్కుపెట్టి బాణం సంధించాడు. బాణం నేలలోకి దూసుకొని వెళ్లి తిరిగి వచ్చింది. బాణం వెంట పాతాళగంగమ్మపైకి వచ్చింది. సీతమ్మ రామయ్య లక్ష్మన్న ముగ్గురు ఆ నీరు సేవించారు. ఆ బుగ్గ నేటికీ రామతీర్థం పేరుతో మనకు దర్శనమిస్తుంది.

సీతారామలక్ష్మణులు మరో చోటికి వెళ్ళారు. సీతమ్మను రావణాసురుడు చెరబట్టాడు. రామసుగ్రీవులకు స్నేహం ఏర్పడింది. ఆంజనేయుడు, జాంబవంతుడు సీతమ్మను వెతికే పనిలో పడ్డారు. జాంబవంతుడు తనకు కృతయుగంలో రామచంద్రుడు దర్శనమిచ్చిన చోటికి వచ్చాడు. ఆ రాత్రి అక్కడ శయనించాడు. ఉదయం ఆ నేలకు నమస్కరించి సీతమ్మను వెదకడానికి వెళ్లిపోయాడు. కలియుగంలో ఇక్కడ ఆలయం నిర్మాణం అయింది. ఆలయంలో వనవాసం చేస్తున్నప్పటి సీతారామలక్ష్మణులు కొలువై ఉన్నారు. **స్థానిక ప్రజలు ఆ కారణం చేతనే ఒంటిమిట్టగుడిని రెండవ అయోధ్యగా పిలుచుకుంటున్నారు.**

కలియుగం క్రీ.శ.14వ శతాబ్దంలో విద్యారణ్య మహర్షి ఆశీస్సులతో అక్కరాయలు బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. దక్షిణ భారతదేశంలో విదేశీయుల తాకిడిని అడ్డుకోవడం, హిందూ ధర్మాన్ని నిలబెట్టడం వారి లక్ష్యం. విజయనగర సామ్రాజ్యం దినదిన వర్ధమానం అవుతూ ఉంది. ఉదయగిరి కేంద్రంగా బుక్కరాయల సోదరుడు కంపరాయలు తూర్పు ప్రాంతాన్ని పాలించడానికి వచ్చాడు. ఒకమారు ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చాడు. ఒంటడు, మిట్టడు అనే బోయ నాయకులు కంపరాయలకు స్వాగతం చెప్పారు. రామబుగ్గ నీటితో ఆతిథ్యం ఏర్పాటు చేశారు. పడమటి వైపు కొండల నుంచి వంకలు, అక్కడక్కడ చిన్న గుట్టలు చెరువు నిర్మాణానికి అనుకూలమని కంపరాయలు భావించాడు. ఒంటడు, మిట్టడు ఈ ప్రాంతం ప్రశస్తి చెప్పారు. కృతయుగంలో జాంబవంతునికి, శ్రీరాముడు ప్రత్యక్షం కావడం త్రేతాయుగంలో ఈ ప్రాంతంలో, రాముడు వనవాసం చేయడం, జాంబవంతుడు సీతను వెతకబోయేముందు ఇక్కడకి వచ్చి శయనించడం చెబుతూ ఆ స్థలాలను పరిచయం చేశాడు. కంపరాయలు రామకుటీరం ఉన్నచోట ఆలయం నిర్మించడానికి అంగీకరించాడు. గుడి, చెరువు నిర్మాణ బాధ్యతలు ఆ బోయ సోదరులకే అప్పగించాడు.

క్రీ.శ.1356లో బుక్కరాయలు చక్రవర్తిగా కాశీ రామేశ్వర యాత్ర చేశాడు. యాత్రామార్గంలో ఒంటిమిట్టలో సీతారామలక్ష్మణుల ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠ చేశాడు. విద్యారణ్య మహర్షి అధ్వర్యంలో ఆలయ ప్రతిష్ఠ జరిగింది.


**శ్రీరాముడు-కృతయుగంలో జాంబవంతునికి వరం ఇవ్వడానికి ఇక్కడకు వచ్చాడు. త్రేతాయుగంలో మునుల యాగరక్షణకు దుష్టుల సంహారానికి ఇక్కడకు వచ్చాడు. ఇక**



**కలియుగంలో ధర్మం నిలబెట్టడానికి ఒంటిమిట్ట గుడిలో కొలువై కూర్చున్నాడు.**

బుక్కరాయల కాలానికి ఒంటిమిట్టగుడి ఇంత పెద్దది కాదు. అప్పుడు గర్భాలయం, అంతరాళం, ముఖ మండపం, గర్భాలయంపైన చిన్న గోపురం మాత్రమే ఉండేవి.

క్రీ.శ.1600 ప్రాంతం నుంచి ఆలయం అభివృద్ధి చెందింది. సిద్ధవటాన్ని పాలించిన మట్లరాజులు అనంతరాజు ఆయన కుమారుడు తిరువేంగళనాథుడు ఆయన కుమారుడు కుమార అనంతరాజు మూడుదశాబ్దాల పాటు ఆలయాన్ని వైభవోపేతంగా తీర్చిదిద్దారు. రంగమంటపం, విశాలమైన ప్రాంగణం, కోటగోడలాంటి మహాప్రాకారం, మూడు గాలి గోపురాలు వారి కాలంలో నిర్మాణమైనవే. ఆలయం బయట సంజీవ రాయస్వామి ఆలయం, రథశాల, రథం, రామతీర్థం నిర్మించారు. రంగమంటపం 32 బలమైన రాతి స్తంభాల మీద శిల్పకళాశోభితంగా చూపరులను ఆకట్టుకునే విధంగా నిర్మించారు. ఆలయంలోపల ఆగ్నేయదిశలో వంటశాల నైరుతిదిశలో కల్యాణమంటపం దక్షిణంవైపు 2 ఎదుర్కోలు మంటపాలు చూడముచ్చటగా నిర్మించారు. **తూర్పువైపు నుంచి 32 సోపానాలను ఎక్కుతూ స్వామి దర్శనానికి వెళ్తూ ఉంటే వైకుంఠానికి ప్రయాణం చేస్తున్నామా అన్నట్లు ఉంటుంది.** తూర్పుద్వారంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే శిల్పాలు భాగవత గాథలు సీతమ్మ తలంబ్రాలు దృశ్యాలు యాత్రికు లను మైమరపిస్తాయి.



ఆలయానికి దక్షిణంగా చెరువు కట్ట కింద రామ తీర్థం నిండుగా జలంతో భక్తుల్ని పరవశింపజేస్తుంది. అక్కడ స్నానం చేసి భక్తులు స్వామి దర్శనం కోసం వస్తుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో చక్రస్నానం ఇక్కడే జరుగు తుంది. చెరువుకట్టమీద ఆంజనేయస్వామి బాటసారుల ప్రమాదాలను నివారిస్తూ ఉంటాడు. ఆలయానికి దక్షిణంగా శృంగి శైలం, పడమటి వైపు పారువేట తిప్ప, జలకళతో చెరువు ఆహా ఒంటిమిట్ట సౌభాగ్యం అనిపిస్తుంది. సంక్రాంతి కనుమనాడు శ్రీరామచంద్రుడు ధనుర్బాణాలు ధరించి పారువేటకు వెళ్తాడు. ఈ ఉత్సవం కన్నుల పండువుగా ఉంటుంది.

ఆలయంలో నిత్య కైంకర్యాలతో పాటు సంవత్సరం పొడవునా ఇతర ఉత్సవాలు జరుగుతూ ఉంటాయి. బ్రహ్మో త్సవాలు చైత్ర శుద్ధ నవమి నుంచి పది దినాలు సాగుతాయి. నవమినాడు రామజయంతితోపాటు పోతన జయంతి నిర్వహిస్తారు. చతుర్దశినాటి రాత్రి శ్రీరామకల్యాణోత్సవం జరుగుతుంది. మరుసటి దినం రథోత్సవం ఉంటుంది. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొంటారు. ఒంటిమిట్ట ఆలయంలో చైత్రశుద్ధ చతుర్దశి నాటి రాత్రి కల్యాణం జరగడం విశేషం. సీతమ్మ ఉత్తరఫల్గుని నక్షత్రంలో జన్మిం చింది. ఆమె నక్షత్రానికి సీతారాముల వివాహం నిశ్చయమ యింది. ఆ త్రేతాయుగ కాలంనాటి సంప్రదాయం ప్రకారమే ఒంటిమిట్ట గుడిలో విద్యారణ్యస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాటు నిర్ణయించాడు.

## వాసుదాసు సేవ

20వ శతాబ్దం తొలిదశకంలో వావిలికొలను సుబ్బా రావుగారు ఒంటిమిట్ట ఆలయ పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నారు. శ్రీరాముని సేవ కోసం ఒంటిమిట్టకు వచ్చారు. తన ఆస్తిని స్వామికి వ్రాసి ఇచ్చారు. గోచీ ధరించి టెంకాయ

చిప్ప పట్టుకొని యాచన చేశారు. సేకరించిన వేల రూపాయల ధనంతో ఆలయంలో మరమ్మతులు చేయించారు. కొత్త భవనాలు నిర్మించారు. బ్రహ్మోత్సవాలు, నిత్యోత్సవాలు జరిపించారు. సరికొత్త రథం చేయించారు. ఆయన సేవ నిరుపమానమైనది. వారు మహాపండితులు, మహాకవి. అపురూపమైన ధార్మిక గ్రంథాలు, భక్తిగ్రంథాలు పండితులకు పామరులకు అర్థమయ్యే భాషలో రచించారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రచించి దానికి మందరం పేరుతో వ్యాఖ్యానం రచించారు. **వావిలికొలను సుబ్బారావుగారు ప్రజలచేత వాసుదాసు అనిపించుకున్నారు.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయింది. భద్రాచలం రాముడు తెలంగాణలో ఉండిపోయాడు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో రామచంద్రుడు అవసరమయ్యాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వం ఒంటిమిట్ట రామచంద్రునికి పట్టం కట్టారు. 2015 మార్చి ఏప్రిల్ నెలలో జరిగిన బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. తరువాతి సంవత్సరం నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు ఇతర అన్ని కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తూ వస్తున్నది.

## ఒంటిమిట్ట చెరువుకు జలకళ

రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్ట చెరువుకు శాశ్వత ప్రాతిపదిక మీద సోమశిల జలాశయం వెనుకజలాల నుంచి ఎత్తిపోతలపథకం ద్వారా నీటిని తీసుకువచ్చింది. ఎంతో కాలంగా కరువుకాటకాల వల్ల వట్టి పోతున్న చెరువు నేడు జల సమృద్ధితో కళకళలాడుతూ ఉంది.

## ఆలయం సర్వతోముఖంగా అభివృద్ధి

**తిరుమల తిరుపతి దేవస్థానం 100 కోట్ల అభివృద్ధి ప్రణాళికను చేపట్టింది. సీతారామకల్యాణం కోసం కడపకు వెళ్లేదారిలో విశాలమైన ప్రాంగణంలో కల్యాణవేదిక నిర్మిస్తూ ఉంది. అందులో వసతి గృహసముదాయం ఏర్పాటయింది. 2016 నుంచి లక్షమంది భక్తులు తిలకించి తాత్కాలిక ఏర్పాట్లతో కల్యాణం నభూతో అన్నట్లుగా సాగుతున్నది.**

## ఆలయం చుట్టూ అందాలు

ఆలయానికి దక్షిణంగా ఉన్న వంకను పూడ్చివేశారు. నేలను చదును చేశారు. ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ తిరుమాడ వీథులు నిర్మించారు. ఆలయానికి తూర్పుగా పుష్కరిణి తయారైంది. ఆలయంలో అలంకరణ పూజలు వేదపఠనం భక్తులకు ప్రసాదం వంటి పథకాలతో శ్రవణానందం నయనానందం కలిగిస్తున్నారు. సంజీవరాయస్వామి ఆలయాన్ని ఆధునీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణతో ఆలయం రాత్రిపూట మిలమిలలాడుతూ శోభాయమానంగా ఉంటున్నది.

నెల నెలా శ్రవణానక్షత్రం నాడు జరుగుతున్న సీతారామ కల్యాణోత్సవాలలో; ప్రతి శనివారం నాటి అభిషేక ఉత్సవాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రతి శనివారం తిరుమల లడ్డు ప్రసాదం వస్తున్నది.

## ఓబుల దాసు మంటపం

ఒంటిమిట్టకు తూర్పుగా మలకాటిపల్లి ఉంది. ఈ గ్రామంలో భవనాసి ఓబన్న అనే వైష్ణవ దాసరి ఉండేవారు. ప్రతిదినం ఉదయం ఏకనాదంతో వచ్చి స్వామి ఆలయానికి ఎదురుగా నిల్చుని రామనామగానం చేసేవారు. ఒకమారు సిద్ధవటం రెవెన్యూ అధికారి తన మందీమార్బలంతో ఆలయదర్శనానికి వచ్చాడు. ఆ సమయంలో అధికారికి అడ్డంగా ఉన్నాడని, అంటరాని వాడని దూరంగా ఆయన మనుషులు నెట్టివేశారు. ఆ రాత్రి రెవెన్యూ అధికారికి కలలో స్వామి కనిపించి మందలించాడు. మరుసటి దినం అధికారి ఓబులదాసు దగ్గరకు వచ్చారు. ఆయనకు నమస్కరించి తాను చేసిన తప్పిదాన్ని మన్నించమని వేడుకున్నాడు. ఆయన గానం చేసుకునేందుకు అక్కడ మంటపం నిర్మించాడు. బ్రహ్మోత్సవాలలో గరుడోత్సవంనాడు స్వామిసోపానాలమీద ఉండగా ఓబులదాసు కర్పూరహారతి ఇచ్చేవారు. ఇప్పటికీ బ్రహ్మోత్సవాలలో కర్పూరహారతి ఆయన కుటుంబీకులు ఇస్తున్నారు.

సజ్జనులు, తమ సంపదలను ఇతరులకోసమే వినియోగిస్తారు!

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

36

- డా॥ కంపల్లె రవిచంద్రన్



**( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తాम्बినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)**

అందువల్ల భగవానుడు తన మేనిని చిన్నదిగా చేసికొని తనను కట్టడానికి అవకాశాన్ని ఇచ్చాడు. **"కణ్ణియార్ కుఱుమ్ కయిఱ్రిల్ కట్ట వెట్టెన్ఱిరు న్దాన్"** (పెరియతిరు-5-9-7) (ముడులు కల్గిన, కుఱుచగా ఉండే దారంతో బంధించగా ఊరకున్నాడు) అని, **"కణ్ణి క్కుఱుమ్ కయిఱ్రిల్ కట్టుణ్డాన్"** (ముడులు కల, కుఱచగా ఉండే దారంతో బంధింపబడ్డాడు) (పెరియతిరు-11-5-5) అని, మిగిలిన ఆళ్వార్లు కూడా అభినివేశాన్ని ఈ లీలలోనే కదా పొందారు. **"దామ్నా చైవోదరే బధ్వా ప్రత్యబధ్నాదు లూఖలే, యది శక్నోషి గచ్ఛ త్వ మతిచంచలచేష్టిత!, ఇత్యుక్త్వాథ నిజం కర్మ సా చకార కుటుంబినీ"** (విష్ణు-పు-5-6-15, 16).

యశోద ఒకదారాన్ని తీసికొని ఒకకొనను శ్రీకృష్ణుని నడుమునకు, ఇంకొక కొసను రోటికి కట్టింది. ఈవిధంగా బంధించి, "అల్లరిపనులను చేసేవాడా ! నీకు సాధ్యమైతే ఇక్కడ నుండి వెళ్లిచూడు"- అని అంటూ పల్కి, తరువాత గృహిణి అయిన ఆమె తన ఇంటి పనులను చేసికొన్నది- అనే రీతిలో తల్లి కట్టినకట్టును విప్పుకోవడం తనకు సాధ్యం కాదు- అని ఉండడం గొప్పతనంగా తలచినవాడు కదా, ఇతడు.

**"ప్రధానక్షేత్రజ్ఞపతి ర్గుణేశః, సంసారమోక్షస్థితి బంధ హేతుః"** (శ్వేతాశ్వతర-6-16) ప్రకృతికి, జీవునకు స్వామియై, గుణాలు నిండినవాడై, సంసారం తొలగిపోవడానికి, స్థితికి, బంధానికి కారణమై ఉండేవాడు-పరమాత్మయే-అనే రీతిలో జీవులను సంసారబంధంలో బంధించడానికి, దానినుండి వారిని విడిపించడానికి భగవానుదేకదా కారణం. అటువంటివాడు ఇపుడు ఒక మహిళ (యశోద) కట్టిన కట్టును విప్పుకోవడానికి చేతగానివాడై ఉన్నాడు.

లోకాలను పాలించే చక్రవర్తి తన భార్య (మహిషి) చేతిలో చిక్కుకుని, అతిసుకుమారమైన పూమాలతో ఆమెచే బంధింపబడి, దానినుండి విడిపించుకోలేకుండా ఉండే స్థితివంటిదే కదా- తల్లి అయిన ఈమె కట్టిన బంధం నుండి విడివడలేక, ఇతడు ఉండే సన్నివేశం. జీవులకు చేసిన కర్మల కారణంగా వారికి వచ్చే సంసారబంధాన్ని ఇతడు తొలగించగలడు తప్ప, (తన) కృపకారణంగా తల్లిచే కట్టిన తాను బంధింపబడేటట్లు చేసికొన్న బంధాన్ని ఇతడు కూడా తొలగించుకోలేడు కదా!

ఈ ప్రబంధం ఆరంభంలో శ్రీమధురకవులు, తాము అభిమానించిన నమ్మాళ్వార్లు **"ఉయర్వఱ ఉయర్నలమ్"** (తిరువాయ్-1-1-1) (అంత కంటే మించింది ఇంకొకటి లేని గొప్ప ఆనందం) అని భగవానుని ఆనందాది గుణాలలో అభినివేశాన్ని పొందినట్లుగా తాముకూడా గుణాలలో అభినివేశాన్ని పొందకుండా, శ్రీకృష్ణుని యశోద బంధించిన దారాన్ని వర్ణించడానికి ఏమి కారణం? *(ఇంకా ఉంది)*



దేశసేవ కన్న దేవతార్చన లేదు

# కైవల్యానికి దారి!

– డా॥ వి. కృష్ణవేణి

అన్నమయ్య ఆధ్యాత్మికసంకీర్తనల్లో మనకు ప్రధానంగా కనిపించే అంశం భక్తి, వైరాగ్య, జ్ఞానమార్గాల ప్రబోధం. అన్నమయ్య అందుకున్న వైరాగ్యం ఇందుకు పునాది. అతని జీవితంలో కలిగిన వైరాగ్యభావనలు ఒక తార్కాణం.

## బాల్యవైరాగ్యం

అన్నమయ్యకు బాల్యంలోనే వైరాగ్యం పుట్టింది. బాలకుడైన అన్నమయ్యను వదిన పశువులకై కసువును తెమ్మంటుంది. చేతికి గాయం చేసుకున్న అన్నమయ్యలో విరక్తిభావన మొలకెత్తుతుంది.

**అయ్యో పోయెం బాయము గాలము**
**ముయ్యంచు మనసున నే మోహమతి నైతి (1-179)**

ఈ కుటుంబవిరక్తిభావనను సుస్థిరం చేయుటకా అన్నట్లు తిరుమలయాత్రకు వెళుతున్న భక్తబృందం కంటపడుతుంది. వారు పారవశ్యంతో పాడుకొనే...

**"వేడుకుందామా వేంకటగిరి వేంకటేశ్వరుని"**– అనే గీతంతో తనూ శ్రుతి కలిపి వారి అడుగులో తన పాదం కలుపుతాడు. అన్నమయ్యలో కలిగిన ఈ బాల్య వైరాగ్యం తెలుగుసాహిత్యజగత్తుకు వేలాది సంకీర్తనలను అందించ డానికి ఒక గొప్ప అంశం.

సంసారి అయిన అన్నమయ్య అందులో మునిగి పోలేదు. 'తామరాకుపై నీటిబొట్టు'లా జీవిస్తూ తన వైరాగ్య భావజాలాన్ని అంతకంతకూ వృద్ధి చేసుకున్నాడు. సంసారిగా అన్నమయ్య చూపిన సంసారవిరక్తి యౌవనదశలోనిది. ఈ యౌవనవిరక్తి వైరాగ్యపదసృజనకు మార్గం పటిష్ఠం చేసింది.

## యౌవన వైరాగ్యం

యౌవనదశలో సాళువనరసింహరాయల అధికార దర్పంవల్ల వైరాగ్యం ఎక్కువవుతుంది అన్నమయ్యలో.

ఉరకలు వేసే యౌవనంలోని వైరాగ్యభావనలు మోక్షానికి దగ్గరదారులు.

అన్నమయ్య సంసారవిరక్తిని ఈ విధంగా చూపారు.

**సడిబెట్టె గటకటా – సంసారము చూడ**
**జలధి లోల యాత – సంసారము**

సంసారాన్ని సాగరంతో పోల్చడం లోకోక్తి. ఆ భావన చెబుతూనే అనేక ఉపమానాలను ఉపయోగించి, అందులోని నిస్సారతను తెలియజేశాడు అన్నమయ్య. సంసారం చంద్రునిజీవనం లాంటి దన్నాడు. అంటే శుక్లపక్ష, కృష్ణపక్షాల చంద్రకళలు. సంసారం యముడినోటిలో బ్రతుకన్నాడు.

**అప్పులేని సంసారమైన పాటే చాలు**
**తప్పులేని జీతమొక్క తీరమైనజాలు (1-114)**

అప్పులేని సంసారముండదంటారు. కానీ, ఉన్నంతలో సర్దుకుని బ్రతికే జీవనమే మేలంటున్నాడు. రంధ్రాలు లేని గుడిసె గంపంతదయినా చాలంటున్నాడు. గంప అంటేనే రంధ్రాల భరితం. ఇక్కడ చిన్నగూడు చాలనే అర్థంలో తీసుకోవచ్చు.

## నడివయస్సువైరాగ్యం

నడివయస్సులోని వైరాగ్యం పంచేంద్రియాలపై, మనస్సుపై అదిచేసేమాయ గురించిన అవగాహన కలిగి స్తుంది. అందుకే జీవుడు నడివయస్సు వచ్చే నాటికి నాలుగు పురుషార్థాలను, యాభై నిండే సరికి అయిదు పంచేంద్రి యాలపై పట్టు సాధించాలి.

జీవుణ్ణి ఆడించడంలో పంచేంద్రియాలు బలమైనవి. వీటి గురించి అన్నమయ్య ఈ కీర్తనలో వివరించారు.

**వెలుపల వెదకితే వెస నాత్మ గనునా**
**పలుమారు నిదే యభ్యాసము గావలెను**
**యిన్నిచింతలు మఱచి యింద్రియాల గుదియించి**
**(2-198)**

పంచేంద్రియాలపై పట్టుసాధించినా కర్మేంద్రి యాలలోని మనస్సు ప్రధానమైంది. మనసు చేసే మోసానికి లొంగినవాడి జీవితం పతనం ఖాయం. మనస్సుంటే

ఆలోచనల సమాహారం. వెల్లువలావచ్చిపడే ఆలోచనలను నివారించకపోతే మనిషి నిలువునా మునిగిపోవాల్సిందే. మనస్సు గురించి అన్నమయ్యచెప్పిన మర్మాలు కొన్ని సంకీర్తనల్లో కనిపిస్తాయి.

**మనసు నమ్మి నేర్పితే మనుజుడే దేవుడౌను**
**తనలోనే వున్నవాడు తావుకాని దైవము (2-352)**

మనసును లాలించి నేర్పితే అదే భగవంతుణ్ణి చూపుతుంది. నీలోనే భగవంతున్నాడని, సకలజీవులలోని దైవత్వాన్ని దర్శింపచేస్తుంది.

**తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత**
**మానవుల లంపటాలు - మరి చెప్పగలదా?**

చీమ, ఈగ, గిజిగాండ్లు వంటి చిన్నజీవులు తమ సంసారబ్రతుకుకు ప్రాకులాడి లంపటాలు తెచ్చిపెట్టు కుంటాయి. వాటిని చూసి మనం నవ్వుకుంటాం. మరి మనల్ని చూసి ఆ భగవంతుడు నవ్వడా? - అంటూ సందేహాన్ని వెలిబుచ్చారు అన్నమయ్య.

ఈ వైరాగ్య భావనలన్నీ వార్ధక్యదశలో తారా స్థాయికి చేరుకుంటాయి. దేహం అనిత్యమనే వాస్తవం గ్రహిస్తుంది మనసు. ఈ దశను వార్ధక్య వైరాగ్యంగా భావించవచ్చు.

## వార్ధక్య వైరాగ్యం

వైరాగ్యభావనలు ఎక్కువగా వార్ధక్యదశలోనే చాలా మందిలో అగుపిస్తాయి. తోలుతిత్తిలాంటి శరీరాన్ని ఈసడించుకుంటారు. ఛీ...ఛీ... మానవజన్మం అంటూ అసహ్యించుకున్నారు అన్నమయ్య.

**ఇంకనైనా రోయరాదా - యీపాటి వారమింతే**
**మంకుదనమేల మా - మాట వినరాదా!(3-334)**

దేహం ఈవిధంగా అడుగుతోందంట...

ఓ సంసారులారా? ఇకనైనా మీరు మాపై రోతపడి మమ్ము విడిచి పోరాదా? మా బ్రదుకే ఎంతో హీనమైనది- మమ్ము పట్టుకొని వ్రేలాడిన మీకు ఏమి లాభం? ఎందు కింత మొండితనము? మా మాట వినకూడదా? తొమ్మిది రంధ్రాలు గల తోలుబొంతను కట్టుకున్న దొరను నేను... అంటుంది శరీరం.

పంచభూతాలు, ఇంద్రియాలు, ఆశ...వంటి అంశా లన్నీ ఈ కీర్తనలో పొందుపరచబడ్డాయి.

దేహం అశాశ్వతమని తెలిసి, చుట్టూ ఎన్నో జీవులు మరణిస్తున్నా, తాను మాత్రం శాశ్వతమనుకుంటాడు జీవుడు. మహాభారతంలోని యక్షప్రశ్నల్లోని చివరి ప్రశ్న ఈ అంశాన్ని వివరిస్తుంది.

అన్నమయ్య బాల్యం నుండి వార్ధక్యం వరకూ భక్తితో వైరాగ్య భావనలో మునిగి తేలాడు. జ్ఞానాన్ని తన సంకీర్తన లనే సంపదలతో మేళవించి తెలుగువారికి వారసత్వంగా అందించారు.

మంచిచెడుల విచక్షణ తెలియనినాడు అజ్ఞానమనే అంధకారంలో పడిపోతాం. అందుకే భక్తి, కర్మ మార్గాలనే కాక జ్ఞానమార్గాన్ని అందించారు అన్నమయ్య.

**తెలిసితే మోక్షము తెలియకున్న బంధము**
**కలవంటిది బదుకు ఘనునికిని (2-19)**

'తెలిసితే మోక్షము తెలియకున్న బంధము' అనే వాక్యాన్ని అర్థం చేసుకుంటే అదే మోక్షానికి దారి.

**భారమైన వేపమాను పాలుపోసి పెంచినాను**
**తీరను చేదేకాక తీయనుండునా**

'ఏ విత్తనం నాటితే అదే వృక్షం వస్తుందని' మంచి ఆలోచనల గురించి ఆధునిక వ్యక్తిత్వ వికాస నిపుణులు నేటికాలంలో శిక్షణా తరగతుల్లో నేర్పుతున్నారు. ఈ అంశం 15వ శతాబ్దం నాటికే అన్నమయ్య వెల్లడించారు. అందునా శరీరాన్ని వేపమానుతో పోల్చి, పాలుపోసి మరీ జాగ్రత్తగా పెంచినాను, అయినా దాని గుణమయిన చేదుపోలేదంటూ వేదన చెందాడు.

మానవ జీవితానికి మోక్షమే పరమప్రయోజనం. దీనికర్థం జీవాత్మ పరమాత్మను చేరడం. ఇలాంటి భావాలకు సముద్రం వంటిది అన్నమయ్య పదసాహిత్యం.



వెనుకా ముందుల కలయికే వర్తమానం




# సీతాకల్యాణవైభోగమే!

- డా॥ వి.పళని

శ్రీరాముని చరితం అపారమైంది. ఏ కవికూడా ఈ అపారపారావారాన్ని దాటలేదు. సీతారాముల కల్యాణగాథను ఎవరు వర్ణించగలరు?

శివధనుర్భంగమవగానే జనకమహారాజు విశ్వామిత్రమహర్షితో ఈ శుభ వార్త వెంటనే దశరథమహారాజుకు తెలుపమని వేడాడు. వారందరూ తరలి వస్తే సీతాకల్యాణాన్ని వేడుకగా జరిపించాల్సి ఉందని మనవిచేశాడు.

దూతలను పిలిపించి శుభలేఖ రాసి, వారిని అయోధ్యానగరానికి వెళ్లమని జనకమహారాజు ఆదేశించాడు. వారు వెంటనే వెళ్లారు.

సీతాదేవి వివాహం అత్యంతవైభవంగా జరపడానికి సన్నాహాలు చేయసాగారు. బ్రహ్మదేవుణ్ణి పిలిపించారు. అరటి స్థంభం నాటించి పెండ్లిపనులు ప్రారంభించారు. పెండ్లిపందిరంతటా మణులు, మాణిక్యాలు పొదిగారు. అందమైన మంటపంలో సీతాదేవి పెండ్లికూతురు, శ్రీరాముడు పెండ్లి కొడుకు! ఆ శోభ ముల్లోకాలలోనూ ప్రసిద్ధిగాంచిందై ఉండాలిమరి. రాజసౌధమెంత అందంగా ఉందో, ఆ నగరంలోని ప్రతి ఇల్లు అంతే అందంగా ఉంది. ఆ నాటి జనకపురి అందం పధ్నాలుగుభువనాలు వెదికినా ఇంకెక్కడా కన్పించదు. ఆశోభ తిలకించిన ఇంద్రాది దేవతలు చకితులౌతున్నారు. సరస్వతీదేవికూడ వర్ణించనలవికాని రీతిగా వెలుగొందుతోంది.

రాజదూతలు ఈ శుభవార్త తీసుకుని అయోధ్యా నగరాన్ని చేరారు. వారు దశరథమహారాజును దర్శించి ప్రణామంచేసి ఈ శుభలేఖను వారి కందించారు. ఆ లేఖ చదువుతున్నపుడు వారి కనులలో వాత్సల్యపూరితమైన కన్నీరు నిండింది. శరీరం పులకించింది. వారి హృదయంలో శ్రీరామలక్ష్మణులు, చేతిలో శుభలేఖ! ఆనాడు విశ్వామిత్రునితో కలసివెళ్లిన తరువాత వారిని గురించిన సమాచారమేమీ రాజుగారి కందలేదు. అందుచేత దశరథమహారాజు తమ పిల్లల క్షేమసమాచారాలు పదేపదే ఆ దూతల నడిగాడు. విశ్వవిభూషణులైన రామలక్ష్మణుల వంటి పుత్రులను కన్న దశరథుని అదృష్టాన్ని రాజదూతలు వేనోళ్ల కీర్తించారు. అక్కడ శివధనుర్భంగానికి వీరులు పడినపాట్లు, అగచాట్లు ఈ విధంగా తెలిపారు– "సీతాదేవి స్వయంవరానికి అనేకమంది యోధులు, రారాజులు హాజరయ్యారు. కానీ, శివుని విల్లు వీసమంత కూడా కదుపలేకపోయారు. మేరుపర్వతాన్నెత్తిన బాణాసురుడు, కైలాసపర్వతాన్నే అనాయాసంగా పైకెత్తిన రావణాసురుడు కూడ పరాజితులై వెళ్లిపోయారు. అటువంటి శక్తి గల శివధనుస్సును శ్రీరాముడు



ఏమాత్రం ప్రయాస లేకుండా తామరతూడువలే త్రుంచి అవతల పారవేశాడు. అప్పుడు పరశురాముడు క్రోధావేశంతో అక్కడకువచ్చి శ్రీరామలక్ష్మణులను ఎన్నో విధాల కవ్వించాడు. చివరకు రాముడు శ్రీమన్నారాయణుడని తెలుసుకుని తనవద్దనున్న విష్ణుచాపం వారికిచ్చి, స్తుతిచేసి వెళ్లాడు.”

ఈ వివరాలు విని దశరథమహారాజు, సభలోని పెద్దలు ఎంతో సంతోషించారు. వశిష్ఠమహర్షికి, రాణివాస రమణులకు ఈ వార్త తెలిపారు. అయోధ్యానగర ప్రజలందరూ ఈ వర్తమానం విని ఎంతో ఆనందించి నగరమంతా అలంకరించారు.

## పెళ్లివారి ప్రయాణం

దశరథమహారాజు భరత, శత్రుఘ్నులను పిలిచి శ్రీరాముని వివాహానికి తరలివెళ్లడానికి సన్నాహాలు చేయమని ఆదేశించాడు. గుర్రాలు, ఏనుగులు, ఏనుగంబారీలు, పల్లకీలు తక్షణమే వారు సిద్ధంచేశారు. రథాలను, జీనులను మణిమాణిక్యాలతో అలంకరించారు. అందమైన చామరాలు, గంటలు కట్టించారు. వశిష్ఠమహర్షి, దశరథమహారాజు ఇద్దరూ బృహస్పతి, ఇంద్రునివలే ప్రక్కప్రక్కన రథాలపై కూర్చున్నారు. గురువు గారి అనుజ్ఞ తీసుకుని మహారాజు శంఖం పూరించాడు. దశరథమహారాజు రథం కదలగానే ఆవెనుక పెండ్లి వారందరి వాహనాలు కదిలాయి.

ప్రయాణం అతి కోలాహలంగా ఉంది. దేవాంగనలు మంగళహారతులు పాడారు. మనోహరమైన రాగాలతో సన్నాయి మోగుతోంది. పరబ్రహ్మ స్వయంగా దశరథ తనయుడై అవతరించినపుడు ఆ పెండ్లిప్రయాణాన్ని ఏమని వర్ణించగలం. సూర్యవంశరాజైన దశరథమహారాజు తన కుమారుని వివాహానికి మిథిలానగరానికి తరలివస్తున్నాడనే వార్త తెలియగానే జనకమహారాజు–మార్గమధ్యంలో ఉన్న సెలయేరులు, వాగులు, నదులన్నింటి మీదా వంతెనలు కట్టించాడు. మధ్యమధ్యన మజిలీలు చేయడానికి విశ్రాంతి భవనాలు, గుడారాలు సమస్తసౌకర్యాలతోను ఏర్పాట్లు చేయించాడు. పెండ్లివారు మిథిలానగరానికి సమీపించగానే జనకమహారాజు బంధుమిత్ర సపరివారసమేతంగా ఎదురేగి వారిని ఆహ్వానించాడు. అపరిమిత సంతోషంతో రెండువైపుల పెండ్లివారు కలుసుకున్నారు. దశరథుడు, జనకుడు వంటి గొప్ప వియ్యంకులు జగత్తులో మరెక్కడా ఉండబోరు.

అందంగా అలంకరించిన విడిదిని ఏర్పాటు చేశారు. పెండ్లివారికందరికీ అమృతతుల్యమైన పక్వాన్నాలు, ఫలహారాలు బంగారుపాత్రలతో అందించారు. సీతాదేవి తల్లి ఎందరో సేవకులను నియమించి పెండ్లివారికి సకల సౌకర్యాలు చేయుమని ఆదేశించింది. అందుచేత అతిథిమర్యాదలకు ఏమాత్రం లోటులేకుండా జరుగుతున్నాయి.

విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులిరువురిని వెంటపెట్టుకుని దశరథమహారాజును కలుసుకున్నారు. రాజు విశ్వామిత్రమహర్షికి దండప్రణామాలుచేసి రామలక్ష్మణుల నిరువురిని హృదయానికి హత్తుకున్నాడు. తండ్రిని చూడగానే వీరికి ప్రాణం లేచివచ్చినట్లైంది. గురువుగారికి, బ్రాహ్మణులకు నమస్కరించి వారి ఆశీస్సులు పొంది భరత శత్రుఘ్నులను కలుసుకున్నారు. ఆ తరువాత అయోధ్యానగరవాసుల నందరనీ కలుసుకున్నారు. రాముణ్ణి చూడగానే అయోధ్యావాసుల మనస్సులలో వేయిపున్నములు విరిసినట్లైంది.

సీతారాములకల్యాణానికి ముహూర్తం నిశ్చయమైంది. శంఖాలు, నగారాలు అన్నీ మ్రోగాయి. పెరుగు, అక్షతలు, పసుపుకుంకుమ మొదలైన శుభద్రవ్యాలు ఎదురుగా ఆడపెళ్లివారు పట్టుకుని వచ్చారు. సువాసినీస్త్రీలు మంగళహారతులు పాడారు.

## కల్యాణకింకిణులు

బ్రహ్మాది దేవతలు సీతారాముల కల్యాణవైభవం చూడడానికి విమానాలలో ఆకాశవీథులలో తిరుగసాగారు. వివాహవేదిక యొక్క అలౌకిక నిర్మాణం చూచి వారు దిగ్భ్రాంతులయ్యారు. అఖిలబ్రహ్మాండానికి నాయకుడైన శ్రీమన్నారాయణుని వివాహవైభవం సకల లోకాలకూ ఆనందదాయకమైందే గదా! శ్రీరఘుకులంలో పుట్టిన

భగవంతునకు దేవతలందరూ జయం పలికారు. పువ్వులు చల్లారు. శచీదేవి, లక్ష్మీసరస్వతులు మనుష్యరూపాలు ధరించి రాణివాసస్త్రీలందరితోనూ కలిసిపోయారు. కోకిల స్వనంతో మంగళహారతులు పాడారు. ఆ కోలాహలంలో ఎవరు ఎవరినీ గుర్తుపట్టే స్థితిలో లేరు. శ్రీరాముణ్ణి చూచి దేవతలు, నరులు సర్వస్వం మరచిపోయారు.

దశవిధనాదాలు, పంచనాదాలతో... మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. ఆకాశంలో జయజయధ్వానాలు! మహారాణి శ్రీరామునకు అర్ఘ్యపాద్యాలిచ్చి ఎఱ్ఱనీళ్ల దిగదుడిచి దిష్టితీసింది. శ్రీరాముడు వివాహవేదిక మీదకు రాగానే దేవతలు పువ్వులు చల్లారు. పెండ్లిపీట మీద కూర్చు న్నాడు. జనకమహారాజు స్వయంగా ఆసనాలు తెచ్చి మును లను, పెద్దల్ని సుఖాసీనులను గావించాడు. బ్రహ్మమహే శ్వరులు, దిక్పాలకులు, సూర్యచంద్రులు మొదలైన వారంతా మనుష్యరూపాలు ధరించి వచ్చి కూర్చున్నారు. వారెవరో శ్రీరాముడొక్కనికే తెలుసు. జనకమహారాజుగారికి వారెవరో తెలీకపోయినా దేవతాసమానులుగా భావించి ఉన్నతా సనాలమీద కూర్చోబెట్టాడు.

సమయం చూసి వశిష్ఠమహర్షి శతానందునితో సీతాదేవిని తీసుకుని రమ్మని కబురు పంపించాడు. మహర్షి ఆదేశానుసారం సీతాదేవిని తల్లి, మరికొందరు ముత్తైదువలు వెంటబెట్టుకుని వచ్చారు. దేవాంగనలు కూడా వీరితో పాటు ఉన్నారు.

సీతాదేవి అందం వర్ణింపశక్యం కానిది. మాటలు చాలవు. రూపజిత సౌందర్యరాశి, లావణ్యవారాశియైన సీతా దేవి వేదిక దగ్గరకు రాగానే అందరూ మనస్సులో నమ స్కరించారు. వేదోక్తప్రకారం గౌరీపూజ, విఘ్నేశ్వరపూజ బ్రాహ్మణపూజ వధూవరులచేత చేయించారు. దేవతలు ప్రత్యక్షమై వీరి పూజలనందుకున్నారు. హోమంచేసే సమయంలో స్వయంగా అగ్నిహోత్రుడు ఆహుతుల నందు కున్నాడు. నాలుగువేదాలు బ్రాహ్మణరూపంలో వివాహవిధు లను తెలిపాయి. సూర్యుడు స్వయంగా తమ కులాచారాన్ని విన్నవించాడు.

ఈ విధంగా దేవతాపూజలైన తరువాత సీతాదేవిని శ్రీరాముని చెంత కూర్చోబెట్టారు. సీతారాములకు ఒకరి ఎడల ఒకరికి గల ప్రేమ అపురూపమైంది. భావానికి భాషకు అతీతమైంది. అలాంటి అలౌకికప్రేమను వర్ణించడం సాధ్యం కాదు.

## ముత్యాల తలంబ్రాలు

భార్యాసమేతుడై జనకమహారాజు శ్రీరాముని పాదాలు కడిగాడు. ఏ చరణకమలాలు స్మరించినంత మాత్రానే సమస్తభవబంధాలు తొలగిపోతాయో, మనోవాంఛలు సిద్ధిస్తాయో, ఏచరణకమలరజం సోకగానే అహల్యాదేవి శాపవిముక్తురాలైందో, అలాంటి శ్రీరాముని చరణకమలాలు పట్టుకుని జనకమహారాజు కడిగాడు.

వధూవరుల అరచేతులు రెండూ కలిపి పురోహి తులు మంత్రాలు చదివారు. పాణిగ్రహణ మనగానే



బ్రహ్మాది దేవతలు సంతసించి పువ్వులవాన కురిపించారు. ముత్యాల తలంబ్రాలు సీతారాములు పోసుకునేటప్పుడు ఆ అలౌకికశోభనెట్లు వర్ణించాలి?

నవరాగమణులు వారితలపై నుండి రాలేటప్పుడు మెరిసే తళుకుల నూహించుకోవచ్చునేమో! అక్షరాలలో చెప్పలేం! నవవికసితకమలాల వంటి దోసిళ్లతో ముత్యాల తలంబ్రాలు ముచ్చటగ పోసుకున్నారు. వేదోక్తప్రకారం జనకమహారాజు సీతను రాముని కర్పించాడు. కన్యాదానం చేశారు. ఆ వధూవరులను చూచి పద్నాలుగుభువనాలు ఆనందంతో వెల్లివిరిశాయి.

ఆ తరువాత వశిష్ఠుని ఆదేశం ప్రకారం మాండవి, ఊర్మిళ, శ్రుతకీర్తి, అనే ముగ్గురు రాజ కుమార్తెలను భరత లక్ష్మణ శత్రుఘ్నుల కిచ్చి యథావిధిగా వివాహాలు జరిపించారు.

పెద్ద ముత్తైదువలు పెండ్లికుమారులను పెండ్లి కుమార్తెలనూ కులదేవతారాధన కోసం తీసుకుని వెళ్లారు. పార్వతీదేవి ప్రేమపూర్వకంగా వధూవరుల చేతులు కలిపి ఆశీర్వదించింది. నవవధూవరులు దీర్ఘాయుష్మంతులు కావాలని దేవతలు, యోగులు, సిద్ధులు దీవించారు. వివాహవేడుకలు ఎంతచెప్పినా తీరవు.

జనకమహారాజు పెండ్లివారి అడుగులకు మడుగులు వత్తుతూ విందుభోజనాలకు తీసుకుని వెళ్లాడు. ఆవునేతితో తయారుచేయబడ్డ పిండివంటలు, షడ్రసోపేతమైన విందు, వియ్యాలవారి వరసపాటలు, బూజంబంతి పాటలు వింటూ, నవ్వుకుంటూ అందరూ విందులారగించారు. ఆ తరువాత కర్పూరవీడెము లందుకుని తిరిగి విడిదికి చేరుకోసాగారు.

> **సీతా కల్యాణ వైభోగమే**
> **పవనజ స్తుతిపాత్ర పావనచరిత్ర**
> **రవిసోమ వరనేత్ర, రమణీయగాత్ర**
> **సీతాకల్యాణ వైభోగమే...**

ఈ విధంగా చాలారోజులు గడిచాయి. జనకమహారాజు సౌజన్యాన్ని, ఐశ్వర్యాన్నీ ఎన్నోవిధాల కొనియాడి దశరథమహారాజు తిరిగి అయోధ్యకు వెళ్లవలెననే అభిలాషను సూచించాడు. ప్రతిదినమూ వేయివిధాల మర్యాదలు జరుపుతున్న జనకుడు వీరు అప్పుడే తిరిగి వెళ్లడానికి ఒప్పుకోలేదు.

ఎట్లో బలవంతంగా చివరకు దశరథ మహారాజు బయలుదేరాడు. నలుగురు రాజకుమారులు అత్తగార్లవద్ద శెలవు తీసుకోవడానికి వచ్చారు. వారి నలుగురికి తలంటి స్నానం చేయించి ఆప్యాయంగా భోజనం వడ్డించారు. అయోధ్యకు తిరిగి వెళ్లడానికి అనుమతీయాల్సిందిగా శ్రీరాముడు మహారాణిని కోరాడు. సీతాదేవిని శ్రీరామునకు వప్పచెప్పుతూ తల్లి కళ్లనీళ్లు పెట్టుకుంది. మైథిలి పురజను లందరికీ ప్రాణంకంటే ఎక్కువ. ఆమె వీడ్కోలు సన్నివేశాన్ని ఎవ్వరూ భరించలేరు. రామచిలుకలు, గోరువంకలు పశుపక్ష్యాదులన్నీ సీతాదేవి కోసం విలపించసాగాయి. ఇక మనుష్యులస్థితి చెప్పనలవిగాదు.

వధువులు నలుగురినీ భర్తలకు ఒప్పచెప్పేటపుడు జనకమహారాజుకు కన్నీరు ఆగలేదు. ఎంతటి విరాగులైనా, జ్ఞానులైనా అమ్మాయిని అత్తవారింటికి పంపేటప్పుడు హృదయం ద్రవించకమానదు. అలా కరిగిపోవడం మానవ సహజం! జనకమహారాజు స్థితి దీనికి నిదర్శనం!

అందమైన పల్లకీలలో పెండ్లికుమార్తెలను కూర్చోబెట్టారు. ఇష్టదేవతలను మనస్సులో ప్రార్థించారు. పెండ్లివారందరూ బయలుదేరగానే దశరథమహారాజు శంఖం పూరించాడు. దేవతలు పువ్వులుచల్లారు. అప్సరసలు మంగళహారతులు పాడారు. అందరూ ముందుకు సాగారు.

తమను సాగనంపడానికి వచ్చిన జనకుణ్ణి, దశరథుడు ఎంతగానో ఓదార్చి తిరిగి వెనుకకు వెళ్లమని వేడుకున్నాడు. జనకుని నేత్రాలు ప్రేమాశ్రువులతో నిండిపోయాయి. పెండ్లివారు ముందుకు సాగారు. సాగనంపడానికి వెళ్లిన జనకమహారాజు, వారి సోదరులు వెనుకకు తిరిగి వచ్చారు.




# మమ్ము గడియించుకున్నట్టి శ్రీవేంకటేశుడా!

- డా॥ కలువగుంట రామమూర్తి

భగవంతుడు భక్తుల్ని వాళ్ల క్షేమంకోరే ఆడిస్తాడు. ఓడిస్తాడు. లాలిస్తాడు. పాలిస్తాడు. కాఠిన్యం ప్రదర్శిస్తాడు. కారుణ్యం కురిపిస్తాడు. హృదయంలో భక్తి ఉన్నవాళ్లు. ఆయనను నమ్ముకుంటే జీవితం నమ్ముకానీయడు, మనం ఆయనసొమ్ము!

మాది చిత్తూరుజిల్లా, సాతంబాకం అనే కుగ్రామం. అమాయకులైన తల్లిదండ్రుల అజ్ఞానం– మన రాష్ట్రంలో ఏ పిల్లవాడు 5వ తరగతిని రెండు సంవత్సరాలు చదువడు. తరగతిలో సంఖ్య తగ్గిపోతుందని ప్రధానోపాధ్యాయుడు నాలాంటి పిల్లల్ని ఉన్నతపాఠశాలకు పంపకుండా ఆపేశాడు. ఇంటి దగ్గర నేను ఏడ్చినా లాభం లేకపోయింది. సరే! అష్టకష్టాలుపడుతూ శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగులోనే చేరాను. ఆ సంవత్సరమే ఓరుగంటి పార్వతీదేవి నా సహాధ్యాయిగా నాతో పాటు చేరారు. సాహిత్యాభిమాని అయిన ఆమె ఎం.ఎ. తెలుగుకు అప్లై చేసుకుని నా క్లాస్‌మేట్ అయింది. తర్వాత నా జీవితభాగస్వామినిగా మారింది. నేను ఐదవ తరగతి పాస్ అయి ఉంటే, ఆమె పరిచయం ఫెయిల్ అయి ఉండేది.

నేను చిన్నప్పటి నుండే పాఠ్యపుస్తకాల మీద, ఎస్.వి.హెచ్. (శ్రీవేంకటేశ్వరాస్ హెల్ప్) అని రాసుకుంటూ పరీక్షపత్రాలమీద కూడా అలా రాసి, చీవాట్లు తిన్నవాణ్ణి. ప్రాథమికపాఠశాలలో ఆస్వామి నన్ను ఓడించారు. విశ్వవిద్యాలయంలో ధర్మపత్నిని ఇచ్చి కరుణించాడు.

ప్రేమవివాహం. జీవితపోరాటం. అదో పెద్దగాథ. ఒకరోజు నేను నిరుత్సాహంగా మా తెలుగుశాఖ వద్దకు నడచి వస్తున్నాను. నాకు ఆచార్య సర్వోత్తమరావుగారు ఎదురుపడి, ఆంధ్రప్రభసంపాదకులు విద్వాన్ విశ్వంగారు తి.తి.దేవస్థానాలకు ప్రధానసంపాదకులుగా వచ్చారు. వారి దగ్గర నువ్వు పనిచేస్తావా? అని అడిగారు. “నాకిది అపూర్వ అవకాశం. దయచేసి ఇప్పించండి” అన్నాను. మరుసటి రోజు విశ్వంగారి దగ్గర అసిస్టెంట్ టు చీఫ్ఎడిటర్‌గా ప్రచురణల విభాగంలో చేరిపోయాను. తిరుమల తిరుపతి దేవస్థానంలో అప్రయత్నంగా దరఖాస్తు పెట్టుకోకుండానే, నేను చేరగలిగాను. ఆయన కరుణ అంతటితో ఆగలేదు. సునాయాసంగా నా శ్రీమతి కూడా స్వామివారి ఆస్థానం (తి.తి.దే.)లో చేరిపోయింది. ఇలా మాకు శ్రీవేంకటేశ్వరుడు తన విశ్వవిద్యాలయంలో డాక్టరేట్లను, జీవితభాగస్వామినిని, తన ఆస్థానంలో ఉద్యోగాల్ని ఇప్పించి ఆశీర్వదించారు. ఆయన పాదాల చెంత పిల్లాపాపలతో క్షేమంగా ఉన్నాం. అన్నమయ్య అన్నట్లు ఆయన మనందరిని బిడ్డల్లా గడియించుకున్నాడు.

“దైవం మానుషరూపేణ”–భగవంతుడు మనుష్యుల రూపంలో సలహాలిస్తాడు, సహాయపడుతాడు. సరసన చేర్చుకుంటాడు. అలాంటివాళ్లు ప్రాతస్మరణీయులు. విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, మా సహోద్యోగి. ఆయన ద్వారా నాకు విష్ణుసహస్రనామాన్ని స్వామివారే నాకు పరిచయం చేశారు. ఆ తర్వాత లలితాసహస్రనామాన్ని కూడా నేర్చుకుని భావసంపదను పెంచుకుని అగ్ని గర్భ, శిలాయజ్ఞం, ఆరణ్యకం, వంటి ఆర్షధర్మప్రతిపాదిత నవలలు రాసి ‘భావుకబ్రహ్మ’ బిరుదంతో ఆధ్యాత్మికరచనలు చేస్తున్నాను. చేతివరకు వచ్చిన పెద్దపెద్ద ఉద్యోగాల్ని చేజార్చాడు. నన్ను ఆయన పాదాల చెంత ఉజ్జీవింపజేస్తున్నాడు.



# ఈ... ఒక్క పత్రిక చాలు!

– గురుసహస్రావధాని డా॥ కడిమిళ్ళ వరప్రసాద్

**సప్తగిరులు అంటే ఏడుకొండలు.**

**సప్తమ గిరి అంటే ఏడవ కొండ.**

**మఱి సప్తగిరి అంటే?**

**సప్తానాం గిరీణాం సమాహారః సప్తగిరి అని ఏడుకొండల సముదాయం అనే అర్థంలో సప్తగిరి అనే రూపం ఏర్పడుతుంది. 'ఇగ్లొరాయుగంతంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు' అన్న బాలవ్యాకరణ సూత్రంద్వారా తెలుగులో కూడ అది సప్తగిరి అనే ఉంటుంది.**

**ఈ పత్రికకు సప్తగిరి అని పేరు పెట్టారంటే ఏడుకొండల పేరు పెట్టినట్లా? కొండకు ప్రత్యేకత ఏముంటుంది. సప్తగిరి అంటే సప్తగిరులకు అధినాథుడైన వేంకటేశ్వరుని పేరు పెట్టినట్లే. భద్రాద్రికి నమస్కారం అంటే భద్రాచలవాసుడైన శ్రీరామునికే ఆ నమస్కారం చెందినట్లు, వారణాశికి నమస్కారమంటే విశ్వేశ్వరునికే చెందినట్లు, సప్తగిరికి నమస్కారమంటే వేంకటేశ్వరస్వామికే చెందుతుంది. దీనినే అలంకార శాస్త్రంలో లక్షణ అంటారు. ఈ పత్రిక పేరుగాని, దూరదర్శన్ ఆంధ్రప్రదేశ్ ఛానల్‌పేరుగాని 'సప్తగిరి' అనడం వేంకటేశ్వరుని నామధేయమే కాని కేవలం పర్వతనామం కాదు.**

ఇంతకూ స్వామి ఏడుకొండలపైనే ఎందుకున్నాడు? ఈ సప్త సంఖ్యకు సృష్టికి అవినాభావసంబంధం ఉంది. ఈ సృష్టి ప్రారంభమైందే ఏడు పదార్థాలతో. ద్రవ్యం, గుణం, కర్మ, సామాన్యం, విశేషం, సమవాయం(నిత్యసంబంధం) అభావం అనే ఏడు పదార్థాలు. గమ్మత్తు ఏమిటంటే అందులో పేర్కొన్నవి ఆరే పదార్థాలు. ఏడవది అభావం. అంటే ఈ ఆరు లేకపోవడం. ఏదీ లేకపోవడంకూడా ఒక పదార్థమే అన్నారు. అదేమిటంటే, లేకపోవడం అనేది చిన్నవిషయం కాదు. అది నాలుగురకాలుగా ఉంటుందన్నారు. లేకపోవడం నాలుగు రకాలేమిటండీ అంటే ప్రాగభావం, ప్రధ్వంసాభావం, అన్యోన్యాభావం, అత్యంతాభావం అని నాలుగు రకాలుగా వర్గీకరించారు. ఇప్పుడుండి ఇంతకు ముందు లేకపోవడం ప్రాగభావం. ముందు ఉండి ఇప్పుడు లేకపోవడం ప్రధ్వంసాభావం, ఒకదానియందు మఱొక ధర్మం లేకపోవడం అన్యోన్యాభావం, గగన కుసుమంలాగ ఎప్పుడూ లేకపోవడం అత్యంతాభావం. ఇలా లేకపోవడానికి కూడ పదార్థత్వాన్ని కల్పించిన ఘనత మన భారతీయ శాస్త్రవేత్తలది. అంతేనా పంచమహాభూతాలంటారు. అందులో నేల, నీరు, నిప్పు, గాలి ఈనాలుగూ ఇంద్రియ గోచరాలవుతున్నాయి. అయిదవది ఆకాశం. ఆకాశమంటే ఆకాశం గగనం శూన్యం అన్నారు. ఆకాశమంటే శూన్యం. ఈ నాలుగూ లేని శూన్యమే ఆకాశమంటే. అలా ఏదీ లేకపోవడంలోకూడ మహాభూతాన్ని దర్శించింది భారతీయ శాస్త్రం. ఒకటినుండి తొమ్మిది వరకు అంకెలను సృష్టించి, ఈ తొమ్మిదింటిలో ఏ ఒక్క సంఖ్య లేకపోతే దానికి సున్న (శూన్యము) అని చెప్పినదికూడ భారతీయ గణిత శాస్త్రమే. శూన్యమునుండి ఏమీ సృష్టించలేమంటారు సైన్సు పండితులు. బహిరింద్రియ గోచరములైన వస్తువులను సృష్టించలేక పోవచ్చుగాని మేధాగోచరమైన వస్తువులు శూన్యమునుండి కూడ పుడుతుంటాయి. భూగోళానికి అక్షాంశరేఖలు ఉంటాయని చెపుతారు. అవి కంటికి కనిపిస్తాయా? ఊహారేఖలే కదా! అంటే మేధాజనితములే కదా! ఇంతకూ మనం సప్త సంఖ్య గురించి మాట్లాడుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోయాం కదూ! మళ్ళీ ప్రకృతాన్ని అనుసరిద్దాం.

సృష్టి ఉన్నదే ఏడు పదార్థాలతో అయినపుడు సృష్టి కర్తకు సప్తసంఖ్యతో అవినాభావ సంబంధం ఉంటుందనేది సత్యదూరమైన విషయంకదా! అది తెలియజేసేందుకే స్వామి ఏడుకొండల పైనున్నాడు. అధోలోకాలు ఏడు, ఊర్ధ్వలోకాలు ఏడు

ఉన్నాయి. భూలోకం ఊర్ధ్వలోకాలలో మొదటిది. సత్య లోకం చివరిది. అంటే మనం ఊర్ధ్వలోకంలోనే ఉన్నాం. అథో లోకాలలో లేము. అంతవరకు మనం అదృష్టవంతు లమే. మనం సత్కర్మలను ఆచరిస్తే ఒక్కొక్క లోకం దాటు కుంటూ ఏడవలోకమైన సత్యలోకం చేరుకోవాలి. దానికి కూడ అతీతులం కాగలిగితే అంటే సప్తసంఖ్యకు అతీతులం కాగలిగితే అది మోక్షమే. ఏడు లోకాల స్థాయిని దాటిపోయి నా దగ్గరకు రండి అని చెప్పడానికి ప్రతీకగా ఏడు కొండలెక్కి తన దగ్గరకు రమ్మంటాడు స్వామి.

ఈ సృష్టికి కాంతిని, చైతన్యాన్ని ఇచ్చే ప్రత్యక్షనారా యణుడు సూర్యభగవానుడు. ఆయన రథానికికూడ ఏడే గుఱ్ఱాలుంటాయి. సప్తాశ్వరథమారూఢమ్ అని సూర్యనారా యణమూర్తిని స్తుతిస్తుంటాంకదా! సృష్టి చైతన్యమంతా సప్త సంఖ్యపైనే ఆధారపడి ఉందని చెప్పడానికే ఆ స్వామి సప్తాశ్వ రథారూఢుడయ్యాడు. వివాహమనేది సృష్టి కొనసాగింపునకు మూలకందము. అందులో నూతన వధూవరులు కలసి సమంత్రకంగా ఏడడుగులు వేస్తారు. అందుకనే వివాహాన్ని సప్తపది అంటారు. సఖ్యం సాప్తపదీనమ్ అంటారు. అంటే ఏడడుగులు కలిసి నడిస్తే స్నేహం ఏర్పడుతుంది అని. అలాగని ఒకటి రెండు మూడు అని లెక్కపెట్టుకుంటూ ఏడు అడుగులు కలిసివేస్తే వారు స్నేహితులైపోతారా? ఏడుపదా ర్థాలతో ముడిపడియున్న సృష్టిధర్మానికి భిన్నం కాని పద్ధతిలో ఇద్దరి నడుమ భావసారూప్యం ఏర్పడితే వారు సన్మిత్రు లౌతారు.

పాపప్రక్షాళనకోసం నదీస్నానం చేస్తున్నపుడు మనం ఏ నదిలో ఉన్నా 'గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేఽస్మిన్ సన్నిధిం కురు' అని ఏడునదులను అక్కడ ఆవాహన చేస్తారు. మానవుడు భౌతిక శరీరాన్ని విడిచినపుడు ఆ శరీరాన్ని ఏడు కట్లు కట్టి తీసికొని వెడతారు. అంటే ఈ జీవి ఎక్కడకూ పోలేదు. సప్తపదార్థా లతో కూడియున్న ఈ సృష్టిలోనే ఏదో ఒక రూపంలో ఉంటాడని చెప్పేందుకే ఆ సంప్రదాయం. పాంచభౌతికమైన మన శరీరంకూడ సప్తధాతువులతో నిండియుంటుంది. వారు తరించడమే కాకుండా లోకాన్ని కూడ తరింపజేసేం దుకు కంకణం కట్టుకొన్న మహర్షులుకూడ ఏడుగురే. వారినే సప్తమహర్షులు అంటాం. కౌరవులు యుద్ధంకోసం 11 అక్షౌహిణుల సైన్యాన్ని సమకూర్చుకొంటే పాండవులు ఏడు అక్షౌహిణుల సైన్యాన్నే సమకూర్చుకోవడంలో ఉన్న రహస్యం సప్తసంఖ్యకు గల ప్రాధాన్యమే. మానవుడు పతనం కాకుండా ఉండాలంటే తన దరికి చేరకూడని వ్యసనాలుకూడ ఏడే. వాటినే సప్త వ్యసనాలంటారు.

నైష్ఠికుడైనవాడాచరించే నిత్యకర్మలుకూడ ఏడు. స్నానం, సంధ్యావందనం, ఔపాసనం, బ్రహ్మయజ్ఞం, వైశ్వ దేవం, దేవతార్చనం, అతిథిపూజ. వాయు వరుణ చంద్ర సూర్య నక్షత్ర అగ్ని జ్యోతిర్మండలములని సప్తమండలములే జీవులు బ్రతికేందుకు ఉపయోగపడుతున్నాయి. మానవుడు కృతార్థుడు కావాలంటే సప్తసంతానాలను పొందాలన్నారు. అవి తటాకం, ధనం, అగ్రహారం, దేవాలయం, వనం, కావ్యము, స్వపుత్రులు. దంపతుల బంధాన్ని ఏడుజన్మల బంధం అంటారు. సంబంధాలు చూస్తున్నపుడు ఏడు తరాల చరిత్ర చూడాలనేవారు. ఛాయాగ్రహాలైన రాహుకేతువులను మినహాయిస్తే ప్రధానగ్రహాలుకూడ ఏడే. అందుకనే వారాలు ఏడుగానే విభజించి ఆ ఏడుగురు పేర్లేపెట్టారు. శ్రీరామ చంద్రుని శక్తిని పరీక్షించేందుకు సుగ్రీవుడుకూడ సప్తతాళ చ్ఛేదనం చేయమన్నాడు. సరస్వతీ స్తన్యరూపం, ఆపాత మధురం అయిన సంగీతం సప్తస్వర నిబద్ధమై ఉంటుంది. బహుశః ఈ సప్తసంఖ్యను అందరికంటె తెలుగువారే ఎక్కువ ప్రేమిస్తారేమో! అందుకే ఏ తెలుగువాడి కథాసాహితీ జీవితమైనా ఏడుచేపలకథతోనే ఆరంభమవుతుంది. అలాగని ఇతరులు ప్రేమించరని కాదు. చివరకు పాశ్చాత్యులుకూడ లక్కీ సెవెన్ అంటూ సప్తసంఖ్యను అదృష్ట సంఖ్యగా భావి స్తారు. కాబట్టి సప్తగిరీశుని అర్చించినా, భగవత్తత్త్వాన్ని మనకు కరతలామలకంగా అందించే సప్తగిరి పత్రికను చది వినా మన జన్మ చరితార్థమవుతుంది. సేవిద్దాం! పఠిద్దాం!! తరిద్దాం!!!



# శృంగార నీరాజనాలు

– శ్రీ టేకుమళ్ళ వెంకటప్పయ్య

అన్నమయ్య శృంగారసంకీర్తనలన్నిటిలోనూ శ్రీవేంకటేశ్వరుడే నాయకుడు, అలమేలుమంగమ్మే నాయిక. ఆయన తనభక్తితత్త్వాన్ని అమ్మనూ–వేంకటపతినీ శృంగార నాయికా–నాయకులుగా చేసి సర్వజనామోదమైన రీతిలో బహుముఖంగా వర్ణించి, తన్మయత్వం పొందిన మహా భక్తుడు. అన్నమయ్య శృంగారకీర్తనలన్నీ.. శ్రీవేంకటేశ్వరునికీ, అలమేలుమంగకూ ఇచ్చిన శృంగారనీరాజనాలుగా ప్రఖ్యాతి పొందాయి. ఈ సంకీర్తనలన్నీ వైష్ణవమధురభక్తి సంప్రదాయవృక్షం కొమ్మలే!

నాయికానాయకుల శృంగారనైవేద్యం ఆరగించే ముందు అన్నమయ్య ఈ శృంగారకీర్తనలకు "తెరతీసేకీర్తన" లాంటి అద్భుతమైనకీర్తన ఒకటి రాశాడు. ఈ కీర్తనలో శృంగారప్రియులకు సందేశమిస్తున్నాడు– అన్నమయ్య.

ప. విరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద
తరితీపను చెఱకున నిత్తఱిఁ బండు పండె నిదివో
(సంపు.28–సంకీ.27)

'శృంగార ప్రియులారా! రసికులారా! రండు రండు!' అంటూ ఎలుగెత్తి స్వాగతిస్తూ, సమాదరిస్తూ చాటి చెప్తున్నాడు అన్నమయ్య. "అయ్యలారా రండు! మీకు విరహం ఏ మాత్రం వద్దు. చెఱకువిలుకాని (మన్మథుని) పంట అద్భుతంగా పండింది ఇక్కడ. వినండి నామాట".

చ. బగివాయఁగ రా దిక దంపతులకు నెక్కడ చూచిన
చిగురుకుఁ జేఁగలు వచ్చెను చిత్తజు రాజ్యమున
తగిలి తగిలి కోవిల కూతలు మొగసాలల కెక్కెను
జగమున విరసపుఁ బవనుఁడు చల్లని వాఁడాయ

ఇక దంపతులకు ఎడబాటు అనేదే ఉండదు, ఒకరికొకరు హత్తుకుని తిరగడమే! ఈ చిత్తజు సామ్రాజ్యంలో చిగురుకుసైతం మంచిబలం వచ్చింది. కోకిలమ్మ కూహూరవాలు తలవాకిటి పంచలలో వినిపిస్తున్నాయి. ఈ పిక నాదములు జవ్వనుల ఎడదలలో ఇంపైన మాధుర్యాన్ని నింపుతున్నాయి అనే అర్థంలో చెప్తున్నాడు – అన్నమయ్య. అప్పటివరకూ వేడిగాలులు వీచిన వాయుదేవుడు మనసు మార్చుకుని, చల్లగాలులతో శృంగార విహారులకు అనుకూల పవనుడయ్యాడు.

చ. పొసఁగంగ నెవ్వరికైనను పొందులె జరపఁగ వలసెను
పసిమొగ్గలు వాడెక్కెను వసంతకాలమున
ముసగస లాడెడు తుమ్మిదల మోతల చలములు చెల్లెను
సుసరము నసె పగరాజును చుట్టము వాఁడాయ

ఇక ఇప్పుడు ప్రేయసీప్రియులకు సమాగమం తప్పదు. ఆ తరుణం ఆసన్నమైంది. పసిమొగ్గలు సైతం ఈ వసంతకాలంలో ఎంత వాడిగా ఉన్నాయో చూచారా! మొగ్గలు వాడిగా ఉన్నందువల్లనే మన్మథుడు ఈ పుష్పాలను అంత సులభంగా ఎక్కుపెట్టగలుగుతున్నాడన్న భావంతో వాడాడు. క్రిక్కిరిసిన తుమ్మెదల గుంపుల మాత్సర్యాలకు కాలం చెల్లింది. ప్రేయసీప్రియులపై పగబూని విరహ తాపాలకు గురిచేసిన చంద్రుడు ఇక ఇప్పుడు మీకు దగ్గరి చుట్టమయ్యాడు. రండు, రండు ఆలస్యం వద్దు.

చ. కలయికలే కలకాలము కాణాచులుగాఁ బరగెను
ఇలలో శ్రీ వేంకటపతి యిచ్చిన సంపదను
యెలమిని పదారువేలకు ఇతఁడే మగడై నిలిచెను
కలగొని మనసనియెడి చెలికాడును దోడాయ

ప్రేయసీప్రియులకు కలయికయే కాణాచిగా ఉండడం గురించి చమత్కరిస్తున్నాడు. మనస్సనే చెలికాడు తోడయ్యాడు. ఇక రసికులకు విరహబాధ ఉండనే ఉండదని ఉద్ఘాటిస్తూ అన్నమయ్య శృంగారసామ్రాజ్యానికి తెరతీసి పిలుస్తున్నాడు. పదహారువేల గోపకాంతలకు వరుడై నిలిచిన శ్రీవేంకటేశ్వరుడు ఈ కలియుగంలో సర్వసంపదలతో నిలిచాడు. సర్వసంపదలను ఇవ్వగలమూర్తి అనే భావంతో చెప్తున్నాడు.



సజ్జనులతో విరోధం మంచిది కాదు

# రామాయణ కల్పవృక్షం- 'వాలి' వ్యక్తిత్వం

- డా॥ వి.సి. వేంకటేశ్వర్లు

**బాల్యదశలోనే కొంతమంది మానసికంగా త్వరగా ఎదుగుతారు. రాగద్వేషాలు కూడా వారిలో విజృంభించి ఉంటాయి. అందుచేత లౌక్యంతో పాటు, ప్రాపంచిక జ్ఞానమూ వారిలో నిశితంగా వికసిస్తుంది. అలాంటివారే 'ఇది నా అభిప్రాయం' అని ధైర్యంగా చెప్పగలిగి ఉంటారు. ఇలా తమ స్వకీయ అభిమతాన్ని నిర్ద్వంద్వంగా అభివ్యక్తీకరించగల్గిన వారినే సమాజం ఒక 'వ్యక్తి'గా గుర్తిస్తుంది. అటువంటి వ్యక్తి ఒక రాజుగా, శాసకుడుగా, గొప్ప యుద్ధవీరుడుగా, విజేతగా జీవితంలో ప్రకాశించినప్పుడు అతని వ్యక్తిత్వం బహుముఖీనంగా రూపు కట్టుతుంది. రామాయణంలో కిష్కింధ నేలిన 'వాలి' అనే వానర రాజు 'ఒకానొక విలక్షణవ్యక్తిత్వముద్ర'ను యౌవన దశారంభంలోనే ప్రదర్శించిన విశిష్టవ్యక్తిగా దృగ్గోచరుడవుతాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, లోకాన్ని బాగా చదివిన లోకతంత్ర ధురంధరుడు వాలి, గొప్ప విజేత!**

* * * * *

'కవిసమ్రాట్' విశ్వనాథసత్యనారాయణ రాసిన శ్రీ రామాయణకల్పవృక్షమనే మహాకావ్యంలో, విశ్వనాథవారు 'వాలి' వ్యక్తిత్వాన్ని రూపుకట్టించిన తీరును, ఆవిష్కరించిన విభిన్నమనోభావాలను, మానవత్వం ప్రతిబింబించే పరమార్ద్ర చిత్తవృత్తిని ప్రస్తుతవ్యాసం పరిశీలిస్తోంది.

గుణదోషాలను రెండింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పుడే ఒక వ్యక్తి యొక్క సంపూర్ణవ్యక్తిత్వం లోకానికి తెలిసివస్తుంది. ఆ దృష్టితో వాలి వ్యక్తిత్వంలోని వెలుగునీడల్ని విశ్వనాథ ఆవిష్కరించిన తీరును తెలుసుకుందాం!

కిష్కింధకాండలోని నూపురఖండం, గజపుష్పీ ఖండాలలోనే వాలి వ్యక్తిత్వం సమగ్రంగా తెలుస్తుంది.

అఖండబలసంపన్నుడైన వాలి ఉదయాన్నే లేచి కొండలనే బంతులుగా చేసి ఆడుకునేవాడు. మహావృక్షాలను పెళ్లగించి విసిరేసేవాడు. ఇవన్నీ ఆయన కపి స్వభావ చేష్టలుగా చెప్పినా, నాలుగుసముద్రాలను ఈది సంధ్యావందనం చేయడం పరమనైష్ఠికత్వానికి ప్రతీక! గోలభుడనే గంధర్వుడితో పదిహేను సంవత్సరాలు పోరాడి విజయం సాధించిన యుధిష్ఠిరత్వం, పదితలల రావణుణ్ణి చంకలో ఇరికించి మూడు సముద్రాల్లో ముంచితేల్చి క్షమాభిక్షతో వదలేయడం- ఆయన యౌవన ప్రాదుర్భావ లీలల్లో కొన్ని!

ఋష్యమూక పర్వతప్రాంతాలలో తిరుగుతున్న రామలక్ష్మణులకు హనుమ వలన సుగ్రీవునితో మైత్రి ఏర్పడింది. అతడు కిష్కింధలోని ప్రధానపాత్రల పరిచయం ఇలా కల్గిస్తాడు- "అన్న వాలిచే నపహృత రాజ్యధరుండు వానరేశ్వడొకండు సుగుణవార్ధి సుగ్రీవుడనువాడు అతనికేను సచివులం దొకండ" అంటూ సుగ్రీవుని అప్పటి దుస్థితికి మూల కారణం 'వాలి' అని స్పష్టీకరిస్తాడు.

వాల్మీకి రామాయణంలో వాలిపరాక్రమాన్ని ముందుగానే రామునికి తెల్పే క్రమంలో సుగ్రీవుడు **దుందుభి కథ, ఏడు సాలవృక్షాల కథ** చెప్పి అంతటిశక్తి రామునికుందో లేదో తెలుసుకునేందుకు చెప్పాడు. విశ్వనాథ ఆ కథలకున్న క్రమాన్ని మార్చాడు.

రాముడు మతంగ ఆశ్రమప్రాంతంలోని మహాస్థి పంజరాన్ని చూచి జుగుప్సతో తన్నగా, ఆ సమయంలో దుందుభికథను సుగ్రీవుడు తెలుపుతూ వాలి శౌర్యపరాక్రమాలు తెలియజేస్తూ **"వాలి లోహశైల పటు శరీరు డాతని బలంబు సచేతన పర్వతాభము"** అంటాడు. తారతో సుఖాల్లో మునిగితేలుతున్నా శత్రువు విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించేతత్త్వం వాలికి లేదు. వీరాలాపాలు, ప్రగల్భాలు దుందుభి ప్రదర్శిస్తే-"మొనగాండ్రం బలె మాటలాడెదర యంభోజాక్షు లాలింపగన్" అని శత్రునిబర్హణ నిష్ఠాగరిష్టుడైన వాలి, దుందుభి మనస్తత్వాన్ని ఈసడించుకుంటాడు. శత్రువును అతిభయానకంగా చంపేతత్త్వం వాలిది.

అందుకే దుందుభిని ఆమడదూరం విసిరివేశాడు. ఆ విసర దమే తన పాలిట శాపమౌతుందని వాలి గ్రహించలేక పోయాడు.

మతంగముని శపింపగా, తన బలగర్వాన్ని ప్రక్కన బెట్టి, తనను క్షమించమని ప్రాథేయపడుతాడు. **"ఈ నా యందెపుడేని మౌనుల కపకారమన్న మాటయు గలదే!"** అని తన వినీతత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఈ శాపపర్యవసానం గానే, సుగ్రీవాదులకు ఋష్యమూకం తలదాచుకోవడానికి వెసులుబాటు కల్పించింది.

* * * * *

వాలి అనవసరంగా ఒకరి ప్రస్తావనకు వెళ్లడు. తనను రెచ్చగొట్టి వైరం తెచ్చుకున్న వారిని చంపకుండా వదలడు. అటువంటిదే వాలి సుగ్రీవుల మధ్య గొడవను సృష్టించిన **మాయావి అనే రాక్షసుడి కథ.** మాయావి, వాలి మధ్యగల స్త్రీ విషయక మాలిన్యాన్ని విశ్వనాథ వారు వాలికి అంటగట్టలేదు. ఈ కథా పర్యవసానమే, సుగ్రీవుని రాజ్యభ్రష్టతకు దారి తీసింది. వాలిచే రమను రాణిగా స్వీకరింపజేసింది. రాముడు వాలికి వేసిన శిక్షలో ఈ అపశ్రుతియే మూలకారణ మైంది. రామసుగ్రీవులిద్దరు రాజ్యాన్ని, భార్యను పోగొట్టుకుని సమానపరిస్థితుల్లో ఉన్నారు. మొదటిసారి సుగ్రీవుడు వాలిని ఎదుర్కొన్నప్పుడు వారిద్దరిమధ్య ఎవరు వాలి? ఎవరు సుగ్రీవుడన్న భ్రాంతిచే రాముడు బాణంవేయలేకపోయాడు. ఆ యుద్ధంలో చావుతప్పి కన్నులొట్టబోయి 'బ్రతుకుజీవుడా!' అని బయటపడ్డాడు.

రెండవసారి యుద్ధానికి సుగ్రీవుడు వెళ్లినప్పుడు రాముడు అడవిలో పూచే ఒక పెద్దపుష్పాన్నికోసిమాలగా కట్టి సుగ్రీవుని మెడలో వేశాడు. దాని పేరు 'గజపుష్పము' అందుకే ఈ కథాఖండానికి గజపుష్పీఖండమని పేరు పెట్టారు విశ్వనాథ.

తార, వాలితో సుగ్రీవుడు ఇంత త్వరగా కోలుకుని రెండవసారి యుద్ధానికి ఆహ్వానించడం వెనుక రాజనీతి ఉందని హెచ్చరించింది. పోవద్దని చెప్పింది.

దానికి వాలి **"తానై రాముడన్యాయమున్ జేయం బోడను నమ్మకంబు"**తో పోతున్నానంటాడు. తార అనుమానం నిజమైంది. రామ బాణం తగిలి గుండెవ్రయ్యలైంది. **"నీవేమిటి? రామా! యీ విమలేతర కార్యమేమిటి రామా!"** అని ఆక్రోశించాడు వాలి. ఇద్దరి మధ్య వాగ్వివాదం



జరిగింది. వాలిలో ఆత్మాన్వేషణ మొదలైంది. రాముడు రాముడుగా కాక ఒక గొప్పతేజస్సుగా ప్రకాశించాడు.

చివరిక్షణాల్లో తమ్ముడైన సుగ్రీవుణ్ణి పిలిచి తను చేసిన పొరబాటును ఒప్పుకున్నాడు. తన మెడలోని బంగారు దండ తీసి సుగ్రీవునికి వేసి, చివరికి ఆయన నోట మాట రాక ఏదో చెప్పాలనుకుని చెప్పలేక, కన్నీళ్లతో అంగదుని చేయి సుగ్రీవుని చేతిలో పెట్టిన సన్నివేశంలో విశ్వనాథ పాఠకుల గుండెలు బరువెక్కించారు. వాల్మీకి కంటే ఆర్ద్రతతో విశ్వనాథ ఈ సన్నివేశాన్ని చిత్రించారు. వాలి చివరిక్షణాల్లో పడిన మానసికసంఘర్షణను కళ్లముందుంచే తైలవర్ణచిత్ర మిది.

ఆయుర్వేదం

# చేదూ మంచిదే!

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390



**వేపచెట్టు అందరికి పరిచయమైన మహావృక్షం. దేశమంతా సంవత్సరమంతా దర్శనమిస్తుంది. దేవాలయాలలో వేపచెట్టు ఉండటం సర్వసాధారణం. ఉగాదిపండుగ సందర్భంగా వేపపువ్వుతో పచ్చడి చేసుకుని సేవించడం మనకందరికి తెలిసిన విషయం.**

**సంస్కృతంలో దీనిని నింబవృక్షం అంటారు. స్వస్థత లేదా ఆరోగ్యాన్ని చేకూర్చడం వల్ల నింబ అని, సర్వవిధాల శుభప్రదంగా, మంగళప్రదంగా ఉండుటచే సర్వతోభద్ర అని, వృక్షం యొక్క పరిసరం అంతా మంగళప్రదం అవుటచే పారిభద్రక అని, కుష్ఠువ్యాధిని నిర్మూలించేది, తగ్గించేది కాబట్టి, పిచుమంద లేదా పిచుమర్ద అని దీనికి పేరు. ఈ వేపతో మనకు కలిగే లాభాలెన్నో!**

గాదెలలో, బస్తాలలో ఉన్న బియ్యం పురుగుపట్టకుండా ఉండేందుకు ధాన్యం మధ్యలో వేపాకులను ఉంచుతారు. సాధారణంగా ఎవరికైనా పొంగు(మీజిల్స్), ఆటలమ్మ (చికెన్‌పాక్స్)లాంటి అనారోగ్యాలు కలిగినప్పుడు ఇంటి గుమ్మం వద్ద, రోగి పడక వద్ద వేపాకులు ఉంచడం మనకు తెలిసినవిషయమే. శరీరం మీద ఎక్కడైన దురదలు వస్తే వేపాకు వేసి కాచిన నీటితో స్నానం చేస్తారు. వేప పుల్లతో దంతధావన చేయడం భారతీయుల జీవన విధానంలో ఒక భాగం. అందుకే మన భారతీయులలో మధుమేహతీవ్రత ప్రస్తుతం ఉన్నంత ఎక్కువగా ఉండేది కాదు. వేపతో దంతధావనం చేయడం వల్ల నోట్లో శ్లేష్మదోషం తగ్గి నాలుకకు రుచి తెలుస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన వ్యాధికారక సూక్ష్మక్రిములు నశిస్తాయి. వేప ఆకులు, బెరడు, పువ్వులు, కాయలు, పండ్లు, గింజలు, వేర్లు, నిర్యాసం (బంక) మొదలగు అన్నింటిలో ఔషధగుణాలు ఉన్నాయి.

**దీర్ఘకాలికపుండ్లకు-** ఒక పాత్రలో 50 గ్రాముల వేపాకులు, 50 గ్రాముల నెయ్యి తీసుకుని పొయ్యి మీద పెట్టి వేపాకు నల్లగా అయ్యేంతవరకు ఉడికించి, దించి చల్లార్చి అంతా కలిపి నూరి నిల్వ ఉంచుకుని రోజు రెండుపూటలా పై పూత మందుగా లేపనం చేస్తుంటే దీర్ఘకాలిక వ్రణాలు, పుండ్లు మానిపోతాయి.

**డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వైరల్‌వ్యాధులు రాకుండా-** ఒకవారం పాటు రోజు ఉదయం పరగడుపున 5 వేపాకులు, 5 మిరియాలు కలిపి మింగాలి లేదా ఉంటగా చేసుకుని మింగవచ్చు. ఇలా వాడటం వల్ల సంవత్సరం పాటు ఇలాంటి వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది.

**చుండ్రు-** వారానికి రెండుసార్లు 250 మి.లీ. నీటిలో 20-25 వేపాకులు ఒక టీ స్పూన్ పసుపు కలిపి, 50 మి.లీ. నీళ్ళు మరిగేలా మరిగించి, దించి చల్లార్చి వడగట్టి తలంతా మాడుకు అంటేటట్లు పట్టించి గంట లేదా రెండు గంటలు ఆగి తలస్నానం చేస్తుండాలి.

**జలుబుకు-** 30 గ్రాముల వేపాకు, 15 గ్రాముల మిరియాల పొడి కలిపి తగినంత స్వచ్ఛమైన నీరు చేర్చి మెత్తగా నూరి చిరుశనగలంత మాత్రలను చేసి ఎండించి నిల్వ ఉంచుకుని పూటకి 1-2 మాత్రల చొప్పున రెండు లేదా మూడుపూటలా గోరువెచ్చనినీటిలో సేవిస్తుండాలి.

**కర్ణరోగాలకు-** 50 గ్రా. వేపాకులను 100 మి.లీ.ల ఆవ నూనెలో వేసి కలిపి సన్ననిమంటపైన ఆకులు నల్లగా మాడేంత వరకు మరిగించి 10 గ్రాముల పసుపు పొడి వేసి దించి చల్లార్చి వడగట్టి 10 మి.లీ. తేనె కలిపి ఉంచుకుని రోజు రెండుమూడుసార్లు 2-3 చుక్కలు చెవిలో వేస్తుంటే చెవినొప్పి, పోటు, బాధ, చెవి నుంచి చీముకారడం, చెవిలో హోరు లాంటి వివిధరకాల బాధలు తగ్గుతాయి.

**రక్త శుద్ధికి-** వేప చెక్కపొడి, బావంచాల పొడి ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకుని రోజు ఒకసారి రెండు గ్రాముల పొడిని ఒక టీ స్పూన్ తేనె లేదా 50 మి.లీ. నీటిలో కలిపి సేవించడం వల్ల రక్తశుద్ధి జరిగి వివిధరకాలైన చర్మరోగాలు తగ్గిపోతాయి.

ఓర్పు మనిషికి వజ్రకవచం లాంటిది!

# అంతారామమయం

రచన - డా॥ కంపల్లె రవిచంద్రన్
సైజు-1/8 డెమ్మి సైజు
పుటలు-120; వెల-రూ.120/-
ప్రతులకు
రచయిత సెల్ నెం.-
98487 20478

భద్రాచలక్షేత్రం పేరెత్తగానే రామదాసు, ఆయనను తలచుకోగానే భద్రాచలం అవినాభావసంబంధంగా భక్తుల హృదయాల్లో నిండుకున్న సన్నివేశాలు- నేటికీ ప్రతిపల్లెలోను చదువుగల్గిన ప్రతివ్యక్తిలోను 'ఏ తీరుగ నను దయ చూచెదవో...' వంటి కీర్తనలు, సామెతలుగా నిల్చినాయంటే అది రామదాసు గారి దివ్యలేఖినీ వైభవం, భక్తిభావన పరిపూర్ణ కవనవిశేషంగా భావించవచ్చు.

శ్రీరామనవమి వస్తే ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించేది- 'అదిగో భద్రాద్రి..' వంటి కీర్తనాతరంగాలు మనలను ఆకర్షిస్తుంటాయి. ఈ విధంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న రామదాసు కీర్తనల్లో 20 గ్రహించి వాటికి సంగీత సాహిత్య-భక్తి-వేదాంత-లౌకికవిషయాలతో గొప్పవివరణ-సులభశైలి భాషాయుక్తంగా డా॥కంపల్లె రవిచంద్రన్ గారందించి-వారు కూడా వ్యాఖ్యారూప రామదాసు విశేషులైనారనటంలో సందేహం లేదు. రవిచంద్రన్‌గారు ఇంతకు ముందే తమ విశేషకృతుల వల్ల సాహితీలోకప్రఖ్యాతులు- దీనికొక ఉదాహరణ. 'సప్తగిరి' మాసపత్రికలో వచ్చే 'కైంకర్యమే తనువు దాల్చితే'- రచన వీరి సర్వంకషమైన పరిశోధనా ప్రవణత పరిస్ఫుటం కావటానికాస్కారం కలది. **'అంతారామమయం'** - అనే ఈ గ్రంథానికి సుప్రసిద్ధ గ్రంథపరిష్కర్తలు, రచయిత అయిన మోదుగులరవికృష్ణ 'మనవిమాటలు' పేరున 22 పుటల గొప్పపీఠికను సంతరించి, బహువిషయాలను వెల్లడి చేయటమేగాక విలువైన 7 ఫోటోలను చేర్చినారు. ఇవి గోల్కొండనాటిరాజులు మొదలైన వారివి కావటం ఒక విశేషం.

రవికృష్ణగారి 'ముందుమాట'లో (8.పు) 'భద్రాచల' నామం తెల్పుతూ భద్రారెడ్డి అనే భక్తునివల్ల ఈ పేరు వచ్చిందని, మిగతాకథలన్నీ ఒక విధంగా కల్పితాలని అన్నారు. 'సారంగధరమాహాత్మ్యం' అనే ఒక 3 అశ్వాసాల అముద్రితప్రబంధంలో- సారంగుడు, భద్రుడు- భక్తులైన సోదరులు. వీరి తపస్సునకు మెచ్చి బ్రహ్మ ఉభయులనూ పర్వతాలపైన వెలసే దైవాలుగా శ్రీరామనామధారులుగా నిలుస్తారని ఇచ్చిన కారణంగా భద్రుని పేర నేటి భద్రాచలం, సారంగపాణి పేర'సారంగాచలం' వెలసినాయి. నేటి నల్గొండజిల్లా బండపాలెం సమీపంలో ఉన్న శ్రీరామక్షేత్రపర్వతమే సారంగాచలం. ఈ ప్రబంధకర్త గోవర్ధనం వెంకటనరసింహాచార్యకవి 1935లో అస్తమించాడు. ఇట్లానే మనక్షేత్రాలు దైవాలగూర్చిన కథలనేకం ఉంటాయి. 'అల్లనలింగమంత్రి' పద్యంలోని ఆదిశాఖ-నియోగుల్లో ఒకరు కావచ్చు. కాని ఆది - (ప్రథమ) శాఖ శ్రీవైష్ణవులు కూడా ఉన్నారు అనే విశేషవిషయం తెలుసుకుని ఆనందించని వారెవరు? **'వనే చరామః.....'** అనే శ్లోకానికి రవిచంద్రన్‌గారి వివరణ ఆకర్షణీయంగా ఉంది.

'నారాయణ యనరాదా-' కీర్తనలోని 'నారాయణ' శబ్దానికికున్న సంప్రదాయపరమైన విశేషాలను సులభరీతిలో తెల్పి రవిచంద్రన్‌గారు తమ పరిశీలనాపటుత్వాన్ని మరొకమారు నిరూపించుకున్నారు. 'మారుతే నమోస్తుతే..' కీర్తనలోని **'బుద్ధిబలాదిదానపోషితాఖిలదేవ'** అనేదాన్ని- సుందరకాండ విశేషాలతోనే గాక - హనుమను గూర్చిన బుద్ధిర్బలం యశోధైర్యం..' శ్లోకవిశేషాలను చాల వివరంగా తెల్పి భద్రాచలక్షేత్ర శ్రీరామసన్నిధి హనుమద్వైభవాన్ని గూడా ప్రవచించడం ఈ కీర్తనలోని ఒక విశేషం, ఇట్లా బహువిశేషవిషయసముపేతంగా రామదాసు కీర్తనల్లో ఇరవైని మాత్రమే వీరు తెల్పటం చూస్తే మిగతావి కూడా వీరి నుండి రావలెనని ఆశిద్దాం!

చదివించగలిగే చక్కని వచనరచన. తెలుగువారికి సప్తాద్రీశుడెట్లో మన భద్రగిరిరాముడు కూడా అత్యంత అధిష్ఠానదైవాలు. వీరిని అటు తాళ్లపాకవారు - ఇటు రామదాసు తనివితీరా కీర్తించి, వారేగాక మనలనూ ధన్యుల చేశారు. వీటన్నిటినీ వివరిస్తూ రవిచంద్రన్‌గారి ఈ వ్యాఖ్యారూప కీర్తనా విశేషరూపం **'అంతారామమయం'** తెలుగు సాహిత్యారామంలో అంతారామమయం చేసి ఆనందింపచేస్తున్నది.

*- డా॥ శ్రీరంగాచార్య.*

ఏప్రిల్, 2019

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ముఖ్యమైన పనుల కోసం స్వస్థానాన్ని వీడి ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. కార్య జయం. ఏప్రిల్ 15 నుండి దేహపీడ, హృదయ సంకటం, వేళాతిక్రమణభోజనం, బంధువులు, స్నేహితులతో మాట పట్టింపులు కల్గుతాయి. అశ్వినినక్షత్రం వారికి ఈ నెల శుభయోగాలు. భరణి, కృత్తిక వారికి సామాన్య ఫలాలు.



**వృషభం–** ఈ మాసంలో అన్నివర్గాల వారి ఆదాయానికి లోటుండదు. చర్మసంబంధ అనారోగ్యం కలిగే సూచనలు. ఏప్రిల్ 12వ తేదీ నుండీ బంధుమిత్రులతో, సుఖసంతోషాలతో ఉంటారు. అధిక ధనాదాయం. సమాజంలో గౌరవం, ఉన్నత స్థానాలు పొందుతారు.



**మిథునం–**ఉన్నతవిద్యల్లో రాణించుట, పెద్దల మన్ననలు పొందుట, బంధుమిత్ర సమాగమం, ఆరోగ్యం, అధికారవృద్ధి. మాసాంతంలో పెద్దల అండ, ధనలాభం, సంతోషం, కల్గుతాయి.



**కర్కాటకం–**సంతానం విషయంలో శ్రద్ధ వహిస్తారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి శుభారంభం చేస్తారు. అధికారహోదా పెరుగుట, ప్రభుత్వసన్మానాలు, ధనలాభాలు కల్గుతాయి.



**సింహం–** అన్నింటా విజయం మీదే. ఈ మాసంలో కుజ, గురుగ్రహాలూ అనుకూలం. మీ సంతానం మీకు ప్రయోజనకారి. ఉన్నతమైన అధికారం మీ సొంతం అవుతుంది. ఆస్మా, ఛాతీ సంబంధ ఋగ్మతలకు అవకాశం ఉంది.



**కన్య –** ఈ నెలలో గృహనిర్మాణానికి వ్యయం చేస్తారు. అపరిష్కృతసమస్యలకు పరిష్కారం లభిస్తుంది. స్థానచలనం, దూరప్రయాణాల వల్ల అలసిపోతారు.



**తుల–**జ్ఞాన సముపార్జనకు ప్రాధాన్యం ఇచ్చి, సమర్థవంతంగా కార్యనిర్వహణ చేస్తారు. సంవత్సరప్రారంభంలో యత్నకార్యసిద్ధి, కోర్టు వ్యవహారాల్లో పురోగతి, కొద్దిపాటి ఋణాలు చేయాల్సి వస్తుంది.



**వృశ్చికం–**లాభనష్టాలను బేరీజు వేసుకుని క్రమశిక్షణతో సంస్థలను ప్రగతిపథంలో నడుపుతారు. దూరప్రాంతాలను సందర్శిస్తారు. శుభకార్యనిర్వహణలు చేస్తారు. నిల్వచేసిన ధనం కొంత ఖర్చవుతుంది.



**ధనుస్సు–** అద్భుతమైన మానసికశక్తిని గల్గి వ్యవహరిస్తారు. రాజకీయ జన్మనక్షత్రం, జన్మ రాశిలో శనైశ్చరుని సంచారం కొంత ఇబ్బంది కల్గించినా విజయం సాధిస్తారు. నమ్ముకున్నసత్యానికి కట్టుబడుతారు. పనుల తొందర, మానసిక ఒత్తిడి శరీర, ఆరోగ్య విషయాలపై శ్రద్ధఅవసరం.



**మకరం–** సుఖం, మనోల్లాసం, బంధుమిత్రులతో కలిసి ఉండడం, సుఖజీవనం, పుత్ర సౌఖ్యం, సద్గోష్టి. ధనప్రాప్తి, గో, భూ లాభ ప్రాప్తి కల్గుతుంది. భూగృహస్థిరాస్తుల క్రయవిక్రయాలవల్ల లాభపడుట, పశుసంపద వృద్ధిపొందుట జరుగుతుంది.



**కుంభం–** ప్రతి విషయానికి పేచీలకు దిగుట, బంధువర్గాలతో ద్వేషం, దుష్టులతో స్నేహం, వ్యాధుల వల్ల తాపం. మాసాంతంలో మాత్రం కలసివస్తుంది. చేసిన తప్పు తెలుసుకోవడం, పశ్చాత్తాపం చెంది సక్రమమార్గంలో వర్తించడం జరుగుతుంది.



**మీనం–** కుటుంబవృద్ధి, ఆయురారోగ్య భోగ భాగ్యాలను అనుభవిస్తారు. నూతనవ్యాపారాలకు పెట్టుబడులు పెడతారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

______________________ (పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసిన భాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :

రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

40

# వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | 3 | | 4 | | ■ |
| 5 | ■ | | ■ | | ■ | | ■ | 6 |
| 7 | | ■ | 8 | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | 11 | ■ | |
| ■ | 12 | | | ■ | 13 | | | ■ |
| 14 | ■ | | ■ | 15 | ■ | | ■ | 16 |
| 17 | | ■ | 18 | | | ■ | 19 | |
| | ■ | 20 | ■ | | ■ | 21 | ■ | |
| ■ | 22 | | | | | | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

1)'గాయత్రి' మంత్రాన్ని సృజించిన మహర్షి(7); 7)ఆదాయం ఉంటే ఇది ప్రభుత్వానికి కట్టాలి(2); 8)గ్రంథాలయంలో పుస్తకాలకు ఇవి ఎక్కువగా పడుతూంటాయి(3); 9)మహావిష్ణువు అవతారాల్లో ఒకటి(2); 12)రామాయణ కర్త(3); 13)యమధర్మరాజుతో పోరాడిన పతివ్రత(3); 17)బలము(2); 18)సహజము అనుపదానికి వికృతి(3); 19)ఎనిమిది సంఖ్య తెలుగులో(2); 22)ప్రాచీనదిక్కు అనెడి స్త్రీ ముఖాన చంద్రుణ్ణి బొట్టుగా పెట్టుకున్నది. అను వ్యుత్పత్తి నిచ్చే పదము(7)

### నిలువు

2)విశ్వాసం కల్గిన జంతువు(2); 3)తెలుగులో 13వ తిథి(4); 4)ఆనందం(2); 5)మంగమ్మ ఇది చేసింది. దీని పేరుతో చలన చిత్రం ఉంది కదా!(3); 6)నుయ్యి(3); 10)పుట్ట(3); 11)ధాన్య విశేషం(3); 14)శ్రీవేంకటేశ్వరస్వామితో పాచికలాడిన వాడు(3) 15)శ్రీవిష్ణుమూర్తి మెడలోని మాల(4); 16)కోరిక(3); 20)పసిపిల్లల్ని ముద్దు చేస్తూ, ఆడిస్తూ చకారాన్ని ఉపయోగిస్తుంటారు(2); 21) 'రాకడ'లో చివరి అక్షరం మాయమైతే(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Dr. K.Radha Ramana, M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



## తిరుమల తిరుపతి దేవస్థానములు


'సప్తగిరి' ఆధ్యాత్మిక మాస పత్రిక (తెలుగు, తమిళం, హిందీ, ఆంగ్లం, కన్నడ, సంస్కృతం.)

ఇంటింటికీ 'సప్తగిరి' ! ఇది శ్రీవారి అక్షరసిరి !

### కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుని దివ్యవైభవం

ప్రతి మాసం... సప్తగిరిపత్రికలో చూడండి...చదవండి...





భగవంతుణ్ణి దర్శించటానికి
దేవదేవుణ్ణి చేరుకోవటానికి ఎన్నో మార్గాలు, పద్ధతులు.
అడుగడుగు దండాలవాడు,
ఆపదమొక్కులవాడు అయిన ఆ సప్తగిరీశుని
కొందరు పుష్పాలతో అర్చిస్తే.....
కొందరు అక్షరపుష్పాలతో ఆరాధిస్తారు.

శ్రీవారి అక్షరప్రసాదమైన 'సప్తగిరి'
చదవటం, చదివించటం కూడ స్వామివారికి చేసే ఉత్తమసేవే.

ప్రతి మాసం... 'సప్తగిరి' చదవండి... మీ ఆత్మీయులచే చదివించండి !
ప్రతిమాసం శ్రీవారిని దర్శించండి... తిరుమల విశేషాలు తెలుసుకోండి.

'సప్తగిరి' అభివృద్ధిని ఆకాంక్షించండి !
సప్తగిరి మాసపత్రికకు చందాకట్టండి, కట్టించండి !!

### చందా వివరాలు

| | | |
|---|---|---|
| విడి ప్రతి ...... | రూ. | 5-00 |
| సంవత్సర చందా... | రూ. | 60-00 |
| జీవిత చందా....... | రూ. | 500-00 |
| విదేశాలకు సం చందా... | రూ. | 850-00 |

గమనిక : సంస్కృతం పత్రికకు జీవిత చందాలేదు

కార్యాలయ పనిదినాలలో
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
పూర్తి వివరాలకు
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:
కార్యాలయం : 0877-2264543
డి.టి.పి. సెక్షన్ : 0877-2264359
సంపాదకుడు : 0877-2264360

మా చిరునామా:
ప్రధాన సంపాదకుడు
'సప్తగిరి' మాసపత్రిక కార్యాలయం
టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్,
కె.టి. రోడ్, తిరుపతి - 517 507

సలహాలు / సూచనలు / ఫిర్యాదులకు సంప్రదించండి
**sapthagiri_helpdesk@tirumala.org**

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams 25-03-2019
Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

రాముడు రాఘవుడు రవికులుడితడు |
భూమిజకు పతియైన పురుష నిధానము ||
అరయ పుత్రకామేష్టి యందు పరమాన్నమున |
పరగ జనించిన పరబ్రహ్మము ||

- అన్నమయ్య

